20-5Pg1exHMNWJQE.qxd:20-5Pg1exHMNWJQE.qxd 01/01/01 7:59 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ


తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
fb.com/vaartha Digital
Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
20-5-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 108 పేజీలు: 12 వెల: 6.50

సిందూర్‌లో ఎన్ని విమానాలు నష్టపోయాం?: రాహుల్ 9లో

బెంగళూరును ముంచెత్తిన భారీ వర్షాలు

## ప్రభావశీల నేతల్లో ప్రధానిమోడీ@9









టాప్-జిన్‌పింగ్

పుతిన్-2

డొనాల్డ్ ట్రంప్-3

**న్యూఢిల్లీ, మే 19:** ప్రపంచదేశాలను బహుళ రంగాల్లో ప్రభావితంచేసే ప్రముఖులుగా పది మంది ప్రముఖులు నిలిచారు. వీరు రాజకీయం, పాలనారంగం, వాణిజ్యరంగాలకు చెందినవారు కూడా లేక పోలేదు. భారత ప్రధాని నరేంద్ర మోడీకూడా తన బలమైన నాయకత్వం, సాహసోపేతమైన నిర్ణయాలతో ప్రపంచంలోని అత్యంతశక్తివంతమైన వ్యక్తుల జాబితాలోచేశారు. ఆయన మొదటిపది మందిలో తొమ్మిదో స్థానంలో నిలిచారు. >>2

## భారత్ ధర్మశాల కాదు..



### శరణార్థులు వెళ్లిపోవాలి: 'సుప్రీం'

**న్యూఢిల్లీ, మే 19:** భారతదేశం ధర్మశాల కాదని వివిధ దేశాల నుంచి వచ్చే శరణార్థులందరికీ ఆతిథ్యం ఇవ్వడం కుదరదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. శ్రీలంక తమిళ శరణార్థి దాఖలు చేసిన పిటిషన్ సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. శ్రీలంక తమిళ జాతీయుడి నిర్బంధంలో విషయంలో జోక్యం చేసుకోవడానికి సర్వోన్నత న్యాయస్థానం జస్టిస్ కే వినోద్ >>2

# 'సేవ'ల తీరుపై తనిఖీలు

### జూన్ 12 తర్వాత ఆకస్మిక తనిఖీలు చేస్తానన్న సిఎం చంద్రబాబు

### ప్రభుత్వసేవలపై ప్రజలకు పూర్తి సంతృప్తి లభించాలి

### దీపం లబ్ధిదారుల ఖాతాలో ఒకేసారి 3 సిలిండర్ల సొమ్ము

### ఆర్టీసిలో సౌకర్యాలు మెరుగుపడాలి: సిఎం



**విజయవాడ, మే 19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు సక్రమంగా అందుతున్నది లేని పరిశీలించేందు జూన్ 12 తరువాత ఎప్పుడైనా రాష్ట్రంలో ఆకస్మిక తనిఖీలు మొదలు పెడతానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, వివిధ ప్రభుత్వ సేవలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. ప్రతివారం నాలుగు శాఖల పరిధిలో పథకాలు, సేవలపై ప్రజలనుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు ఈ వారం రేషన్, దీపం, ఎపిఎస్ఆర్టీసీ, పంచా యతీ సేవలపై వెల్లడైన ప్రజాభిప్రాయాలను పరిశీలించారు. ఈ శాఖల పరిధిలో అమలు అవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల నుంచి ఐవిఆర్ఎస్, క్యూ ఆర్ కోడ్ వంటి విధానాల ద్వారా ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఈ అభిప్రాయాలపై సిఎస్, సిఎంవో సెక్రటరీలతో ముఖ్యమంత్రి చర్చించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావొస్తుందని అన్ని శాఖల్లో ప్రభుత్వ పనితీరు, ప్రజా సేవల విషయంలో పూర్తి స్థాయి సంతృప్తి కనిపించాలని సిఎం అన్నారు. కొన్ని శాఖల్లో మార్పు వచ్చిందని అయితే ఆర్టీసీ వంటి చోట్ల ఇంకా సేవల్లో నాణ్యత పెరగాల్సి ఉందని సిఎం అన్నారు. దీపం 2 పథకం ద్వారా లబ్దిదారులకు ఏడాదికి ఇచ్చే 3 సిలిండర్ల సబ్సిడీ మొత్తాన్ని ఒకేసారి ముందుగానే లబ్దిదారుల ఖాతాలో జమ చేస్తామని సిఎం అన్నారు. లబ్దిదారులు తమకు కావాల్సినప్పుడు దీపం పథకం కింద సిలిండర్ పొందవచ్చు... అయితే వారికి మూడు సిలిండర్లకు ఇచ్చే మొత్తాన్ని ప్రభుత్వం ముందుగానే చెల్లిస్తుంది. దీపం పథకం లబ్దిదారుల నుంచి ఏజెన్సీ వాళ్లు కానీ, ఇతర స్థాయిల్లో గాని ఎక్కడా డబ్బులు అదనంగా వసూలు చేసే పరిస్థితి ఉండకూడదన్నారు.

**రేషన్ సరుకుల పంపిణీపై అభిప్రాయాలు**

మీరు ఈ నెల రేషన్ సరుకులు తీసుకున్నారా అని ప్రశ్నించగా 74 శాతం మంది అవునని, వాటి నాణ్యతపై ఎలా ఉంది అంటే బాగుందని 76 శాతం మంది చెప్పారు. రేషన్ పంపిణీలో, నాణ్యతపై ప్రజల సంతృప్తిలో >>2



## బడి తెరిచిన రోజే పిల్లలకు పుస్తకాలు

### 'సంచి' బరువు తగ్గేందుకు సెమిస్టర్ విధానం

**విజయవాడ,మే 19,ప్రభాతవార్త ప్రతినిధి:** పాఠశాలలు పునఃప్రారంభమైన రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు చేపట్టింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో పుస్తకాల ముద్రణ, సరఫరాను వేగవంతం చేసింది. ప్రభుత్వ,ఎయిడెడ్ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం ఏటా ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందిస్తోంది. వీటిని రెండు సెమిస్టర్లుగా ముద్రిస్తున్నారు. అన్ని పాఠశాలలకు కలిపి సెమిస్టర్-1కు 1.64 కోట్ల పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, ఇప్పటికే 1.24కోట్ల వరకు జిల్లా కేంద్రంలోని గోదాములకు చేరాయి. అక్కడి నుండి 1.22 కోట్ల పుస్తకాలను మండల కేంద్రాలకు చేర్చారు. ముద్రణ కేంద్రాల నుండి జిల్లాలకు,అక్కడి నుండి మండలాలకు సరఫరా కొనసాగుతోంది. ఈ ఏడాది పాఠ్యపుస్తకాల బరువు తగ్గించేందుకు సెమిస్టర్ విధానం అమలు చేసి, రెండు పుస్తకాలను కలిపి ఒకే పుస్తకంగా ముద్రించారు. ఒకటి రెండో తరగతుల్లో తెలుగు, ఆంగ్లం, గణితం, సబ్జెక్టుకు కలిపి ఒకే పుస్తకంగా ముద్రించారు. ఇలాగే వర్క్‌బుక్‌లను కలిపి మరోటి తీసుకొచ్చారు. వీరికి రెండు పుస్తకాలు మాత్రమే ఉంటాయి. 3,4,5 >>2

## వల్లభనేని బెయిలు పిటిషన్‌పై విచారణ వాయిదా 2లో

# 'మన మిత్ర' మరింతగా ప్రజల్లోకి

### ప్రజలకు అన్ని సేవలు వాట్సప్ గవర్నెన్స్‌లోనే అందించాలి

### ఆర్టీజిఎస్‌లో డేటా అనుసంధానం త్వరగా జరగాలి

### అధికారులకు సిఎస్ ఆదేశాలు



ఆర్టీజీఎస్ కార్యకలాపాలపైన అధికారులతో సమీక్షిస్తున్న సిఎస్ విజయానంద్

**విజయవాడ,మే 19,ప్రభాతవార్తప్రతినిధి:** మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లి, ప్రభుత్వ సేవలన్నీ వారు మనమిత్రలో పొందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఆయన సోమవారం ఆర్టీజీఎస్ కార్యకలాపాలపైన సమీక్షించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ సేవల ప్రగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జూన్ 12వ తేదీలోపు మనమిత్ర ద్వారా ప్రజలకు 500 రకాల సేవలు ఇచ్చేలా అధికారులు పనిచేయాలన్నారు. ప్రజలు ఎవ్వరూ కూడా తమ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగనవసం లేకుండా అన్ని సేవలు మనమిత్ర ద్వారా పొందేలా చేయడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమన్నారు. ఆ దిశగా మనమిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడంలో సచివాలయ సిబ్బంది కీలక పాత్ర పోషించాలన్నారు. ఆర్టీజీఎస్‌లో డేటా అనుసంధాన ప్రక్రియ కూడా లక్ష్యాల మేరకు పూర్తయ్యేలా చూడాలన్నారు. డేటా అనుసంధానంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేలా ఆర్టీజీఎస్ సాంకేతిక సహకారాన్ని ఆయా శాఖలకు అందించడానికి వీలవుతుందన్నారు. పంచాయతీరాజ్ విభాగాధికారులనుద్దేశించి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, చెత్తతొలగింపు పనుల్లో కొంత పురోగతి కనించిందని, అయితే పారిశుద్ధ్య మరింత మెరుగుపడాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా కనిపించేలా చేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఆర్టీసీ సేవల్లో కూడా మరింత ప్రగతి సాధించాలని సూచించారు. డ్రోన్ మార్ట్ వెబ్ పోర్టల్‌ను ముఖ్యమంత్రి చేతులమీదు ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ పోర్టల్‌ను రూపొందించాలని సూచించారు. ఆర్టీజీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ప్రఖర్ జైన్ మాట్లాడుతూ ప్రస్తుతం వాట్సాప్‌గవర్నెన్స్ ద్వారా 325 సేవలను ప్రజలకు అందిస్తున్నామని, ఈ నెలా ఖరుకు 400 సేవలు అందిస్తామన్నారు. ప్రభుత్వ ఆశయంప్రకారం జూన్ 12వ తేదీకల్లా 500 సేవలు అందిస్తామన్నారు. వాట్సాప్ ద్వారా ప్రజలు డౌన్ లోడు చేసుకునే ధృవపత్రాల తనిఖీ కోసం బ్లాక్ చైన్ టెక్నాలజీని సమర్థంగా ఉప యోగిస్తున్నామన్నారు. ఏపీసేవలో 14,269 ధృవీకరణ పత్రాలకు, మీ సేవలో 1240 ధృవీకరణ పత్రాలకు బ్లాక్ చైన్‌టెక్నాలజీ అమలు చేయడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో పాత సర్టిఫికెట్లను కూడా బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా ధృవీకరించడం జరుగుతుందన్నారు. డేటాలేక్ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని చెప్పారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్, డైరెక్టర్ కృష్ణతేజ్, ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమలరావు, పౌరసరఫరాలశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ తదితరులు పాల్గొన్నారు.

### అమరావతిని కలుపుతూ విజయవాడ-గుంటూరు-తెనాలి

# సెమీ హైస్పీడ్ రైలు

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాయింట్ వెంచర్ ప్రాజెక్టు కింద అమలు

**గుంతకల్లు రైల్వే,మే 19,ప్రభాతవార్త:** రాష్ట్ర నవ్యాంధ్ర రాజధాని అమరావతిని కలుపుతు వేర్వేరుగా రెండు ప్రతిపాదిత మార్గాల మీదుగా సెమీ హైస్పీడ్ సర్క్యులర్ సబర్బన్ రైలు సేవలను అందుబాటులో తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈసబర్బన్ రైలు విధానం-2017 చేపట్టేందుకు రైల్వే మంత్రిత్వశాఖ సూత్రప్రాయంగా ఆమోదించినట్లు రైల్వే వర్గాలు చెబుతున్నాయి. భారతీయ రైల్వేలో నిత్యం రద్దీగా ఉండే హౌరా-చెన్నై ఈస్ట్‌కోస్ట్ కారిడార్‌లో రైళ్ల రద్దీ,ట్రాఫిక్ కారణంగా స్థానిక ప్రజల సౌకర్యార్థం పాసింజర్ రైలు సర్వీసులను నడపడం సాధ్యం కాని పరిస్థితి. నవ్యాంధ్ర రాజధాని అమరావతికి సెమీ హైస్పీడ్ రైలుసర్వీసు వ్యవస్థ భవిష్యత్తు అవసరాలకు ఎంతో అవసరమైంది. రాబోయే భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విజయవాడ-నంబూరు-అమరావతి-గుంటూరు-తెనాలి- విజయవాడ మధ్య సెమీ హైస్పీడ్ సర్క్యులర్ సబర్బన్ రైలు సర్వీసుల ఏర్పాటు ఎంతో అవసరం. ఈ ప్రాజెక్టు యొక్క ప్రాధాన్యతను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వి-జీ-టీ ప్రాంతంలో ట్రాఫిక్ సదుపాయాలను కల్పించేందుకు సబర్బన్ రైలు సేవలకై ప్రత్యేకంగా ఒక అలైన్మెంట్‌ను రూపొందించి, ఫిజిబిలిటీ,స్టడీ వివరాలతో కూడిన సమగ్రమైన ప్రాజెక్టు రిపోర్టు (డిపిఆర్)ను రూపొందించేందుకు ఆంధ్రప్రదేశ్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపిఎంఆర్‌సి), మెస్సర్స్ అర్బన్ మాస్ ట్రాన్సిట్ కంపెనీ(యుఎంటిసి)ని నియమించింది. ఈ సంస్థలు ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ఏపిసిఆర్‌డిఏ) పరిధిలో వచ్చే విజయవాడ, గుంటూరు, క్రిష్ణ కెనాల్, దుగ్గిరాల, తెనాలి, వెజెండ్ల, మంగళగిరి, సత్తెనపల్లి, నూజివీడు, గుడివాడ, గన్నవరం వంటి >>2

# ఆ నలుగురిని కస్టడీకి ఇవ్వండి

### కోర్టును కోరిన సిట్

### లిక్కర్ స్కామ్‌లో కీలక పరిణామం

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో(లిక్కరుస్కామ్) కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నిందితులు నలుగురిని కస్టడీకి ఇవ్వాలని విజయవాడ కోర్టులో సిట్ పిటిషన్ దాఖలు చేసింది. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణ మోహన్ రెడ్డి, ఈ కేసులో ఏ1గా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్‌గా ఉన్న బాలాజీ గోవిందప్పలను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు కోరారు. వీరు నలుగురిని కలిపి విచారించాల్సిన అవసరం ఉందని సిట్ బృందం పేర్కొంది. మద్యం ముడుపులు, కమిషన్ వ్యవహారంలో ఈ నలుగురికి తెలిసి కొన్ని విషయాలు జరిగాయని, అందువల్లే నలుగురిని కలిపి విచారించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అప్పుడు మాత్రమే ఈ కేసుకు తదనంతర దర్యాప్తునకు అవకాశం ఉంటుందని తెలిపింది. సిట్ పిటీషన్‌పై మంగళవారం విచారణ జరిగే అవకాశం ఉంది. మరో వైపు రాజ్‌కసిరెడ్డి వాంగ్మూలం రికార్డుచేసేందుకు అనుమతి ఇవ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విజయవాడకోర్టులో మూడురోజుల క్రితం పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌పై విచారణకు రాగా కసిరెడ్డి వాంగ్మూలం రికార్డు చేసేందుకు తమకు అనుమతి ఇవ్వాలని ఈడీ తరపున న్యాయవాదులుకోరారు. విచారణను ఏసీబీ కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. ఇదేసమయంలో నలుగురుకీలక నిందితులకస్టడీ పిటిషన్‌పై కోర్టురేపుఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే ఆసక్తికరంగా మారింది.

# నాలుగు రోజులు భారీ వర్ష సూచన

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో తీవ్ర ఉష్ణోగ్రతల నడుమ మోస్తరు నుంచి వర్షాలు కురుస్తున్నాయి, ఈ అనిశ్చిత నడుమ సాధారణ అంచనాల కంటే ముందుగా నైరుతి రుతుపవనాలు ఈ నెల 24 నాటికే కేరళను తాకే అవకాశాలున్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సాధారణ పరిస్దితులకు భిన్నంగా జూన్ 1కంటే ముందుగా ఈ నెల 27 నాటికి రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉందని వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేస్తోంది. పరిస్థితులు అనుకూలంగా మారడంతో వాటి గమనం వేగంగా ఉందని, ఇవే పరిస్థితులు కొనసాగితే ఈ నెల 26 నాటికి రాయలసీమ, ఈ నెల 29 నాటికి కోస్తాంధ్రలోకి ప్రవేశిస్తాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. 2013లో కేవలం 14 రోజుల్లోనే రుతుపవనాలు దేశమంతటా విస్తరించాయని, ఈ ఏడాది అంతకంటే వేగంగా కదులుతాయని వాతావరణ విభాగం తెలుపుతుంది. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు అండమాన్, నికోబార్ దీవులకు పూర్తిగా విస్తరించాయి. సాధారణం కంటే ఐదు రోజులు ముందుగానే ఈ ప్రక్రియ పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో నెలాఖరు నాటికి వేసవి దాదాపుగా ముగిసినట్లేనని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని >>2

## కారులో ఊపిరాడక నలుగురు చిన్నారులు మృతి

### విజయనగరంలో విషాదం

**విజయనగరం, మే 19 ప్రభాతవార్త ప్రతినిధి :** విజయనగరం మండలం పరిధిలోని ద్వారపూడి గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. కారు లాక్ పడటంలో అందులో చిక్కుకున్న నలుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నలుగురు చిన్నారులు ఆడుకునేందుకు బయటకు వెళ్ళారు. కానీ వాళ్ళు ఎంతసేపైనా తిరిగి రాలేదు. వాళ్ళ తల్లిదండ్రులు వెతికినా కనిపించలేదు. చివరికి స్థానిక మహిళా మండలి కార్యాలయం వద్ద ఆగి ఉన్న కారులో నలుగురు చిన్నారుల మృతదేహాలను అక్కడున్నవారు గుర్తించారు. సరదాగా ఆడుకునేందుకు కారు లోపలికి వెళ్లిన తర్వాత డోర్ లాక్ పడటంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు సమాచారం. మృతులను ఉదయ్ (8), చారుమతి (8), చరిష్మా (6), మనస్విగా గుర్తించారు. వీరిలో చారుమతి, చరిష్మా అక్కాచెల్లెళ్లు. ఒకేసారి నలుగురు పిల్లలు కన్నుమూయడంతో ద్వారపూడిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చిన్నారుల మృతదేహాలను పట్టుకుని తల్లిదండ్రులు, బంధువులు రోదించడం ప్రతి ఒక్కరి హృదయాన్ని ద్రవింపజేస్తోంది.

### నీటిగుంతలో పడి ముగ్గురు చిన్నారులు మృతి

కుప్పం మండలం దేవరాజపురంలో ఘటన 2లో

# హజ్‌యాత్రకు భారీ ఏర్పాట్లు

### మొత్తం 1630 మంది యాత్రికులు ఎపి నుంచి పయనం: మంత్రి ఎన్ఎండి ఫరూక్


**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ నుండి హజ్ యాత్ర 2025 కు బయలుదేరే యాత్రికులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అత్యంత పగడ్బందీగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లను పూర్తి చేసి పర్యవేక్షిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. హైదరాబాద్ ఎంబార్కేషన్ సెంటర్ నుంచి రెండవ విడతలో 906 మంది ఏపీ ప్రయాణికులు సోమ, మంగళవారాల్లో మూడు విమానాలలో హజ్ యాత్రకు జెడ్డాకు వెళ్తున్నారు. హైదరాబాదులోని లకడికపూల్ సెంటర్లో ఉన్న షా ఫంక్షన్ ప్లాజాలో ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమాన్ని మైనారిటీ మంత్రిత్వ శాఖ, హజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రెండవ విడత యాత్రకు బయలుదేరి వెళ్లే యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, మైనారిటీ మంత్రిత్వ శాఖ సలహాదారుడు ఎంఏ షరీఫ్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష,హజ్ కమిటీ సభ్యులు, తదితరులు జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రస్తుత ఏడాది పవిత్ర హజ్ యాత్రకు మొత్తం 1630 మంది యాత్రికులు వెళ్లడం జరుగుతున్నదని అన్నారు. ఇందులో 1170 మంది హైదరాబాద్ ఎం బార్కేషన్ కేంద్రం నుంచి, 451 మంది బెం గళూరు ఎంబార్కేషన్ కేంద్రం నుంచి, మిగిలిన 9 మంది ఇతర ఎంబార్కేషన్ కేంద్రాల నుంచి బయలుదేరడం జరుగుతున్నదని వెల్లడించారు. >>2



హజ్ యాత్రను ప్రారంభిస్తున్న మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

20-5pg2exHMNWJQE.qxd:20-5pg2exHMNWJQE.qxd 01/01/01 7:57 AM Page 1






భవిష్యత్తులో ప్రజల అవసరాల మేరకు రాష్ట్ర రాజధాని అమరావతిని కలుపుతూ రెండు వేర్వేరు ప్రతిపాదిత మర్గాలు.

# సెమీ హైస్పీడ్ రైలు

>> పరిసర ప్రాంతాలతో పాటు చిలువూరు, దుగ్గిరాల, కొలకలూరు, తెనాలి,సంగం, పాతగుంటూరు, గుంటూరు, కొరిటెపాడు, హిందూ కళాశాల హాస్టల్, గుంటూరు సిటీ, ఎంజి ఇన్నర్ రింగ్ రోడ్డు,ఆటో నగర్, నంబూరు, కాజా, తాడికొండ, పెద్దపరిమి రిజర్వాయర్‌ల మీదుగా సెమీ హైస్పీడ్ సర్క్యులర్ సబర్బన్ రైలు సర్వీసులను నడిపేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

# భారీ వర్ష సూచన

>> కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేస్తోంది. తూర్పు మధ్య అరేబియా సముద్రంలో కర్ణాటక తీరంలో బుధవారం ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. ఇది గురువారం నాటికి అల్పపీడనంగా, తర్వాత మరింత బలపడుతుందని అంచనా. దీని ప్రభావంతో రుతుపవనాలు మరింత వేగంగా ముందుకు కదిలే అవకాశాలున్నాయని వివరిస్తుంది. ఈ క్రమంలోనే రాయలసీమ, కోస్తాంధ్ర జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ విభాగం ముందుగా తెలిపినట్లే సోమవారం. చాలా చోట్ల చెదురుమదురుగా భారీ వర్షాలు నమోదయ్యే అయ్యాయి. కొన్నిచోట్ల ఎండ తీవ్రత అధికంగా నమోదు అయ్యే సూచనలు ఉన్నాయంది. ప్రకాశం, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల్లో ఉరుములు పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది.

ఇకప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో తెల్లవారుజాము నుంచి ఉరుములు మెరుపులతో వర్షం బీభత్సం సృష్టించింది. నగరంతో పాటు కొత్తపట్నం మండలం మోతిమాల, పాదర్తి, రంగయ్యపాలెం, ఆలూరు, అల్లూరు, ఈతముక్కల, రాజుపాలెం ఆయా గ్రామాల్లో జోరు వాన కురవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. నగరంతో పాటు కొత్తపట్నం గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. వర్షం దెబ్బకి ఆయా కాలనీల్లో ఆటోలు వెళ్లలేకపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద పెద్ద సంఖ్యలో వాన నీరు నిలిచిపోయింది. పంటలు వేసుకునే సమయంలో ఎడతెరపి లేకుండా వర్షం కురవడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షం పంటలకు ఎంతో మేలు కలిగిస్తుందని వారు భావిస్తున్నారు.ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి మున్సిపాలిటీలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి జిల్లా పరిషత్ పాఠశాల,మండల అభివృద్ధి కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలు నీట మునిగాయి.ఈ వాన పునాస పంటకు కొంత మేరకు ఇబ్బందికరంగానే ఉందని రైతులు వాపోతున్నారు.

# హజ్‌యాత్రకు భారీ ఏర్పాట్లు

>> ఈనెల 19,20వ తేదీలు సోమ,మంగళ వారాలలో మూడు విమానాల్లో మొత్తం 818 మంది హజ్ యాత్రికులు హైదరాబాద్ ఎంబార్కెషన్ కేంద్రం నుండి హజ్‌కు వెళ్తున్నట్లు తెలిపారు.మరో 88 మంది యాత్రికులు ఈనెల 27 వ తేదీ చివరి విమానంలో హజ్ యాత్రకు వెళ్తున్నట్లు తెలి పారు. విజయవాడ ఎంబార్కెషన్ నుంచి కేవలం 72 మంది యాత్రికులు మాత్రమే తమ ఆప్షన్ ఇవ్వడం కారణంగా, సాంకేతిక కారణాల వలన, భారత విమానయాన శాఖ ద్వారా స్పెషల్ చార్టర్ ఫ్లైట్ వసతి కల్పించలేని పరిస్థితితులలో, హజ్ కమిటీ ఆఫ్ ఇండియా, ముంబై ఆ 72మంది యాత్రికులను హైదరాబాద్ ఎంబార్కెషన్ నుండి బయలుదేరుటకు అనుమతించడం జరిగిందని పేర్కొన్నారు. గత నెలలో మొదటి విడతలో హజ్ యాత్రకు ఏపీ నుంచి 724మంది యాత్రికులు హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కెషన్ కేంద్రాల నుండి పవిత్ర మక్కా, మదీనా పుణ్యక్షేత్రాలకు వెళ్లడం జరిగిందని తెలిపారు. ఏపీ హజ్ యాత్రికులకు సంబందించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా ఏలాంటి లోటు పాట్లు లేకుండా పగడ్బందీగా ఏర్పాట్లు చేయడం జరిగిందని మంత్రి ఫరూక్ వెల్లడించారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, వ్యాక్సినేషన్ క్యాంపులు నిర్వహించడమైనదని, కర్ణాటక,తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు, ఆయా రాష్ట్రాల హజ్ కమిటీల తో, ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశాలు కూడా నిర్వహించి ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించామని తెలిపారు. పూర్తి సహకారాన్ని అందిస్తున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలకు మంత్రి ఫరూక్ ధన్యవాదాలు తెలిపారు. మన రాష్ట్రం నుండే నేరుగా హజ్ కి వెళ్ళేందుకు ఏర్పాట్లు ఉంటే మరింత సౌలభ్యంగా ఉంటుందని ఒక యాత్రికురాలు కోరగా, విజయవాడ ఎంబార్కెషన్ కోరే ప్రతి హజ్ యాత్రికుడికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తామని మంత్రి తెలిపారు. మైనారిటీ మంత్రిత్వ శాఖ ప్రభుత్వ సలహాదారుడు ఏంఏ షరీఫ్ మాట్లాడుతూ హజ్ యాత్రికులను సాగనంపే ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. హజ్ యాత్ర ఆధ్యాత్మిక ప్రయాణం మాత్రమే కాదని,సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సమానత్వాన్ని పెంపొందించే ముఖ్య సందేశమని పేర్కొన్నారు. హజ్ యాత్ర విజయవంతంగా సాగేలా అధికారులు, సిబ్బంది సహకారం అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ ఈవో గౌస్ పీర్, రెండు తెలుగు రాష్ట్రాల మైనార్టీ మంత్రిత్వ శాఖలు, హజ్ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వల్లభనేని బెయిలు పిటిషన్‌పై విచారణ వాయిదా

## కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు ఆదేశాలు

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** గన్నవరం మాజీ ఎంఎల్ఏ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత వల్లభనేని వంశీ మోహన్‌కు కొన్ని కేసుల్లో బెయిలు,ముందస్తు బెయిల్ వచ్చినా. ఇంకా జైలులోనే మగ్గాల్సిన పరిస్థితి వచ్చింది.

అయితే,నకిలీ పట్టాల పంపిణీ కేసు వ్యవహారంలో వంశీ బెయిలు పిటీషన్‌పై నేడు ఏలూరు జిల్లా నూజివీడు కోర్టులో విచారణ జరిగింది. నకిలీ పట్టాల పంపిణీ కేసులో తనకు బెయిల్ ఇవ్వా లంటూ వల్లభనేని వంశీ దాఖలు చేసిన పిటీషన్‌పై విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. నూజివీడు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు...ఆ తర్వాత వ్లభనేని వంశీ మోహన్ బెయిల్ పిటీషన్‌పై విచారణను రేపటికి వాయిదా వేసింది. కోర్టు కాగా ప్రస్తుతం గన్నవరం నియోజక వర్గంలో నకిలీ పట్టాల పంపిణీ వ్యవహారంలో విజయవాడ సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.

వల్లభనేని వంశీ మోహన్ ఆయన్ని మొ దట అరెస్ట్ చేసిన కిడ్నాప్ కేసు,ఆ తర్వాత గన్నవరం టిడిపి కార్యాలయంపై దాడి కేసు ఇలా అన్నికేసుల్లో బెయిల్,ముందస్తు బెయిలు వచ్చినా ఇప్పుడు నకిలీపట్టాల పంపిణీ కేసుల్లో వల్లభనేని వంశీమోహన్ రిమాండ్ ఖైదీగా ఉన్నారు .

# టెన్త్ పాసైతే 'మెయిన్' అంగన్‌వాడీలుగా మార్పు!

**విజయవాడ,మే 19,ప్రభాతవార్త ప్రతినిధి:** మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చాలనే ప్రధాన డిమాండ్ అమలు దిశగా ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మంగళవారం జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు తప్పనిసరిగటా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలనే నిబంధన ఉంది. ఇందుకనుగుణంగా మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే పని చేస్తున్న వారిలో పది పాస్ అయిన వారిని తొలిగా ఉన్నతీకరించి ఆ కేంద్రాలకు మెయిన్ హోదా ఇవ్వాలని అధికారులు ప్రతిపాదించారు. వీరు రాష్ట్రవ్యాప్తంగా 4,600 మంది వరకు ఉన్నారని లెక్కతేల్చారు. మినీ అంగన్‌వాడీ కార్యకర్తగా మారిస్తే రూ.11,500 లభిస్తుంది. అంటే ఒక్కొక్కరికి నెలకు రూ.4,500ల చొప్పున వేతనం పెరుగుతుంది. తద్వారా ప్రభుత ్వంపై ఏటా రూ.25 కోట్ల అదనపు భారం పడుతుంది.మిగిలిన వారు పది ఉత్తీర్ణత సాధించేందుకు గడువు ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 55,700 అంగన్‌వాడీ కేంద్రాలుండగా,వాటిలో 6,837 మినీ అంగన్‌వాడత కేంద్రాలున్నాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వ సేవలందించేందుకు గాను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త,ఆయా ఉంటారు.మినీ అంగన్‌వాడీ కేంద్రంలో కేవలం కార్యకర్త మాత్రమే ఉంటారు.మినీ అంగన్‌వాడీల్లో 200 వరకు ఖాళీలున్నాయి. 4,600 మినీ కేంద్రాల్లో పనిచేస్తున్న వారు పది ఉత్తీర్ణులయ్యారు. మిగతా చోట్ల విధులు నిర్వహిస్తున్న వారికి పదో తరగతి ఉత్తీర్ణత సాధించేందుకు ఏడాది/రెండేళ్ళ గడువు ఇచ్చి ఆ లోపు అర్హత సాధించిన వారిని ఉన్నతీకరించాలని ప్రతిపాదించారు.మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 300 చోట్ల 5 మంది కంటే తక్కువ లబ్దిదారులున్నారని అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. వీటిలో గిరిజన ప్రాంతాలు,ఎస్సీ,ఎస్టీ కాలనీల్లో ఉన్నవి మినహాయించి మిగిలినవి హేతుబద్ధీకరించాలని ప్రతిపాదించారు. కనీస లబ్దిదారులు కూడ లేని చోట క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించి అందరికీ ఆమోదయోగ్యమైన తర్వాతే హేతుబద్ధీకరించాలని సూచించారు. దీనిపై మంత్రివర్గం నిర్ణయం తీసుకోనుంది.

# 'తులాభారం'కానుకలు 'గోవిందా'!

## ఐదేళ్లలో భారీ స్కామ్ జరిగిందంటూ సంచలనం

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** వేంకటేశ్వరస్వామికి భక్తులు కోరికలు తీరిన వెంటనే ప్రియంగా చెల్లించే మొక్కుల కానుకలు పక్కదారిపట్టాయంటూ తిరుమల తిరుపతి దేవస్థానంలో సంచలనంగా మారింది. చిన్నపిల్లల నుండి వయోవృద్ధుల వరకు భక్తులు కోరికలు నెరవేరిన వెంటనే తులాభారం త్రాసులో ఓ వైపు భక్తుడు, మరోవైపు నాణేలు, చక్కెర, బెల్లం, కలకండ,డ్రైఫ్రూట్స్,బియ్యం ఇలా ఏదైనా వారి బరువుకు తగ్గట్లు మొక్కుబడులుగా వేస్తారు. అంతే బరువుకు సరిపడే నగదును టిటిడికి అందిస్తారు. ఇక్కడ రెండు, ఐదురూపాయలు నాణేలు ఉంచి బరువు తూకం వేస్తారు. భక్తుడు ఎంత బరువుంటే అంత సొమ్ము నగదు రూపంలో అక్కడ సిబ్బందికి అప్పగించి మొక్కులు తీర్చుకోవడం పరిపాటి. ఈ చెల్లించిన నగదు గత ఐదేళ్లలో సగంవరకు వెంకన్న ఖజానాకు చేరలేదనేది ఇప్పుడు గుప్పుమంటున్న ఆరోపణలు. ఇలా రోజుకు ఐదులక్షల నుండి 10లక్షల రూపాయల వరకు తులాభారంకానుకలు అందుతాయనేది టిటిడి వర్గాల సమాచారం కూడా. ఈ మొత్తాన్ని ఏరోజుకారోజు దేవుని ఆదాయం లెక్కల్లో చూపాలి. అయితే గత ఐదేళ్లలో సగం ఆదాయం టిటిడికి జమకాలేదనేది ఇప్పుడు సంచలనం రేకెత్తించింది. స్వయంగా టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డి తులాభారం కానుకలు స్వాహా చేశారంటూ ఆధారాలతో సహా ప్రభుత్వ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ విభాగంకు ఫిర్యాదు చేయడం మరింత చర్చనీయాంశంగా మారింది. మరీ ఇదే నిజంగా అవినీతి జరిగిఉంటే దేవుని సొమ్మును స్వాహా చేసిన సూత్రధారులు, పాత్రధారులు ఎవరనేది ఇప్పుడు విజిలెన్స్ దర్యాప్తులో తెరపైకి రానున్నారు.

**తులాభారం మొక్కుబడుల లెక్కలేవీ!:** కలియుగప్రత్యక్షదైవం ,ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా సమర్పించుకునే కానుకల్లో నిలువుదోపిడీ మొక్కులు, తలనీలాలు, కాలినడక,తులాభారం అంటే ఎంతో ప్రియం. భక్తులు తమ మొక్కులను తీర్చుకోవడానికి రోజువారీగా లక్షమంది వరకు తిరుమలకు వస్తున్నారు. దేశవ్యాప్తంగానేగాక విదేశాల్లో ఉన్న భక్తులు ,ప్రముఖులు కూడా తమకు ఏదేనికష్టం వస్తే ముడుపుకట్టి తిరుమలేశునికి మొక్కుకుంటారు. కష్టాల నుండి బయటపడగానే కొండకు చేరుకుని మొక్కుతీర్చుకుంటున్నారు. ఇలా రోజువారీగా హుండీకి సుమారుగా 4కోట్ల రూపాయలు కానుకలు చేకూరుతుంటాయి. ఆ తరువాత తులాభారం మొక్కుల్లో 10లక్షల వరకు ఆదాయం వస్తుందని టిటిడి వర్గాల సమాచారం. ఆలయంలోపల మహద్వారం దాటగానే ధ్వజస్తంభానికి పక్కన తులాభారం ఉంటుంది. కోరికలు నెరవేరిన భక్తులు పిల్లలకేగాకుండా పెద్దలకు కూడా తులాభారం




వేస్తారు. గత ఐదేళ్లలో తులాభారం కానుకలు సగానికిపైగా గత టిటిడి పాలకమండలి పెద్దల జేబుల్లోకి వెళ్ళిందని తాజాగా భానుప్రకాశ్‌రెడ్డి ప్రధాన ఆరోపణ. తులాభారం కానుకలు అక్రమాలపై గతంలోనే అప్పటి టిటిడి ఇఒకు కూడా ఫిర్యాదుచేసినా దర్యాప్తు చేపట్టామని, చర్యలు తీసుకోలేదని వెల్లడించారనేది ఇప్పుడు భానుప్రకాశ్ చేసిన వ్యాఖ్యలు సంలచనంగా మారాయి. రోజుకు శ్రీవారిని 70వేలమంది వరకు భక్తులు సరాసరి దర్శనం చేసుకుంటుండగా 30వేలమంది వరకు భక్తులు మొక్కుబడుల్లో తలనీలాలు సమర్పిస్తుంటారు.మరో వందమంది వరకు తులాభారం మొక్కులు తీర్చుకోవచ్చని అంచనా. గతంలో తులాభారం వద్ద బ్యాంకు కాంట్రాక్టు సిబ్బంది విధులు నిర్వహించేవారని, వారిని తొలగించినగత పాలకమండలి టిటిడి ఉద్యోగులను నియమించారన్నారు. తులాభారం త్రాసులోనూ మ్యాజిక్ చేశారని చెబుతున్నారు. రోజుకు వందమంది వరకు తులాభారం వేసిన భక్తుల సంఖ్య తగ్గించి నిధులు స్వాహా చేశారనేది ప్రధాన ఆరోపణ. ఈ సొమ్ము ఎవరికి చేరిందనేది త్వరలోనే ప్రభుత్వ విజిలెన్స్ అధికారులు తేల్చనున్నారు. ఇదే సమయంలోదేవదేవుని ఆభరణాలు భద్రంగానే ఉన్నాయా?అనే అనుమానాలు శ్రీవారి భక్తులను కలచివేస్తోంది.

# ప్రధానిమోడీ @9

>> లిచారు. దక్షిణాదిప్రపంచంలో ఆయన పాత్ర, చురుకైన దౌత్యం, పెరుగుతున్న ఆర్థిక శక్తి ఆయనను నేటి అత్యంత ప్రభావవంతమైన వ్యక్తులలో ఒకరిగా చేశాయి. ప్రపంచంలోని టాప్ 10 శక్తివంతమైన వ్యక్తుల జాబితాను చూసుకుంటే అందులో మొదటి స్థానంలో చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ ఉన్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశానికి అధ్యక్షుడిగా ఉన్నారు. రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నారు. ఆయన నిర్ణయాలు గ్లోబల్ రాజకీయాలు. రెండోస్థానంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉన్నారు. 2000 సంవత్సరం నుంచి రష్యా అధ్యక్షుడిగా ఉన్న పుతిన్ తన దగ్గర ఉన్న సైనిక శక్తి సహజ వనరుల ద్వారా భౌగోళిక రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. రష్యాలో ఉన్న అతిపెద్ద సహజ వాయు నిల్వలు, స్పేస్ ప్రోగ్రామ్‌లు ప్రపంచంపై ఆయన ప్రభావాన్ని పెంచుతున్నాయి. ఇక మూడో స్థానంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక, సైనిక శక్తి అయిన అమెరికాను నడిపిస్తున్నారు. అమెరికన్ రాజకీయాలతో పాటు ప్రపంచ వ్యవహారాలను, ముఖ్యంగా తన బలమైన సాహసోపేతమైన ప్రకటనలతో ప్రభావితం చేస్తారు. నాలుగో స్థానంలో జర్మనీ మాజీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్ తన ప్రశాంతమైన, తెలివైన నాయకత్వంతో కొనసాగారు. ఈమె యూరప్‌లోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను నడిపించారు. ఇక ఐదోస్థానంలో అమెజాన్ వ్యవస్థా పకుడు జెఫ్ బెజోస్ ప్రపంచంలోని అత్యంత ధనవంతులలో ఒకరు. ఆన్‌లైన్ రిటైల్, అంతరిక్ష అన్వేషణలో విజయం ఆయనను శక్తివంతమైన ప్రపంచ వ్యక్తిగా మార్చింది. ఆరో స్థానంలో నిలిచిన రోమన్ కాథలిక్ చర్చి మాజీ పోప్ పోప్ ఫ్రాన్సిస్ ప్రపంచవ్యాప్తంగా ఒక బిలియన్ కంటే ఎక్కువ మంది కాథలి క్కులకు ఆధ్యాత్మిక నాయకుడు. ఆయన 21 ఏప్రిల్ 2025న అనారోగ్యంతో మరణించారు, మతాన్ని మాత్రమే కాకుండా ప్రపంచ విధానాలను కూడా ఈయన ప్రభావితం చేశారు. ఏడో స్థానంలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ తన ఫౌండేషన్ ద్వారా, ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, విద్య, పేదరిక నిర్మూలనలో ప్రభావం చూపుతున్నారు. ఎనిమిదవ స్థానంలో సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మొహమ్మద్ బిన్ సల్మాన్ ప్రపంచంలోనే అత్యధిక చమురు ఎగు మతి చేసే దేశాన్ని పాలిస్తున్నారు. ఆయన సౌదీ సమాజంలో సాహసోపేతమైన సంస్కరణలు తీసుకొచ్చారు.

ఇక తొమ్మిదో స్థానంలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందింది. జాతీయ భద్రత, ప్రపంచ దౌత్యంపై ఈయన బలమైన నిర్ణయాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రభా వాన్ని చూపాయి. పహల్గామ్ దాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత వైమానిక దళం పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరంపై దాడి చేయ డంతో ఉగ్రవాదాన్ని భారత్ సహించదని ప్రపంచానికి తెలియజెప్పారు. పదో స్థానంలో గూగుల్ సహ వ్యవస్థాపకుడు లారీ పేజ్ ఉన్నారు. ఇతను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ సర్వీసెస్‌లో గూగుల్ ద్వారా ఇన్ఫర్మేషన్ యాక్సెస్‌ను మార్చివేశారు. టెక్ ఇన్నోవేషన్‌లో అగ్రగామిగా, గ్లోబల్ డిజిటల్ ల్యాండ్‌స్కేప్‌ను రూపొందిస్తున్నారు.

# ధర్మశాల కాదు..

>> చంద్రన్‌తో కూడిన ధర్మాసనం నిరాకరించింది. పిటిషన్‌పై వాదనల సందర్భంగా భారతదేశం ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే శరణార్థులకు ఆతిథ్యం ఇవ్వగలదా మేము 140 కోట్ల మందితో ఇబ్బంది పడుతున్నాం. ఇది అన్ని దేశాల నుంచి వచ్చే విదేశీ పౌరులకు ఆతిథ్యం ఇచ్చేందుకు ధర్మశాల కాదుఅని జస్టిస్ దీపాం కర్ దత్తా అభిప్రాయపడ్డారు. యుఎపిఎకేసులో విధించిన ఏడు సంవత్సరాల జైలుశిక్ష ముగి సిన వెంటనే పిటిషనర్ వెంటనే భారతదేశం విడిచి వెళ్లాలని ఆదేశించిన మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులను సవాల్‌చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారించింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ శ్రీలంక తమిళుడని, వీసాపై ఇక్కడికి వచ్చాడని తెలిపారు. స్వదేశంలో తన ప్రాణానికి ముప్పు ఉందని ధర్మాసనానికి చెప్పారు. పిటిషనర్ దాదాపు మూడు సంవత్సరాలుగా నిర్బంధంలో ఉన్నారని తెలిపారు. పిటిషనర్ ఓ శరణార్థి అని ఆతని భార్య, పిల్లలు ఇక్కడ భారత్‌లోనే స్థిరపడ్డారని న్యాయవాది తెలిపారు. పిటిషనర్ భార్య పలు ఆరోగ్య సమస్యలు, కుమారుడు పుట్టుకతోనే గుండె జబ్బులతో బాధపడుతు న్నారని పేర్కొన్నారు. అయితే, జస్టిస్ దత్తా పిటిషనర్ భారతదేశంలో నివసించేందుకు ఉన్న చట్టబద్ధమైన హక్కు ఏంటని ప్రశ్నించారు. ఆర్టికల్ 19 కింద స్థిరపడే హక్కు భారత పౌరులకు మాత్రమే వర్తిస్తుందని, తగిన చట్టపరమైన ప్రక్రియను అనుసరించినందున ఆర్టికల్ 21 ఉల్లంఘన జరగలేదని జస్టిస్ దత్తా పేర్కొన్నారు. పిటిషనర్ తన దేశంలో ప్రాణా లకు ముప్పు ఎదుర్కొంటున్నారని న్యాయవాది తెలుపగా వేరే దేశానికి వెళ్లండి అని జస్టిస్ దత్తా వ్యాఖ్యానించారు. ఇటీవల రోహింగ్యా కేసులోనూ జోక్యం చేసుకునేం దుకు సుప్రీం కోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే.

# లక్నో జట్టుపై ఆరెంజ్ ఆర్మీ సూపర్ విక్టరీ: ఆరువికెట్ల తేడాతో ఎల్ఎస్జీ ఓటమి

## ప్లే ఆఫ్స్‌నుంచి లక్నో నిష్క్రమణం

**లక్నో, మే 19:** ఐపిఎల్ 18వ సీజన్‌లో 61వ మ్యాచ్‌లో ఆరెంజ్ ఆర్మీఘన విజయం సాధించింది. సోమవారం లక్నోలో జరిగిన ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు లక్నోసూపర్‌జెయింట్స్‌పై ఆరువికెట్ల తేడాతో గెలిచింది. పదిబంతులు మిగిలి ఉండగానే విజయం సాధించడం ఆరెంజ్ ఆర్మీకి గర్వకారణం. తొలుత బ్యాటింగ్‌చేసిన లక్నోజట్టు ఏడు వికెట్ల నష్టానికి 205 పరుగులుచేసి ప్రత్యర్థికి 206 పరుగుల లక్ష్యం విధించింది. తదనంతరం చేపట్టిన ఆరెంజ్ ఆర్మీ బ్యాటింగ్ ప్రతిభనుచూపించి నాలుగు వికెట్ల నష్టానికి 206 పరుగులుచేసి అనుకున్న లక్ష్యం పూర్తిచేసింది. దీనితో ఆరు వికెట్ల తేడాతో ఆరెంజ్ ఆర్మీగెలిచింది. ఈ ఓటమితో లక్నోజట్టు ప్లే ఆఫ్స్ రేసు నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.



లోక్‌సభ మాజీ స్పీకర్ నీలం సంజీవరెడ్డి జయంతి సందర్భంగా పార్లమెంటుహౌస్ వద్ద నివాళులర్పించిన దృశ్యం

# 'సేవ'ల తీరుపై తనిఖీలు

>> పశ్చిమగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. అదే విధంగా గ్యాస్ డెలివరీ సమయంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారా అనే అంశంలో 62 శాతం మంది లేదు అని చెప్పారు. పలు చోట్ల ఈ విషయంలో సమస్య ఉందన్నారు. నేరుగా వారి ఖాతాల్లో ముందుగానే డబ్బులు వేయడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఆర్టీసీ సేవల విషయంలో ప్రయాణికుల నుంచి ఆశిం చన స్థాయిలో సంతృప్తి వ్యక్తం కాలేదని, ఈ విషయంలో అధికారులు మరింత ప్రభావవం తంగా పనిచేయాలని సిఎం అన్నారు. బస్స్టాం డ్‌లలో తాగునీటి సౌకర్యం, టాయిలెట్ల నిర్వహణ విషయంలో ప్రయాణికుల నుంచి అసంతృప్తి వస్తోందని దీన్ని సరిచేసుకోవాలని సిఎం అన్నా రు. మంచి నీటిపై 44 శాతం, టాయిలెట్లపై 55 శాతం మంది అసంతృప్తి వెల్లడించారు.

**పంచాయతీల్లో సేవలు గతం కన్నా మెరుగు**

ఇక పంచాయతీ సేవల విషయానికి వచ్చేసరికి ఇంటి నంచి చెత్త సేకరణ జరుగుతుందా అనే ప్రశ్నకు 60 శాతం మంది అవుననే చెప్పారు. గతంతో పోల్చుకుంటే గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ మెరుగైందని సిఎం అన్నారు. రానున్న రోజుల్లో డ్వాక్రా మహిళలకు తడిచెత్త నిర్వహణ బాధ్యత అప్పగించి కంపోస్ట్ తయారీ చేపడతామని సిఎం అన్నారు.

**ప్రభుత్వ సేవల్లో డాటా అనలటిక్స్ కీలకం**

పభుత్వ సేవల విషయంలో డాటా అనలటిక్స్ కీలకమని సిఎం అన్నారు. డాటా ఆధారంగా ఆయా ప్రభుత్వ శాఖల తమ పనితీరును క్షేత్ర స్థాయి నుంచి పరిశీలించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను సమర్థవంతంగా విశ్లేషిస్తే ప్రభుత్వ సేవల్లో అనూహ్య మార్పులు తేవచ్చన్నారు. ఒక ప్రభుత్వ పథకం, లేదా కార్యక్రమంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తం అవుతున్న సందర్భంలో వాటికి కారణాలను తెలుసుకుని దానికి అనుగుణంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలన్నారు. ప్రతి శాఖలో ఉన్నతాధికారులు ఆయా శాఖలపై వచ్చే డాటాపై అనలటిక్స్ ద్వారా సేవలను మెరుగుపరచాలని సిఎం సూచించారు.

**వాట్సాప్ గవర్నెన్స్‌లో జూన్ నాటికి 500 సేవలు**

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 325 సేవలు అందుతున్నాయి. మన మిత్ర ద్వారా వాట్సాప్ సేవలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు 45 లక్షల మంది ఈ సేవలను విజయవంతంగా వినియోగించు కున్నారు. జూన్ 12వ తేదీ నాటికి 500 సేవలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికి సంబంధించి కసరత్తు జరుగుతోంది. అదే విధంగా ప్రభుత్వ ప్రతిపాదిత డ్రోన్ సిటీ ఓర్వకల్ ఇండస్ట్రియల్ నోడ్‌లో 300 ఎకరాల్లో ఏర్పాటు కానుంది. ఇందులో మొదటి దశ 116 ఎకరాల్లో నెలకొల్పుతున్నారు. దీనిలో 38 సంస్థలు భాగస్వాములు అయ్యేందుకు ఆసక్తి చూపించాయి. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించి డిపిఆర్ సిద్ధం కాగా... టెండర్ల ప్రక్రియ జూన్ 12 నాటికి పూర్తి అవుతుంది.

# ప్రశాంత నగరంలో 'ఉగ్ర కలకలం'

**విజయనగరం , మే 19 ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రశాంతతకు మారు పేరైన విజయనగరం కలకలం రేగింది. విద్యల నగరంగా భాసి ల్లిన విజయనగరం లో ఉగ్రవాదుల కదలిక ఉందన్న వార్త జిల్లాలోనే కాకుండా ఉత్తరాంధ్రా తో పాటు రాష్ట్రంలోనే సంచలనం సృష్టించింది. సిరాజ్ ఉర్ రెహ్మాన్ అనే యువకుడ్ని అరెస్టు చేసిన పోలీసులు అనంతరం కొనసాగిస్తున్న దర్యాప్తులో విస్తుపరిచే విషయాలు వెలుగులోకి రావడంతో జిల్లావాసులు దిగ్భ్రాంతికి గురవుతున్నారు. నిఘా వర్గాలకు దొరికిన సిరాజ్ తన స్నేహితులతో కలిసి హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్రపన్నాడని సమాచారం.పోలీసుల జాయింట్ అపరేషన్లో సిరాజ్ పట్టుబడడం, విచారణలో అతను వెల్లడించిన సమాచారం మేరకు ఓ ఇంట్లో పేలుడు పదార్థాలు పట్టుబడడం, వాటిని సీజ్ చేసిన పోలీసులు, సిరాజ్ ను హైదరాబాద్ తీసుకెళ్లి విచారించారని తెలిస్తోంది. ఈ దర్యాప్తులో హైదరాబాదులో సమీర్ అనే యువకుడి పేరు కూడా తెరపైకి రావడంతో అతన్ని కూడా అరెస్టు చేసి ఉగ్ర కోణంలో తమదైన శైలిలో దర్యాప్తు చేస్తున్న అధికారులను నమ్మలేని నిజాలు అవాక్కయ్యేలా చేస్తున్నాయి. ఈ వ్యవహారం లో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనేది దర్యాప్తు బృందాలు శోధిస్తున్నాయి.

# పిల్లలకు పుస్తకాలు

>> తరగతుల్లో గణితం, ఈవీఎస్‌ను కలిపి ఒకటి,తెలుగు,ఆంగ్లం కలిపి మరో పుస్తకంగా ముద్రించారు. ఇలానే వర్క్‌బుక్‌లను ముద్రించారు. ఈ తరగతులకు నాలుగు పాఠ్యపుస్తకాలే ఉంటాయి. 6 నుండి 9 తరగతుల వరకు తెలుగు,ఆంగ్లం,హిందీ పాఠ్యపుస్తకాలను కలిపి ముద్రించారు.మూడు భాషలను కలిపి ఒకే పుస్తకంగా తీసుకొచ్చారు. రెండు సెమిస్టర్లుగా వీటిని ముద్రిస్తున్నారు.8,9 తరగతుల్లో జీవశాస్త్రం,భౌతిక-రసాయన శాస్త్రా లు కలిపి ఒకే పుస్తకంగా తీసుకొచ్చారు. సాంఘిక శాస్త్రంలో భౌగోళిక చరిత్ర,ఆర్థిక, పౌర శాస్త్రాలు కలిపి ఒకే పుస్తకంగా ముద్రిం చారు. అక్టోబరులో రెండో సెమిస్టరు పుస్తకాలు అందిస్తారు. సెమిస్టర్ విధానం కావడంతో పుస్తకాల సైజు తగ్గిపోయింది. పదోతరగతికి వచ్చే సరికి సెమిస్టర్ విధానం లేకుండా పుస్తకాలు ముద్రించారు.

# నీటిగుంతలో పడి ముగ్గురు చిన్నారులు మృతి

**కుప్పం, మే 19 ప్రభాతవార్త:** ఆటలాడుకునేందుకు వెళ్లిన ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన చిత్తూరు జిల్లా కుప్పం మండలం దేవరాజపురంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందినసుమతి,రాజా దంపతుల కుమార్తె షాలిని (6), వరలక్ష్మి,తిరుపతిల కుమార్తె గౌతమి (7) , యశోద, శరవణన్‌ల కుమారుడు అశ్విన్ (6)లు ఆదివారం తమ ఇళ్ల సమీపంలో ఉన్న చర్చి వద్దకు ఆడుకునేందుకు వచ్చారు. అక్కడే ఆటలాడుకుంటూ చర్చి సమీపంలో ఉన్న నీటి గుంత వద్దకు వెళ్లి అక్కడ ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు. స్థానికులు గమనించి హుటాహుటిన నీటి గుంతలో పడిన చిన్నారులను పైకి తేగా అప్పటికే వారు మృతి చెందిఉన్నారు. కాగా ఈ విషాద సంఘటనపై ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. విషయాన్ని సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లగా సిఎం ఆదేశాలతో ప్రభుత్వం తరపున తక్షణ సాయంగా ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల వంతున అందించాలని జిల్లా కలెక్టర్, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్‌లకు ఆదేశించారు.

# వారం - వర్జ్యం

తేది : 20-05-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
సప్తమి ఉ.5.51, అష్టమి తె.4.55
ధనిష్ఠ రా.7.27
వర్జ్యం రా.2.29-తె.4.03
దు.ఉ.8.11-9.03, 2) రా.11.44-12.36
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది. పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు.

**వృషభం :** గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం నిదానంగా దాలుస్తాయి. ఆరోగ్యంపట్ల మెలుకువ అవసరం.

**మిథునం:** శ్రమ తప్ప ఫలితం ఉండదు. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**కర్కాటకం:** ప్రయాణాలలో తొందరపాటు వద్దు. అనుకోని ఖర్చులు ఎదురై చికాకులు పెడతాయి.

**సింహం:** కొత్త విషయాలు తెలుసుకుంటారు. అప్రయత్న కార్యసిద్ధి పొందుతారు. స్వల్ప ధనలాభం పొందుతారు.

**కన్య :** విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**తుల :** శత్రువులు సైతం మిత్రులుగా మారి సాయం అందిస్తారు. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి.

**వృశ్చికం:** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి సకాలంలో పూర్తిచేస్తారు. బంధువుల నుండి శుభవార్తలు వింటారు.

**ధనుస్సు:** కుటుంబంలో ఏర్పడిన సమస్యలు కొంత వరకు పరిష్కరించుకుంటారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**మకరం:** విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త అవసరం. వృత్తి, వ్యాపారాలలో ఒడిదుడుకులు. ధనవ్యయం.

**కుంభం:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆదాయం తగ్గుతుంది మానసిక అశాంతి.

**మీనం :** వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఇరిగేషన్ పనులు, నిర్వహణ, మరమ్మతులకు రూ.344 కోట్లు

## - జలవనరుల మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు



అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:**ఇరిగేషన్ పనులు, నిర్వహణ మరమ్మతుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ 344 కోట్లు విడదల చేశారని జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈనెలాఖరు నాటికి ఓఅండ్ఎం పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఇరిగేషన్ పనుల కోసం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకుంటూ వర్క్స్ వెంటనే మొదలుపెట్టాలని అన్నారు. ఓ అండ్ ఎం పనులపై ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ అధికారులతో సోమవారం ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓ అండ్ ఎం పనుల ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇంత పెద్ద మొత్తంలో నిధులను మంజూరు చేయటం ముదావహమన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభానికి ముందు అంటే, నేటి నుంచి కేవలం పది పన్నెండు రోజులు మాత్రమే ఉన్నందున తక్షణం పనులను ప్రారంభించి పూర్తి చేయాల్సి ఉందని మంత్రి సూచించారు. ఇందుకు సూపరిండెంట్ ఇంజనీర్లు, చీఫ్ ఇంజనీర్లు నిరంతర పర్యవేక్షణ చేయటం ద్వారానే సకాలంలో పూర్తి కాగలవన్నారు. 10 లక్షలు దాటిన పనులకు ఏడు రోజుల గడువులో పూర్తి చేసే విధంగా షార్ట్ టెండర్లు పిలవాలని సూచించారు. రూ 10 లక్షల లోపు ఉన్న పనులను సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టుకోవచ్చని రామానాయుడు తెలిపారు. ఆ రకంగా ఎక్కడికి అక్కడ సాగునీటి సంఘాలను చైతన్య పరచడం ద్వారా పనులు త్వరితగతిని పూర్తయ్యేలా చైతన్య పరచాలని ఇరిగేషన్ అధికారులకు,ఎమ్మెల్యేలకు సలహా ఇచ్చారు. గత ప్రభుత్వం ఓ అండ్ ఎం పనులను గాలికి వదిలేసిందని మంత్రి విమర్శించారు. కాలవల్లో తట్ట మట్టి తీయలేదు అన్నారు. కనీస మరమ్మతులైన షట్టర్లు, డోర్లు, గేట్లకు మరమ్మతులు చేయడం మరిచిందన్నారు. కనీసం గ్రీజు కూడా పెట్టలేదు అన్నారు. గతంలో వందలు, వేల కోట్లు వ్యయం చేసి ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, కాలువలు డ్రైన్స్ నిర్మిస్తే, 2019లో వచ్చిన ప్రభుత్వం తన ఐదేళ్ల పదవీకాలంలో కనీస మెయింటెనెన్స్ చేయకుండా గాలికి వదిలేసిందని మంత్రి రామానాయుడు విమర్శించారు. ఫలితంగా ఆ పనులన్నీ పాడు పడే పోయే విధంగా తయారయ్యాయి అని అన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరిచేసుకుంటూ ఇరిగేషన్ రంగాన్ని ఇప్పుడిప్పుడే గాడిలో పెడుతున్నట్టు చెప్పారు. టెలికాన్ఫరెన్స్లో పలు జిల్లాల ఎమ్మెల్యేలు, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్, కడా కమిషనర్ రామసుందర్ రెడ్డి, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీఈలు, ఎస్ ఈలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రోడ్డుపై కుక్కను తప్పించబోయి ప్రమాదం

## పల్టీ కొట్టిన కారు.. ముగ్గురు వ్యక్తులు మృతి

**ప్యాపిలి మే19ప్రభాతవార్త:** జాతీయ రహదారిపై దూసుకుపోతున్న కారు.. సేన్ గా అడ్డు వచ్చిన కుక్క.. తప్పించ బోయిన డ్రైవర్..అదుపు తప్పిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం. నంద్యాలజిల్లా ప్యాపిలి మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై కుక్క అడ్డం రావడంతో తప్పించ పోయి అదుపు తప్పి కారు పక్కనున్న చెట్లలోకి దూసుకెళ్లిన కారు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

శ్రీశైలం దైవ దర్శనానికి వెళ్లి తిరిగి కర్ణాటక రాష్ట్రం తుంకూరుకు కేఏ 02 ఎంకె 4525 నెంబర్ గల కారులో ఆరుగురు వెళ్ళుతుండగా ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు.తీవ్రంగా గాయపడిన సంతోష్ (36), నవీన్(43),లోకేష్ )(35) లను డోన్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం కర్నూ లు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వివరించారు.





# పాకాల రైల్వే జంక్షన్‌కు మహర్దశ

**పాకాల, మే 19 ప్రభాతవార్త** తిరుపతి జిల్లా పాకాల రైల్వే జంక్షన్‌కి, దామల చెరువు రైల్వే స్టేషన్‌కి కొద్ది రోజులలో మహర్దశ పట్టబోతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చిత్తూరు ఎంపీ దగ్గుమల్ల ప్రసాదరావు ప్రత్యేక చొరవతో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సహాయ సహకారాలతో పాకాల మండలానికే మనిహారం ఈ రైల్వే డబ్లింగ్ లైన్, పాకాల మీదుగా వెళ్లే ప్రయాణికుల దశాబ్దాల తరబడి ఎదురుచూస్తున్న కల త్వరలో నెరవేరబోతోంది. ఇప్పటికే 1332 కోట్ల రూపాయలతో తిరుపతి నుండి కాట్పడి వరకు డబ్లింగ్ పనులకు కేంద్రం ఆమోదం తెలిపిన విషయం ప్రజలకు తెలుసు. కొత్తగా పాకాల నుంచి ధర్మవరం వరకు డబ్లింగ్ మరియు విద్యుదీకరణ కోసం పూర్తిస్థాయిలో కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో ఇక్కడి ప్రజలు మరియు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో టెండర్లు పూర్తిచేసుకుని క్షేత్రస్థాయిలో పనులు మొదలు కాబోతూ ఉండటం శుభ పరిణామం అని ప్రజలు అంటున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ డబుల్ ఇంజన్ సర్కార్ పాలనలో ధర్మవరం పాకాల కాట్పాడి డబ్లింగ్ పనుల మొత్తానికి కలిపి 2900 కోట్లు, ధర్మవరం పాకాల విద్యుదీకరణకు 231.1 కోట్లతో పనులు ప్రారంభంకానున్నాయి. త్వరలో దామలచెరువు కేంద్రంగా మ్యాంగో, ఎక్స్పోర్ట్ కారిడార్ పనులకు కూడా వడివడిగా అడుగులు పడుతున్న సందర్భంలో ఈ ప్రాజెక్టుల వలన పాకాల దామలచెరువు రూపు రేఖలు మారి ఇక్కడి యువతకు ఉపాధి కల్పన పెరగటమే కాకుండా భూముల ధరలు పెరిగి మంచి రోజులు రావటం స్వాగతించాల్సిన విషయం అని ప్రజలు అంటున్నారు.

# త్వరలో తిరుపతి మీదుగా విజయవాడ - బెంగళూరు మధ్య వందేభారత్



**గుంతకల్లు రైల్వే,మే 19,ప్రభాతవార్త** రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్‌లోని తిరుపతి మీదుగా విజయవాడ-బెంగళూరు-విజయవాడ మధ్య తాజాగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను నడిపించేందుకు రైల్వే శాఖ నిర్ణయించినట్లు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. రైల్వే వర్గాల సమాచారం ప్రకారం విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లే నెంబర్ 20711వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఆయా నిర్ణీత రోజులలో ఉదయం 5-15గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి, తిరుపతి 9-45/50, బెంగళూరుకు మధ్యాహ్నం 2-15గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బెంగళూరు నుంచి విజయవాడ వెళ్లే నెంబర్ 20712వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఆయా నిర్ణీత రోజులలో మధ్యాహ్నం 2-45గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి, తిరుపతి సాయంత్రం 6-55/7-00,విజయవాడకు రాత్రి 11-45గంటలకు చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైళ్లు తెనాలి,ఒంగోలు, నెల్లూరు,చిత్తూరు,కాట్పాడి,క్రిష్ణరాజాపురం స్టేషన్లలో నిలుస్తాయి.

# మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా శైలజ బాధ్యతలు

**విజయవాడ,మే19,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఏ ఒక్క మహిళకు అన్యాయం జరిగినా, వారి హక్కులను కాలరాసేందుకు ప్రయత్నించినా కఠిన చర్యలు తప్పవని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా రాయపాటి శైలజ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ముందుగా వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించి పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ శైలజ మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా, రాజకీయాలకు అతీతంగా పనిచేస్తానని తెలిపారు. గత ఐదేళ్లలో మహిళా కమిషన్ లో ఫిర్యాదులను పట్టించుకోలేదని, పాత ఫిర్యాదుల దుమ్ముదులిపి ఫిర్యాదు చేసిన ప్రతి ఒక్కరికి



న్యాయం చేస్తానని హామి ఇచ్చారు. అవసరమైత జాతీయ మహిళా కమిషన్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియా వేదికగా మహిళలపై అసభ్య పోస్ట్ లు పెడుతున్నారని, వారు తమ తీరు మార్చుకోవాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని రాయపాటి శైలజ హెచ్చరించారు. విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే మహిళలపట్ల గౌరవం పెంచేలా అవగాహన సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. దీంతో ఖచ్చితంగా సమాజంలో మార్పు తీసుకురావచ్చన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ మహిళలకు అన్యాయం జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని, సమాచారం మాకు అందిన వెంటనే పరిష్కారం దిశగా కృషి చేస్తామన్నారు. ఫిర్యాదుల కోసం తమ శాఖ ఆధ్వర్యంలో ఒక వెబ్ సైట్ రూపొందించనున్నామన్నారు. ఈ వెబ్ సైట్ ద్వారా ఫిర్యాదులు చేయడంతో పాటు తమ ఫిర్యాదు ఏ దశలో ఉందో కూడా తెలుసుకునే ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ కు పూర్వ వైభవం తీసుకువస్తామని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, కేంద్ర మంత్రివర్యులు పెమ్మసాని చంద్రశేఖర్.వివిధ నాయకులకు తన కృతజ్ఞతలు తెలియజేశారు.

# పిఎస్ఎల్వి-సి61 వైఫల్యంపై రెండు బృందాలతో విశ్లేషణ కమిటీ





**శ్రీహరికోట (తడ), మే 19 ప్రభాతవార్త** పిఎస్ఎల్వి-సి61 రాకెట్ వైఫల్యంపై భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) విశ్లేషణ మొదలుపెట్టింది. ఫెయిల్యూర్ అనాలసిస్ కమిటీల ద్వారా లోపం ఎక్కడ జరిగిందన్న దానిపై ఆరా తీస్తున్నారు. నాలుగు దశలతో నిర్మించిన ఈ రాకెట్ మూడవ దశలో దారి తప్పింది. ఆదివారం పిఎస్ఎల్వి వైఫల్యం తర్వాత ఇటు శ్రీహరికోటతో పాటు అటు ఇస్రోలోను విభిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఈ రాకెట్ నిర్మాణంలో అత్యధిక భాగం పాలుపంచుకున్న శ్రీహరికోటలో శాస్త్రవేత్తలు తలెత్తుకోలేని పరిస్థితి ఏర్పడింది. రాకెట్ ఫెయిల్ కావడంతో పాటు అందులో ప్రయోగించాల్సిన అత్యంత విలువైన ఉపగ్రహం ఇఓఎస్09 కూడా నిర్వీర్యం కావడంతో శాస్త్రవేత్తల పనితీరును అందరూ ప్రశ్నిస్తున్నారు. అంతరిక్ష కక్ష్యలోకి వెళ్లిన ఈ రాకెట్‌లోని నాలుగో దశ, ఉపగ్రహాన్ని నిర్మూలించినట్లు అనధికార సమాచారం. అయితే ఇస్రో అధికారికంగా ఇప్పటికీ వివరణ ఇవ్వలేదు. ఈ రాకెట్ నిర్మాణం ముఖ్యంగా రెండు ఘన ఇంధన దశలు పూర్తిగా శ్రీహరికోటలోనే నిర్మించారు. ఇక్కడే ఘన ఇంధనాన్ని నింపారు. ప్రస్తుతం 101వ రాకెట్ వైఫల్యం తర్వాత కారణాలను పసిగట్టేందుకు ఇస్రో రెండు కమిటీల ద్వారా విశ్లేషణ వేగవంతం చేసింది. రాకెట్ వేగం, అతి వెళ్లిన ఎత్తు, అందులోని ఇంజన్ల పనితీరు తదితర అంశాలపై ఈ కమిటీలు అధ్యయనం చేస్తున్నాయి. మూడవ దశ మోటారులో ఇంధన ప్రవాహం గురించి, నాజిల్ సమస్యలు గురించి తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా రాకెట్ల ఫెయిల్యూర్ సమయాన ఒక దశ నుంచి మరొక దశకు మోటార్లు అంటుకోవడం వంటి చర్యల్లో ఏదయినా లోపం జరిగిందా అన్నది కూడా చర్చనీయాంశంగా ఉంది.

అసలు ఈ మోటారు డిజైన్ తయారీలో లోపాల గురించి కూడా ఆరా తీస్తున్నారు. నాజిల్ నియంత్రణ వ్యవస్థలో మూడవ దశలోపల ఉన్న పరికరాలు ఏమయినా సరిగ్గా పనిచేయలేదా అన్న దాని మీద కూడా చర్చిస్తున్నారు. మొత్తంమీద అలవోకగా తారాజువ్వల్లాగా పదే పదే ప్రయోగించిన పిఎస్ఎల్వి రాకెట్ కీలక సమయంలో మొరాయించడం కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పక తప్పని పరిస్థితి ఇస్రోది. ఇదిలావుంటే రాకెట్‌లోని నాలుగవ దశ, ఇఓఎస్ 09 ఉపగ్రహం జనావాసాలపై పడకుండా నిర్మూలించినట్లు చెప్తున్నారు. అది కూడా అధికారికంగా ప్రకటించకపోవడం విశేషం.

# కసిరెడ్డి పిటిషన్‌పై సుప్రీం కోర్టులో ముగిసిన విచారణ.. తీర్పు రిజర్వు

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ లిక్కర్ స్కాం కేసులో తన అరెస్ట్ చట్ట వ్యతిరేకమంటూ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి దాఖలు చేసిన పిటీషన్‌పై సుప్రీం కోర్టులో విచారణ పూర్తి అయ్యింది. తీర్పును జస్టిస్ పార్థీవాలా ధర్మాసనం రిజర్వ్ చేసింది. హైదరాబాద్‌లో నోటీసు ఇచ్చినప్పుడు చెప్పిన కారణాలు వేరని, కస్టడీ రిపోర్టులో వేరే కారణాలను వెల్లడించారని కసిరెడ్డి తరపు న్యాయవాది వాదించారు. విజయవాడకు తీసుకొచ్చిన తరువాత అవినీతి నిరోధక చట్టం కింద కూడా కేసు నమోదు చేశారని తెలిపారు. అరెస్ట్ సమయంలో కానీ, కస్టడీ సమయంలో కానీ పీసీ యాక్ట్‌పై కసిరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయలేదని, సుప్రీం పిటీషన్‌లో మాత్రం కొత్త అభ్యంతరాలను లేవనెత్తుతున్నారని ఏపీ ప్రభుత్వ తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా వాదనలు వినిపించారు. ఆంధ్రాకు చెందిన సీఐడీ వేరే రాష్ట్రంలో నోటీసులు ఇవ్వడం కూడా చెల్లవంటూ కసిరెడ్డి తండ్రి ఉపేందర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఇరు తరపు వాదనలను లిఖిత పూర్వకంగా సాయంత్రంలోగా ఇవ్వాలని సుప్రీం ధర్మాసనం తెలిపింది. విచారణ ముగియడంతో తీర్పును తరువాత వెల్లడిస్తామని సుప్రీం కోర్టు పేర్కొంది. బెయిల్ కోసం ఏపీ హైకోర్టును ఆశ్రయించాలంటూ ఉన్నతన్యాయస్థానం అభిప్రాయపడింది. ఏపీ మద్యం కేసులో తన అరెస్ట్ చట్ట వ్యతిరేకమని కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, తన కొడుకు అరెస్ట్‌లో నిబంధనలు పాటించలేదని.. అంతేకాకుండా తనకు ఇచ్చిన నోటీసులు చెల్లవంటూ కసిరెడ్డి తండ్రి ఉపేందర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై ఈరోజు (సోమవారం) సుప్రీంలో విచారణ ముగిసింది. జస్టిస్ పార్థీవాలా ధర్మాసనం ఈ కేసు విచారణను ముగించి తీర్పును రిజర్వ్ చేసింది. కసిరెడ్డి, ఉపేందర్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది మహేష్ జత్మలానీ వాదించారు. ఆంధ్రాకు చెందిన సీఐడీ వేరే రాష్ట్రంలో నోటీసులు ఇవ్వడం చెల్లదన్న వాదనలను కూడా పరిగణలోకి తీసుకోవాలని వాదించారు. అయితే కసిరెడ్డి, ఆయన తండ్రి దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్‌లను గతంలో హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఇద్దరు కూడా సుప్రీంలో సవాల్ చేశారు. వాదప్రతివాదనలు విన్న ధర్మాసనం ఇరువురి వాదనలను లిఖిత పూర్వకంగా సోమవారం సాయంత్రానికి ఇవ్వాలని ఆదేశించింది.

### విద్యుదాఘాతంతో యువకుడు మృతి

**వింజమూరు (నెల్లూరు), మే 19, ప్రభాతవార్త :** విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం వింజమూరులో చోటు చేసుకుంది. బైరవరం గ్రామానికి చెందిన బోగిరెడ్డి చిన్న ఓబుల్‌రెడ్డి(23) స్తంభానికి చేయి తగలడంతో వెంటనే విద్యుత్ షాక్‌కు గురై పడిపోయాడు. వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు రాగా అతనిని వైద్యులు కాపాడేందుకు ప్రయత్నం చేశారు.గుండె స్పందన లేకపోవడంతో కాపాడలేకపోయారు.


# విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి కాంగ్రెస్ అల్టిమేటం

**విజయవాడ,మే 19,ప్రభాతవార్త ప్రతినిధి:**విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి కాంగ్రెస్ పార్టీ అల్టిమేటం జారీ చేసింది.మంగళవారం లోగా తొలగించిన 2 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి లేకుంటే ఈ నెల 21 నుండి స్టీల్ ప్లాంట్ ఎదుటే ఎపిసిసి చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఆమరణ దీక్ష చేపడతామని హెచ్చరించారు.ఆ మేరకు ఆమె ఒక ప్రకటన జారీ చేసారు.స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికుల ప్రయోజనాల కోసం ప్రాణత్యాగానికి సిద్ధమన్నారు..విశాఖ ఉక్కు యాజమాన్యానిది నిరంకుశ ధోరణి అన్నారు.డిమాండ్ల సాధనపై రేపటి నుండి కార్మికులు సమ్మెబాట పడుతుంటే కనీసం దిద్దుబాటు చర్యలకు దిక్కులేదు.కార్మికుల సమస్యలు పరిష్కారించాలన్న కనికరం లేదు.దిక్కున్న చోట చెప్పుకోండనే తీరున యాజమాన్యం వ్యవహరిస్తోంది.ఇప్పటికే 2 వేల మంది కాంట్రాక్ట్ కార్మికుల పొట్ట గొట్టిన యాజమాన్యంమరో 3 వేల మందిని రోడ్డున పడేసేందుకు కుట్రలు చేయడం దుర్మార్గం అన్యాయాన్ని ప్రశ్నించిన కార్మికులను సైతం ఉద్యోగాల నుండి సస్పెండ్ చేయడం దారుణం కాంగ్రెస్ పార్టీ పక్షాన విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యానికి అల్టిమేటం ఇస్తున్నాం. మంగళవారం లోగా తొలగించిన 2 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తక్షణం విధుల్లోకి తీసుకోవాలి.రెగ్యులర్ ఉద్యోగులకు 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణం చెల్లించాలి 2021 జనవరిలో తీసుకున్న స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలి.స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటన చేయాలి..లేకుంటే రేపటి నుండి కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు మద్దతుగా ఈ నెల 21 నుండి స్టీల్ ప్లాంట్ బయట ఆమరణదీక్షకు దిగుతాం.ఆంధ్రుల హక్కు-విశాఖ ఉక్కు స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం,కార్మికుల ప్రయోజనాల కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధమన్నారు.

# తిరుమల సమాచారం

## వెంకన్నకు మైసూరు రాజమాత భారీ కానుక

### - శతాబ్దాల తరువాత అఖండ వెండిదీపాలు సమర్పణ



**తిరుమల,మే 19ప్రభాతవార్తప్రతినిధి:** అత్యంత సంపన్నవంతమైన దేవుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి మైసూరురాజమాత ప్రమోదాదేవి భారీ కానుకను అందించారు. శతాబ్ధాల తరువాత మైసూరురాజు కుటుంబానికి చెందిన రాజమాత ఆలయంలోపల సన్నిధిలో (గర్భ గుడిలో) నిరంతరంగా వెలిగే సాంప్రదాయ వెండి అఖండ దీపాలను విరాళంగా సమర్పించారు. ఒక్కో వెండి అఖండం సుమారు 50 కిలోలు బరువుంటుంది. సుమారు 300 సంవత్సరాల క్రిందట అప్పటి మైసూరుమహారాజు ఇలాంటి దీపాలను ఆలయానికి విరాళంగా అందించినట్లు ఆలయ శాసనాల్లో ఉంది. మళ్ళీ మైసూరు రాజమాత ఇప్పుడువాటిని సమర్పించుకోవడం విశేషం. ఆలయంలోపల రంగనాయకుల మండపంలో ఆమె టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి భారీ వెండి అఖండాలను అందజేశారు. కార్యక్రమం అనంతరం టిటిడి అధికారులు రాజమాతకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ప్రత్యేకంగా సత్కరించారు.రాజమాతపై ఛైర్మన్ నాయుడు ప్రశంసలు కురిపించారు.ఈ రెండు అఖండదీపాలు గర్భగుడిలో మరింత ఆధ్యాత్మిక శోభను పెంచుతాయి. ఆలయంలో నిరంతరాయంగా వెలుగుతున్న శాశ్వత అఖండ దీపాలు ప్రపంచంలో శాంతి, భక్తి విశ్వాసాలకు ప్రతీకగా భావిస్తారు.

## శ్రీవారి ఆశీస్సులందుకున్న జస్టిస్ దుర్గాప్రసాద్



**తిరుమల,మే 19ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు అందుకున్నట్లు హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం ఉదయం కుటుంబసభ్యులతో కలసి విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులందుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం అందజేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీవారి చిత్రపటం బహుకరించారు.

## శ్రీవారి సేవలో పార్లమెంట్ కమిటీ



**తిరుమల,మే 19ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం ఉదయం స్టడీ సైన్స్ టెక్నాలజీ పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ భువనేశకవర్ కలిత సభ్యులతో సహా ఆలయంలోనికి చేరుకున్నారు . టిటిడి అధికారులు స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తులాభారం నిధులు స్వాహాపై విచారణ చేయండి

### - విజిలెన్స్ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు టిటిడి బోర్డు సభ్యుడు భానుఫిర్యాదు



**తిరుమల,మే 19ప్రభాతవార్తప్రతినిధి:** గత ఐదేళ్ళ జగన్‌ప్రభుత్వం హయాంలో తిరుమలలో భారీగా అక్రమాలు చోటుచేసుకున్నాయని, శ్రీవారి ఆలయంలోని తులాభారం నగదును అక్కడ సిబ్బంది తస్కరించారని టిటిడి బోర్డు సభ్యుడు జి.భానుప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. ఈ అక్రమాలపై విచారణ చేపట్టి అసలు దొంగలు ఎవరో తేల్చాలని సోమవారం మధ్యాహ్నం తిరుపతిలోని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎస్పీ కరీముల్లా షరీఫ్‌కు ఫిర్యాదు చేశారు.టిటిడిని ధనార్జన క్షేత్రంగా మార్చి స్వామివారి ఖజానా స్వాహా చేశారంటూ గత ప్రభుత్వ పాలకులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలోని తులాభారం నగదు స్వాహాపై విచారణ చేపట్టి కేసు నమోదు చేయాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. అందుకు సంబంధించి తనవద్దవున్న ఆధారాలను విజిలెన్స్ ఎస్పీకి అందజేసినట్లు ఆయన చెప్పారు. 2019 నుండి 2024 వరకు విచారణ చేపట్టాలని ఎస్పీని కోరినట్లు భానుప్రకాశ్‌రెడ్డి తెలిపారు. గతంలోని ఉన్నతాదికారులు, విజిలెన్స్ సిబ్బందిని విచారణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తులాభారంలో జరిగిన అక్రమాలను అప్పటి టిటిడి విజిలెన్స్ అదికారులు బయటపెట్టినా గత ఉన్నతాధికారులు వాటిని బుట్టదాఖలు చేశారని గుర్తుచేశారు. భక్తులు సమర్పించిన కానుకలను సగం లెక్కలు చూపి సగం దొంగతనంగా తీసుకెళ్ళారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పరకామణిలో దొంగతనం చేసిన ఉద్యోగిని చెట్టుక్రింద పంచాయతీ చేసినట్లుచేసి ,భేషరతుగా విడిచిపెట్టారని చెప్పారు.వీటన్నిటిపై సమగ్ర విచారణ చేపట్టి అసలు దొంగలను తేల్చాలని భానుప్రకాశ్‌రెడ్డి కోరారు.

## దేవునిచెంత కల్యాణవేదికలో ఉచిత వివాహాలు

### - ఆన్‌లైన్‌లో బుకింగ్‌కు అవకాశం

**తిరుమల,మే 19ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమలకొండపై ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ఆయన చెంత పేద,మధ్యతరగతి వర్గాల యువతీయువకులు ఉచితంగా కల్యాణాలు చేసుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. ఇందుకోసం తిరుమలలోనే పాపవినాశనమ్ మార్గంలో అత్యాధునిక సౌకర్యాలతో కల్యాణవేదికను నిర్మించి అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. ఇందుకు తెలుగురాష్ట్రాలనుండేగాక దేశం నలుమూలల నుండి కూడా యువతీయువకుల కుటుంబాలు ఆన్‌లైన్‌లోనే వారివారికి ఇష్టమైన తేదీల్లో బుక్‌చేసుకునేలా అవకాశం ఉంది. తిరుమలలో టిటిడి నిర్వహిస్తున్న ఉచిత వివాహాలకు నూతన వధూవరుల నుండి విశేష స్పందన లభిస్తోంది. 2016 ఏప్రిల్ 25నుండి 2025 మేనెల 1వరకు 26,214 వివాహాలు అయ్యాయి. ఇందులో పురోహితుడు, మంగళవాయిద్యంతోబాటు పెళ్ళిసమయంలో పసుపు,కుంకుమ,కంకణంను టిటిడి ఉచితంగా అందిస్తుంది. వివాహానికి అవసరమైన సామాగ్రిని వధూవరులే తీసుకురావాల్సి ఉంటుంది. వివాహానికి వధూవరుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాల్సి ఉంటుంది. పెళ్ళికి రాలేని సందర్భంలో అందుకు సంబంధించి ఆధార పత్రాలను సమర్పించాలి. వివాహానంతరం పెళ్ళికుమారుడు, పెళ్లి కుమార్తెబాటు ఇరువురి తల్లిదండ్రులను 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనాల ద్వారా ఆరు మందికి సుపథం క్యూలైన్ ద్వారా ఉచితంగా శ్రీవారి దర్శనం కల్పిస్తారు.

**Andhra Pradesh Capital Region Development Authority (APCRDA)**
Lenin Center, Governerpet, Vijayawada – 520002 (A.P.)

**E-Procurement Short Tender Notice**

| S.No. | NIT Number | Name of the Work |
| --- | --- | --- |
| 1 | 02/MAU61-USI0HB(OTH)/104/2025-CETT/2nd call Dated:14.05.2025 | "Providing Glass Partition and supply of Workstations, Chairs, Storage Units and other miscellaneous works to the Waiting Hall at Chamber of Hon'ble Minister for BC Welfare, EWS Welfare, Handlooms and Textiles In front of Room No.131,Ground Floor in Building 4 , A.P Secretariat, Velagapudi" – **Estimate Cost Rs.10,10,000/-** |
| 2 | 04/MAU61-USI0HB(OTH)/127/2025-CETT/2nd Call dated:14.05.2025 | "APCRDA-A.P Secretariat Buildings- Maintenance – Providing BT Approach Road at West Side Gate to N9 Road, Providing Certain Repairs to the Footpath Tiles and providing MS fencing around the transformers in the Premises of the A.P Secretariat" – **Estimate Cost Rs.13,30,000/-** |

The bids can be downloaded on AP e-procurement portal from **20.05.2025 to 28.05.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bids **28.05.2025 up to 15.00 Hrs**, Technical bid opening **28.05.2025 @16.00Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**

Sd/- Commissioner, APCRDA, Vijayawada.

నిజమైన బలం అనేది శారీరక శక్తి కాదు. ఆత్మజ్ఞానంలోనూ, మరణభయం నుంచి విముక్తి పొందడంలోనూ ఉంది.

-మహాత్మాగాంధీ

# అగ్నికీలలు ఆపలేమా?

ప్రమాదాలంటే అనుకోకుండా వచ్చేవని అందరికీ తెలిసిన విషయమే. అయినా ప్రమాదాల నివారణ, నిరోధకతలో మనమెంత వెనుకబడి ఉన్నామో ఆదివారం తెలతెలవారుతుండగా జరిగిన దుస్సంఘటన వివరాల్లోకి వెళ్తే ఎవరికైనా ఒళ్ళు జలదరిస్తుంది. భాగ్యనగరంలో భారీ అగ్నిప్రమాదంలో ఒక వ్యాపారి కుటుంబానికి చెందిన బంధు వర్గమంతా సజీవ దహనం అయ్యారన్న సమాచారం దిగ్భ్రాంతి కలిగించే విషయం. హైదరాబాద్ పాతబస్తీ చార్మినార్ ప్రాంతంలో గుల్జార్‌హౌస్ కింద అంతస్తులో కృష్ణ పెరల్స్ వ్యాపారం నిర్వహిస్తూ, మొదటి అంతస్తులో నగల వ్యాపారి నివాసం ఉంటున్నారు. ఆదివారం తెల్లవారుఝామున జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే చనిపోయారు. మొత్తం ఆహుతైన 17 మందిలో 8మంది చిన్నారులున్నారు. ఒక్కసారిగా మంటలు చెలరేగి భవనంలోకి వ్యాపించాయి. బాధితులు మంటలు, కమ్ముకున్న పొగలను దాటుకుని బయటకు రాలేక అక్కడికక్కడే దగ్ధమయ్యారు. సెలవులని తమ పిల్లలతో వచ్చిన నాలుగు కుటుంబాల సభ్యులు అగ్నికి ఆహుతిఅయ్యారు. వీరిలో చాలామంది బెంగాల్ వాసులే. వారి శరీరాలు బాగా కాలిపోయినందున చికిత్స వరకు తరలించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రమాదానికి కారణం ఎలెక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ వల్లనేనని ప్రాథమిక అభిప్రాయానికి వచ్చారు. ఈ ప్రమాద స్థలికి వచ్చిన అగ్ని మాపకదళాల వద్ద ఆక్సిజన్ పరికరాలు ఏవీ లేకపోవడం, అగ్నిమాపక సిబ్బంది సన్నద్ధతపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వెలిబుచ్చారు. ఇలాంటిదే మరో దుర్ఘటన మహారాష్ట్రలోని షోలాపూర్ పారిశ్రామిక హబ్‌లో ఒక టెక్స్టైల్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం జరిగి 8 మంది మృతి చెందారు. అగ్ని ప్రమాదం ఎలా జరిగినా ఎందుకు జరిగినా అగ్నికీలలకు ఊపిరి ఆగిపోతున్న దుర్ఘటనలను తలచుకుంటేనే గుండె తరుక్కుపోతోంది. కొన్ని అగ్నిప్రమాదాలు మాత్రంమానవ తప్పిదాలు, నిర్లక్ష్యం వలనే వస్తాయన్నది అంగీకరించాల్సిన విషయం. ఇలాంటి ప్రమాదాలను అరికట్టే విషయంలో ప్రభుత్వాలు అగ్నిమాపక యంత్రాంగాన్ని సిద్ధం చేయకపోతే దానికి ప్రభుత్వాలే బాధ్యత వహించాల్సి ఉంటుంది. అసలే వేసవికాలం. ఎక్కడో అక్కడ చిన్నదో, పెద్దదో అగ్ని ప్రమాదాలు జరుగుతాయనేది ప్రతీతి. అగ్ని మాపక దళంవారు ఈ సీజన్లో అగ్ని ప్రమాదాలు జరగ కుండా చూసేందుకు ప్రత్యేక అగ్నిమాపక వారోత్సవాలు కూడా నిర్వహించడం పరిపాటి. అయినా అగ్నిప్రమాదాల నివారణలో వారు తగినంత సమాయత్తమైన పరిస్థితి కనపడలేదు. దాదాపు జంట నగరాల్లో సంవత్సరానికి ఒక వెయ్యికి పైగా అగ్ని ప్రమాదాలు జరిగిన రికార్డు ఉంది. కాగా నేటి ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకునేసరికి ఆక్సిజన్ పరికరాలు తెచ్చుకోకపోవడంతో వారు ఏ మేరకు సన్నద్ధతలో ఉన్నదీ అర్థమౌతోంది. ఆ ప్రాంతంలో చాలా భవనాలకు ఫైర్ సేఫ్టీ లేదని అగ్నిమాపకదళ ఉన్నతాధికారులే చెబుతున్నారు. వాటిని చెక్ చేయడంలో వారి బాధ్యత లేదనుకుంటున్నారా?ఈ ప్రశ్నలకు జవాబు ఎవరు చెబుతారు. చివరకు ప్రభుత్వ వైఫల్యమేనని తేల్చేస్తారు.ప్రమాదాలు వచ్చినప్పుడు మాత్రం చర్చించుకొని నిర్ణయాలు తీసుకోవడం, ఆపై నిష్క్రియతోనే మరో అగ్నిప్రమాదం జరుగకుండా చూడడంలో విభాగాలు విఫలమవుతున్నాయి. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రాణనష్టానికి దారితీసిన అగ్ని ప్రమాదాలన్నీ చేదు అనుభవాలనే మిగిల్చింది. ఈ మధ్యకాలంలో జరిగిన అగ్ని ప్రమాదాలలో ఇదే పెద్దది. ఇంతకు ముందు జరిగిన అగ్నిప్రమాదాలతో పోల్చిచూసుకుంటే ఈసారి జరిగిన ప్రాణనష్టం చాలా ఎక్కువే. కానీ ప్రమాదం జరిగిన రీతిని గమనిస్తే ఆ భవనంలో వారు నిద్రిస్తున్న సమయంలో మంటలు చుట్టు ముట్టడంతో ఎవరూ తప్పించుకోలేకపోయారు. 2023లో బజార్ఘాట్ నాలుగు అంతస్తుల నివాస భవనంలో అగ్ని ప్రమాదం సంభవించి 10 మంది మరణించారు. గ్రౌండ్ ఫ్లోర్ కార్ గ్యారేజీలో రసాయన సీసాలు పేలడం వల్ల ఈ సంఘటన జరిగింది. వెంకటేశ్వరకాలనీ అగ్ని ప్రమాదంలో నాలుగు అంతస్తుల భవనంలో భారీ అగ్నిప్రమాదం సంభవించి, 10ఏళ్ల బాలిక మృతి చెందింది. మార్చి 2023లో సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్ లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో ఆరుగురు మరణించారు. కాంప్లె క్స్‌లోని 5వ అంతస్తులో మంటలు చెలరేగడంతో నలుగురు మహిళలతో సహా ఆరుగురు పొగపీల్చడంవల్ల ఊపి రాడక మృతిచెందారు. జనవరి 2023లో సికింద్రాబాద్ నల్లగుట్ట వద్ద ఓ బట్టల దుకాణంలో భారీ అగ్ని ప్రమాదంలో ముగ్గురు కార్మికులు సజీవదహనమయ్యారు. సెప్టెంబర్ 2022లో సికింద్రాబాద్‌లోని ఓ బహుళ అంతస్తుల కాంప్లెక్స్‌ని హోటల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు. మార్చి 2022లో సికింద్రాబాద్‌లోని ఓ స్క్రాప్ గిడ్డంగిలో జరిగిన భారీఅగ్ని ప్రమాదంలో 11మంది వలస కార్మికులు ఆహుతయ్యారు. గ్యాస్ లీక్ కారణంగా కరాచీ బేకరీ ఫ్యాక్టరీలో మంటలు రేగి 15 మంది కార్మికులు క్షతగాత్రులయ్యారు. జంట నగరాల్లో జరిగిన అగ్ని ప్రమాదాలలో అధిక శాతం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనేనని తేలి నందున ప్రమాద నివారణకు నాణ్యమైన విద్యుత్ వైరింగ్ , క్రమం తప్పకుండా కనెక్షన్ల తనిఖీ వంటి జాగ్రత్తల విషయమై వినియోగ దారులలో అవగాహన కల్పించడం ద్వారా చైతన్యం తీసుకురావాల్సిన

ఎవరిని ప్రశ్నిస్తున్నాం అన్నది గొప్ప విషయం కాదు. ఎవర్ని నిందిస్తున్నాం అనేదే బాధాకరమైన విషయం.



విలియం ఆస్లర్

ప్రతి వ్యక్తి తన కోర్కెలు, అనుభూతులు నిష్పత్తిని బట్టి బీదవారుగాని, ధనవంతులు గాని అవుతారు.



జాన్సన్

# ప్రజావాక్కు



## ఎవరు అధికులు?

గవర్నర్, రాష్ట్రపతికి బిల్లుల ఆమోదం విషయంలో విశేష అధికారాలుంటాయి. ఇవి రాజ్యాంగ పరంగా వచ్చినవి. అలాంటప్పుడు సుప్రీంకోర్టు కాలపరిమితిని ఎలా విధిస్తుందని రాష్ట్రపతి సుప్రీం కోర్టును వివరణ యివ్వమని సుదీర్ఘప్రశ్నావళికి సంధించడం జరిగింది. రాజ్యాంగాన్ని పరిపూర్ణంగా ఈమూల నుంచి ఆమూలకు ఎవరికి నాలుకల మీద నాట్యం చేయవు. ఒక్క ప్రధానమైన విషయం మాత్రం ఏమిటంటే ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ తీర్పు. వారికి న్యాయం చేయడం కోసం అవసరమయితే రాజ్యాంగాన్ని సవరణ చేయవచ్చు. అందుచేత సుప్రీం ఇటువంటి తీర్పునుఇవ్వవలసి వచ్చిందేమో. ఇక్కడ ఎవరు అధికులుఎవరుకారు అనేచర్చ జరగడం మంచిది కాదు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## రోడ్లపై వ్యర్థ పదార్థాలు

గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలు వాహనాలతో ప్రయాణించే రోడ్లపై గృహనిర్మాణానికి సంబంధించిన మెటీరియల్‌ను నెలలు,సంవత్సరాల కొద్దీ రోడ్లపై ఉంచడం వలన ప్రయాణికులకు, వాహనదారులకు చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. రోడ్లపై చెత్త చెదారం, కంకర రాళ్లు వేసిన వారిపై స్థానిక సంస్థలు అధికారులు నోటీసు జారీ చేసి వాటిని తొలగించి సులభమైన ప్రయాణానికి కృషిచేయాలి.రాత్రిపూట ఇలాంటి రోడ్లపై నడవడం వాహనాలుప్రయాణించడం ప్రమాదాలకు దారితీస్తుంది.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్ జిల్లా

## సనాతన ధర్మం

సనాతన ధర్మరక్షణ కోసం సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఛాయమార్తాండ శనైశ్చర దేవస్థానం వద్ద మునివాహన సేవ జరిగినట్లు దళిత పీఠాధిపతి మాతా నందగిరి స్వామిని ఛాయామార్తాండ పీఠాధిపతి ఉంగరాల సుబ్రహ్మణ్యశాస్త్రి తన భుజాలపై మోసుకొంటూ ఆలయంలోకి తీసుకెళ్లి సత్కరించినట్లు పత్రికల ద్వారా తెలుస్తున్నది. ఇలాంటి చర్యల వల్ల సనాతన ధర్మ దృఢపడుతుంది. అంతేగాని అగ్రకులాల వాళ్లు, దళితులు ఒకర్నొకొరు ధూషించుకుంటే దళితులు వాళ్లలో వారే చీలి కలైకలహించుకుంటే సనాతనమతం బలహీనపడుతుంది.

-రాచమడుగు శ్రీనివాసులు, హైదరాబాద్

## తాగునీటి కొరత

ప్రస్తుతం రాష్ట్రంలో వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో, అనేక గ్రామాలు, పట్టణాలు తాగునీటి కొరతతో తీవ్రంగా బాధపడుతున్నాయి. ప్రజలు తాగేందుకు సరిపడా నీరు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి గంభీరంగాఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులు క్షీణించడంతో పేద ప్రజల జీవితం మరింత దుర్భరమవుతోంది. ఈనేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలి. ప్రతి మండలానికి నీటి సరఫరా కోసం ప్రత్యేక ట్యాంకర్లను ఏర్పాటు చేయాలి. పాత బోర్లు మరమ్మతు చేయడంతో పాటు, అవసరమైతే కొత్త బోర్లు వేయాలి.గ్రామాల్లో నీటినిల్వకోసం పెద్దట్యాంకులు నిర్మించాలి. ఇకపోతే వరపు నీటి సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ వంటి దీర్ఘకాలిక ప్రణాళికలకూ ప్రాధాన్యత ఇవ్వాలి. నీరు మానవ హక్కు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలంటే, నీటి అందుబాటును ప్రభుత్వం నిర్ధారించాలి. ఈ సమస్యను పరిష్కరించేందుకు వెంటనే స్పందించాల్సిన అవసరం ఉంది.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## కఠిన నియంత్రణ అవసరం

మద్యం సేవించి డ్రైవింగ్ హైదరాబాద్‌లో ప్రజల భద్రతకు తీవ్రమైన ముప్పుగా మారింది.వాహనదారులే కాకుండా, అమాయక ప్రయాణికులు, బాటసారులు కూడా ఈ ప్రమాదానికి గురవుతున్నారు. పట్టుబడిన వారిలో ఎక్కువ మంది 18 నుండి 40 ఏళ్ల మధ్యవారే. వారి రక్తంలో మద్యం స్థాయిలు ప్రమాదకరంగా ఎక్కువగా ఉన్నాయి. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో మద్యం సేవించి డ్రైవింగ్ కేసులు పెరుగుతుండటం ఆందోళనకరం. మద్యం సేవించి వాహనం నడపడం కేవలం చట్ట ఉల్లంఘనే కాదు, ఇది ప్రాణాలకు ప్రమాదకరం. హైదరాబాద్‌లో మద్యం సేవించి డ్రైవింగ్‌ను అరికట్టడానికి సమగ్ర చర్యలు అవసరం.

-డాక్టర్ కృష్ణ కుమార్ వేపకొమ్మ, హైదరాబాద్

## నీతి నియమాలు పాటించాలి

దశాబ్దాలపాటు కాపురం చేసి పిల్లలను కని తరువాత మా మనస్సులు కలవట్లేదని విడాకుల ద్వారా విడిపోదామని నిర్ణయించుకోవడం బాధనుకలుగజేస్తోంది.వివాహ మైన నెలరోజులకే విడిపోయిన జంటలను చూస్తున్నాము. ఇలా విడిపోతే పిల్లలకు తల్లిదండ్రుల ఆలనాపాలన దక్కుతుందా? ఆదర్శం, ధర్మం, నీతి నియమాలు పాటించాలి.

-కె. అమరావతి, నల్గొండజిల్లా

మనవి — ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్


(e-mail: editpage@vaartha.com)

# విద్యుత్ ఒప్పందంతో ప్రజలపై పెనుభారం!

**కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీ నుంచి యూనిట్ 2.49 రూపాయలకు కొనుగోలు చేసేందుకు వై సీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటే తీవ్రంగా వ్యతిరేకించిన టిడిపి నేడు యాక్సిస్ సంస్థతో 4.60 రూపాయలకు ఎలా ఒప్పందం చేసుకుంది. బహిరంగ మార్కెట్లో అంత కన్నా తక్కువ ధరకే వస్తుంది గదా! యాక్సిస్ సంస్థతో ఒప్పందం ఫలితంగా విద్యుత్ రేట్లు పెరిగి ప్రజలపైన 15 వేల కోట్ల రూపాయల దాకా భారం పడుతుంది. ఇప్పటికే ట్రూ అప్ చార్జీల పేరుతో 14వేల కోట్లకు పైగా కూటమి ప్రభుత్వం ప్రజలపై చార్జీల భారం మోపింది. పాలకులకు ప్రైవేట్ విద్యుత్ సంస్థల ప్రయోజనాలు తప్పప్రజల ప్రయోజనాలు పట్టడం లేదు. ప్రైవేట్ సంస్థలతో కుదుర్చుకున్న అన్ని విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసుకోవాలని, ప్రభుత్వ రంగంలోనే పూర్తిగా విద్యుత్ ఉత్పత్తి జరగాలని, థర్మల్ విద్యుత్ సంస్థలకు అవసరం మేరకు బొగ్గుసప్లయ్ చేయాలని, బకాయిలు చెల్లించాలని, ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని రాష్ట్ర ప్రజలు ఉద్యమించాలి.**

**బొల్లిముంత సాంబశివరావు**

చంద్రబాబు గారి నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం ప్రైవేట్ విధానాలతో ముందుకుపోతున్నది. పోర్టులను, మెడికల్ కాలేజీలను, విద్య, వైద్యం మొదలైన వాటిని ప్రైవేట్ పరం చేయనుంది. తాజాగా నిత్యం అవసరంగా ఉన్న కరెంట్‌ను కూడా ప్రైవేట్ సంస్థల చేతుల్లో పెడుతున్నది. అందులో భాగమే యాక్సిస్ రెన్యూవబుల్ ఎనర్జీ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్‌తో విద్యుత్ కొనుగోళ్ల గురించి చేసుకున్న ఒప్పందం. 400 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను నిర్మించి, వాటి నుంచి ఏపీ ఎస్పీడీసీఎల్ 25 సంవత్సరాల పాటు యూనిట్‌కు 4.60 రూపాయల చెల్లించి కొనుగోలు చేసేందుకు అంగీకారం తెలిపింది. ధర తగ్గించేందుకు వీలులేకుండా ఒప్పందంలో 'సిలింగ్' షరతు విధించారు. ఇంతకు ముందు కూడా యాక్సిస్ సంస్థ 5 వేల మెగావాట్ల సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసుకునేందుకు 2018లో టిడిపి ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా 400 మెగావాట్ల ప్రాజెక్టుల ఏర్పాటుకు 2019 జనవరి 23న విద్యుత్ సంస్థలు అనుమతించాయి. దీన్ని గమనిస్తే యాక్సిస్‌తో చంద్రబాబు అనుబంధం ఏమిటో తెలుస్తుంది. 2014-18 మధ్య టిడిపి పాలనలోనే ఎస్పీడీసీఎల్ పరిధిలో 464 మెగావాట్ల సౌర విద్యుత్ కొనుగోలుకు 15 కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి. దానిప్రకారం మొదటి ఏడాది యూనిట్‌కు 5.98 రూపాయల చొప్పున చెల్లించాలి. రెండవ ఏడాది నుంచి ఏటా 3శాతం పెంపుతో పదో సంవత్సరం దాకా కొనుగోలు వ్యయం పెరుగుతుంది. ఫలితంగా పదో ఏడాది నాటికి యూనిట్‌కి 7 రూపాయల పైగా చెల్లించాలి. రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ యూనిట్ 4.20 రూపాయలకే అందుబాటులో ఉన్నా 7 రూపాయలకు ప్రైవేట్ సంస్థల నుంచి కొనేందుకు టిడిపి ప్రభుత్వం ఎలా ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైయింది. 2019 సాధారణ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైయస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం టిడిపి ప్రభుత్వం లోని పీపీఏల సమీక్షతో పాటు 2019 ఎప్రిల్ 1 ముందు కుదిరిన ఒప్పందాల మేరకు ఇంకా మొదలు కాని పనులను రద్దు చేయాలని ఆదేశించింది. కొత్తగా కేంద్ర ప్రభుత్వ సంస్థ 'సెకీ' తో యూనిట్ 2.49 రూపాయల చొప్పున కొనుగోలుకు ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందాన్ని టిడిపి వ్యతిరేకించింది. యాక్సిస్ సంస్థ నుంచి తొలుత 400 మెగావాట్లకు తర్వాత మరో 774.9 మెగావాట్ల కు ఒప్పందాలు కుదుర్చుకునేలా దస్త్రాన్ని ఏపీఈఆర్‌సీఆమోదం కోసం అధికారులు పంపారు. ఆ పీపీఏల ద్వారా యూనిట్ ధర 4.28 రూపాయల చొప్పున ఖరారు చేయాలని డెవలపర్ సంస్థ విద్యుత్ నియంత్రణ మండలిని కోరింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో హైబ్రిడ్ ప్రాజెక్టుల నుంచి వచ్చే విద్యుత్ యూనిట్ 2.90 రూపాయలకు దొరుకుతుంది. అలాంటప్పుడు 4.28 రూపాయలకు ఎందుకు కొనుగోలు చేయాలి. ఈ లెక్కన ప్రతి సంవత్సరం 193.2 కోట్ల




రూపాయల అదనపు భారం ప్రజలపై పడుతుంది. గత ప్రభుత్వంలో 11.11.2022న యాక్సిస్ సంస్థ నుంచి యూనిట్ 3.50 రూపాయల చొప్పున పీపీ ఏల కొనుగోలు ఆమోదం కోసం ఏపీఈఆర్‌సీ అనుమతి కోసం డిస్కం పంపింది. ఆ పీపీఏలను ఎలా సమర్థించుకుంటారో వివరణ ఇవ్వాలంటూ డ్రాఫ్ట్ పీపీఏలను విద్యుత్ నియంత్రణ మండలి డిస్కంకి తిప్పిపంపింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం విద్యుత్ చట్టం 2003 సెక్షన్ 108 ప్రకారం యాక్సిస్ సంస్థతో పీపీఏలను ఆమోదించాలంటూ 2492024న ఏపీఈఆర్ సీకి లేక వ్రాసి, దీన్ని తిరస్కరించటానికి వీలు లేదని, ఒక వేల తిరస్కరిస్తే చట్టం ప్రకారం ముందుకు పోతుందని బెదిరింపు ధోరణి ప్రదర్శించింది. ఆ అవసరం ఎందుకు ఏర్పడిందో తెలియదు. వైసీపీ ప్రభుత్వం పంపిన పీపీఏ ప్రతిపాదనలు తిప్పి పంపిన ఏపీఈఆర్ సీ యాక్సిస్ సంస్థతో చంద్రబాబు ప్రభుత్వం కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపిఎస్‌పిడిసిఎల్) దాఖలు చేసిన పిటిషన్ ను మాత్రం ఆమోదించింది. యాక్సిస్‌తో ఖచ్చితంగా పీపీ ఏలు కుదుర్చుకోవాలంటూ విద్యుత్ సంస్థలను అప్పిలేట్ ట్రిబ్యునల్ ఆదేశించలేదు. కాని ఆ సంస్థతో పీపీఏలు కుదుర్చుకోవటానికి విద్యుత్ సంస్థలు ముందుకు వచ్చాయి. అధికారులు కూడా ఆ సంస్థ నుంచి విద్యుత్ తీసుకోవటంచాలా చౌకనే రీతిలో వివరణ ఇవ్వటం ద్వారా పీపీఏలకు మద్దతు పలికారు. చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ అధికారుల మద్దతుతో యాక్సిస్ సంస్థకు చెందిన సౌర, పవన ప్రాజెక్టుల నుంచి విద్యుత్ ఒప్పందాలు కుదుర్చుకోవటానికి సిద్ధమయ్యాయి. ఇప్పటికే వాటి ప్రతిపాదనలను ఏపీఈఆర్ సీకి చేరాయి. విద్యుత్ యూనిట్ టారిఫ్ ఎంత ఉండాలో కూడా యాక్సిస్ సంస్థ ప్రతిపాదించింది. దాన్ని ఆంధ్రప్రదేశ్ పవర్ కో ఆర్డినేషన్ కమిటీ ( ఎపీపీ సీ సీ) ఏపీఈఆర్‌సి ఆమోదం కోసం పంపింది. దీన్ని గమనిస్తే కూటమి ప్రభుత్వ విద్యుత్ ఒప్పందం ద్వారా యాక్సిస్ సంస్థ ఎంత ప్రయోజనం పొందుతుందో తెలుస్తుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ సెకీ నుంచి యూనిట్ 2.49 రూపాయలకు కొనుగోలు చేసేందుకు వై సీపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటే తీవ్రంగా వ్యతిరేకించిన టిడిపి నేడు యాక్సిస్ సంస్థతో 4.60 రూపాయలకు ఎలా ఒప్పందం చేసుకుంది. బహిరంగ మార్కెట్లో అంత కన్నా తక్కువ ధరకే వస్తుంది గదా! యాక్సిస్ సంస్థతో ఒప్పందం ఫలితంగా విద్యుత్ రేట్లు పెరిగి ప్రజలపైన 15 వేల కోట్ల రూపాయల దాకా భారం పడుతుంది. ఇప్పటికే ట్రూ అప్ చార్జీల పేరుతో 14వేల కోట్లకు పైగా కూటమి ప్రభుత్వం ప్రజలపై చార్జీల భారం మోపింది. పాలకులకు ప్రైవేట్ విద్యుత్ సంస్థల ప్రయోజనాలు తప్పప్రజల ప్రయోజనాలు పట్టడం లేదు. ప్రైవేట్ సంస్థలతో కుదుర్చుకున్న అన్ని విద్యుత్ ఒప్పందాలు రద్దు చేసుకోవాలని, ప్రభుత్వ రంగంలోనే పూర్తిగా విద్యుత్ ఉత్పత్తి జరగాలని, థర్మల్ విద్యుత్ సంస్థలకు అవసరం మేరకు బొగ్గుసప్లయ్ చేయాలని, బకాయిలు చెల్లించాలని, ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు

# పర్యావరణంపై భానుడి ప్రతాపం

**డాక్టర్ మోటె చిరంజీవి**

భూమిపై రోజు రోజుకు అనేక మార్పులు సంభవిస్తున్నాయి. మన దేశం సమశీతోష్ణ పరిస్థితులకు అనుకూలంగా ఉంటుంది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో వాతావరణంలో అనేక మార్పులు కనిపిస్తున్నాయి.దానికి కారణం పర్యావరణ కాలుష్యం. భూమిపై వివిధ రకాల జీవులు,అవి ఏర్పరచుకునే సహజ నమూనాలు ప్రపంచ పర్యావరణం పనిచేయడానికి సహాయపడతాయి. కలుషితమైన గాలి, నీరు, క్షీణించిన నేల, పట్టణ పెరుగుదల అన్నీకూడా పర్యావరణంపై ప్రభావం చూపిస్తాయి. వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువులు, అతినీలాలోహిత కిరణాలు, ఏరోసాల్స్ ఓజోన్లలో దీర్ఘకాలిక మార్పులను పర్యవేక్షించడం వలన వాతావరణ మార్పులు కనబడుతున్నాయి. వేడి, పొడి కారణంగా సంభవించే అడవి మంటలు, సముద్రపు ఆమ్లీకరణ వేడెక్కడం వల్ల బ్లీచ్డ్ పగడాలు, తుఫానులు సముద్రమట్టం పెరుగుదల కారణంగా, తీర ప్రాంత వరదలు ఎడారి కరణ కారణంగా వాతావరణంలో మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీని ద్వారా సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలో పెరుగుదల, అలాగే సముద్ర ఉష్ణోగ్రతలు ఎక్కువ లోతులలో పెరగడం, తరచుగా సముద్రపు వేడి తరంగాలు, పీహెచ్ విలువ తగ్గడం, సముద్రం వేడెక్కడం, మంచు పలకలు ద్రవీకరణ చెందడం, ఇవన్నీ కూడా పర్యావరణ మార్పుల వల్ల వస్తున్నాయి.రానున్న రోజులలో మన దేశం తీవ్రమైన వడగాల్పులతో ఇబ్బంది పడుతుందని వాతావరణ మార్పులపై అంతర ప్రభుత్వాల సంఘం నివేదిక గత సంవత్సరం హెచ్చరించింది. తాజాగా ప్రపంచ బ్యాంకు సైతం ఇదే విషయంపై అనేక ఆందోళనకర విషయాలను తెలిపింది. వేడిగాలుల వల్ల భారతదేశంలోని ప్రజల ఆయుష్షు తగ్గి, పెద్దసంఖ్యలో మరణాలు సంభవిస్తాయని తెలిపింది. గత సంవత్సరం దేశ రాజధాని ఢిల్లీలో



ఏప్రిల్ నెలలో 46డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైతే ఈ సంవత్సరం ఎండాకాలంలో ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. 1981-1990 మధ్యకాలంలో 413 రోజులు, 2011-2020మధ్యకాలంలో 600రోజులు తీవ్ర వడగాల్పులు వీచాయని భారత పర్యావరణ విభాగం వెల్లడించింది. అనగా 1990 నుండి 2019లో భారత్‌లో వడగాల్పుల తీవ్రత 15శాతం పెరిగినట్లు లాన్సెట్ నివేదిక తెలిపింది. ఈ విధంగా ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వడగాలులు వీచీ వాటి ప్రభావం అనేక వాటిపై కనిపిస్తుంది. రైతులు వివిధ కార్యాలయాల్లో సిబ్బంది పనిచేయలేక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఉష్ణోగ్రత పెరుగుదల వల్ల భూమిపై ఉన్న జీవులపై కూడా ప్రభావం చూపుతుంది. కోళ్ల పెంపకం, గొర్రెలు, మేకల పెంపకం, చెరువులో పెంచే చేపల పెంపకంలో అనుకున్న స్థాయిలో కన్నా దిగుబడి తగ్గుతుంది. ఇవేకాక పాలిచ్చే జంతువులైన ఆవులు, గేదెల్లో కూడా పాల దిగుబడి తగ్గుతుంది. ఉష్ణతాపం రవాణ వ్యవస్థపై కూడా ప్రభావం చూపి, ఆహార ధాన్యాల రేట్లు పెరిగి, ప్రజలకు భారమవుతుంది. ఆహార ధాన్యాల నిలువల కోసం,వాటిని శీతలీకరణ గిడ్డంగుల్లో ఉంచడానికి, వాటిని చల్లపరచడానికి ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు అవసరమవుతాయి.తద్వారా కరెంటు బిల్లుకూడా అధికంగా వచ్చి నష్టపోయే అవకాశంవుంది. పర్యావరణంలో ఉష్ణోగ్రతల తగ్గుదల కోసం అనేక చర్యలు చేపట్టాలి. చెట్లను అధికంగా నాటడం, వాటిని రక్షించడం ద్వారా కొంతమేర ఉష్ణోగ్రతను అరికట్టవచ్చు.ఒక్కొక్క గృహానికి అనేక వాహనాలు వాడడం, ఏసీ రిఫ్రిజిరేటర్లు వాడడం వల్ల, మొబైల్‌వాడటం,వాటి టవర్ల నుండి వచ్చే రేడియేషన్ ద్వారా, ఫ్యాక్టరీల నుండి వెలువడే వ్యర్థాలను కాల్చడం ద్వారా, వాతావరణం కలుషితమై భూమిపై కార్బన్ డయాక్సైడ్,కార్బన్ మోనాక్సైడ్ ఎక్కువగా విడుదలై, ఓజోన్ పై ప్రభావం చూపి, భూమిపై ఉష్ణోగ్రత, వడగాలులు పెరుగుతాయి. వీటిని అరికట్టడానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, క్షేత్రస్థాయిలో ప్రతిష్టంగా అమలు చేసి

# ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కృషి ఏది?

**డి. మోహన రావు**

మన దేశ ఆర్థికవ్యవస్థ ఎలా నడుస్తోంది?దాని గుండె చప్పుడు ఎలాఉంది? ఈ కీలక ప్రశ్నలకు సమాధానం వెతకడానికి మనకు అనేక సూచికలు ఉన్నప్పటికీ, వాటిలో ఒకటి చాలా ప్రత్యేకమైనది. అదే కొనుగోలు నిర్వాహకుల సూచీ లేదా పిఎంఐ. ఇది కేవలం అంకెలు కాదు, మన ఆర్థిక వ్యవస్థలోని తయారీ, సేవల రంగాలలో రోజువారీగా పనిచేసే వ్యక్తుల అనుభవాల నుంచి పుట్టిన ఒక కీలక సంకేతం. వ్యాపార కార్యకలాపాలు, భవిష్యత్తుపై వారి ఆశలు ఎలా ఉన్నాయో ఇది మనకు ముందుగానే చెబుతుంది. ఇటీవలి కాలంలో ఈ సూచీ చెబుతున్న కథ భారత ఆర్థిక గమనంపై ఆసక్తికరమైన చర్చలకు తావిస్తోంది. అసలు ఈ కొనుగోలు నిర్వాహకుల సూచీ అంటే ఏమిటి? దీన్ని అర్థం చేసుకోవడం చాలా సులువు. వ్యాపార సంస్థల్లో కొనుగోళ్లు చేసే నిర్వాహకులు ఉంటారు కదా,వారే ఈ సూచీ వెనుక ఉన్నారు. వారిని ప్రతినెలా సర్వే చేసి, కొత్త ఆర్డర్లు ఎలా వస్తున్నాయి, ఉత్పత్తి పెరుగుతోందా, ఉద్యోగులను కొత్తగా తీసుకుంటున్నారా, ముడిసరుకుల సరఫరా వేగంగా ఉందా లేదా వంటి విషయాలపై వారి అభిప్రాయాలు తీసుకుంటారు. ఈ అభిప్రాయాల ఆధారంగా 0నుంచి 100 మధ్య ఒక అంకెను లెక్కిస్తారు. ఈ అంకెలో '50' అనేది చాలా ముఖ్యమైన స్థాయి. సూచీ అంకె 50 వద్ద ఉందంటే, గత నెలకు, ఇప్పటికీ వ్యాపార పరిస్థితుల్లో పెద్దగా మార్పు లేదని అర్థం. అంతా స్థిరంగా ఉంది అనుకోవచ్చు. ఒకవేళసూచీ 50కంటే ఎక్కువగా ఉంటే, అప్పుడు కథ వేరేలా ఉంటుంది. వ్యాపార కార్యకలాపాలు పుంజుకుంటున్నాయని, ఆర్థికవ్యవస్థ వృద్ధి పథంలో వేగంగా పయనిస్తోందని ఇది చెబుతుంది. ఇది చాలా మంచి వార్త. కానీ సూచీ 50కంటే తక్కువగా ఉంటే, అప్పుడు కొంచెం ఆందోళన చెందాలి. వ్యాపారాలు మందగిస్తున్నాయని,ఆర్థిక కార్యకలాపాలు నెమ్మదిస్తున్నాయని ఇది సూచిస్తుంది. ఇది ఆర్థిక వ్యవస్థకు ఒక హెచ్చరిక లాంటిది. దీని గొప్పతనం ఏమిటంటే స్థూల దేశీయోత్పత్తి , పారిశ్రామిక ఉత్పత్తి, నిరుద్యోగ గణాంకాలు వంటి అధికారిక వివరాలు వెలువడటానికి చాలా ముందే, నెల ప్రారంభంలోనే ఈ సూచీ అందుబాటులోకి వస్తుంది. అందుకే దీన్ని 'ముందస్తు ఆర్థిక సూచిక' అంటారు. మార్కెట్లో ఏం జరగబోతోందో ముందుగానే పసిగట్టడానికి ఇది ఆర్థికవేత్తలకు, విధాన నిర్ణేతలకు, వ్యాపారులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఈ సమాచారం ఆధారంగానే ప్రభుత్వాలు సరైన సమయంలో నిర్ణయాలు తీసుకోవడానికి, వ్యాపారాలు తమ ప్రణాళికలు మార్చుకోవడానికి, పెట్టుబడిదారులు జాగ్రత్త పడటానికి అవకాశం లభిస్తుంది. కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు వంటి ద్రవ్య విధానాలను నిర్ణయించేటప్పుడు కూడా ఈ సూచీని ఒక ముఖ్యమైన సూచనగా తీసుకుంటాయి.ఈ సూచీలో ప్రధానంగా రెండు రకాలుంటాయి. వస్తువులు తయారు చేసే పరిశ్రమల కోసం 'తయారీ రంగ సూచీ', బ్యాంకింగ్, వైద్యం, ఐటీ వంటి సేవలందించే సంస్థల కోసం 'సేవల రంగ సూచీ'. ఈ రెండింటినీ కలిపి మొత్తం ఆర్థిక వ్యవస్థ స్థితిని తెలిపే 'సంయుక్త సూచీ' కూడా ఉంటుంది. ఈ



సూచీ కూడా ఒక మనిషిలాగే పరిమితులు కలిగి ఉంటుంది. ఇది కొందరు కొనుగోలు నిర్వాహకుల అభిప్రాయాల ఆధారంగా తయారవుతుంది కాబట్టి, కొన్నిసార్లు మొత్తం రంగాన్ని లేదా దేశ ఆర్థికవ్యవస్థను పూర్తిగా ప్రతిబింబించకపోవచ్చు. వారి వ్యక్తిగత అనుభవాలు, మార్కెట్ సెంటిమెంట్ ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. నెలవారీగా వచ్చే ఈ అంకెలు సరఫరా సమస్యలు వంటి తాత్కాలిక కారణాల వల్ల కూడా మారవచ్చు. అన్నిటినీ మించి, ఇది కేవలం తయారీ, సేవల రంగాల గురించే చెబుతుంది కానీ వ్యవసాయం, నిర్మాణం వంటి ఇతర ముఖ్యమైన రంగాలను పెద్దగా పట్టించుకోదు. అందుకే, పిఎంఐ కేవలం ఒక కోణాన్ని మాత్రమే చూపిస్తుందని గుర్తుంచుకొని, దాన్ని ఇతర ఆర్థిక గణాంకాలతో పోల్చి చూస్తేనే మన ఆర్థిక వ్యవస్థ పూర్తి చిత్రాన్ని అర్థంచేసుకోగలం. ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థలు ఈ సూచీలను సిద్ధంచేస్తున్నాయి. భారతదేశంలో, ఎస్‌పి గ్లోబల్ అనే అంతర్జాతీయ సంస్థ సేకరించిన సమాచారం ఆధారంగా హెచ్ఎస్బిసి ఇండియా అనే సంస్థ దీన్ని లెక్కిస్తుంది. సుమారు 400 తయారీ సంస్థలు, 400 సేవాసంస్థల నుంచి వీరు వివరాలు తీసుకుంటారు. భారత ప్రభుత్వం కూడా ఈ సూచీని చాలా ముఖ్యమైనదిగా పరిగణిస్తుంది. ఆర్థిక సర్వే వంటి అధికారిక నివేదికల్లో కూడా దీని ప్రస్తావన ఉంటుంది. ఇక తాజాగా మన దేశంలో ఈ సూచీ చెబుతున్న కథ ఆశాజనకంగా ఉంది. ఏప్రిల్ 2025 నాటికి వెలువడిన గణాంకాలు మన ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందని బలంగా సూచిస్తున్నాయి. తయారీ రంగ సూచీ గత పది నెలల్లో ఎప్పుడూ లేనంత ఎక్కువగా నమోదైంది. సేవల రంగ సూచీ కూడా మంచి స్థాయిలో ఉంది. ఈ రెండింటినీ కలిపిన సంయుక్త సూచీ అయితే గత ఎనిమిది నెలల్లో అత్యధికం. ఈ అంకెలు చూస్తుంటే, దేశీయంగా, విదేశాలలోనూ మన వస్తువులు,సేవల పట్ల ఆసక్తి, డిమాండ్ పెరుగుతున్నాయని, వ్యాపారవర్గాల్లో భవిష్యత్తుపై విశ్వాసం బలంగా ఉందని అర్థమవుతోంది. ఇదంతా ఆర్థికవ్యవస్థకు మంచి పరిణామమే. ఈ అద్భుతమైన అంకెల తెర వెనుక కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. అలాగే, పెట్టుబడి వస్తువులు వంటి కొన్ని ప్రత్యేక రంగాల్లో వృద్ధి ఇంకా పుంజుకోవాలి. ఎగుమతులు కూడా దేశీయ డిమాండ్ స్థాయికి చేరుకోవాలి. ఎక్కడ లోపాలున్నాయో గుర్తించి, ప్రభుత్వం ఆయా రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. భవిష్యత్ అంచనాలు కూడా మన ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉంటుందని చెబుతున్నాయి. అంతర్జాతీయ సంస్థలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ పథకాలు, మౌలిక సదుపాయాలపై పెడుతున్న పెట్టుబడులు ఈ వృద్ధికి బలం చేకూర్చగలవు. కానీ కేవలం అంకెల్లో వృద్ధివస్తే సరిపోదు కదా.అది సామాన్యుడి జీవితంలో ప్రతిబింబించాలి. నిరుద్యోగం, ఆదాయ అసమానతలు, పేదరికం, ద్రవ్యోల్బణం వంటి అనేకసవాళ్లు ఇంకా మన ముందున్నాయి. వీటిని అధిగమించాలంటే ఉద్యోగాలు సృష్టించే రంగాలపై పెట్టుబడి, యువతకు నైపుణ్య శిక్షణ, మౌలిక వసతుల కల్పన వంటి వాటిపై మరింతగా దృష్టి పెట్టాలి. పథకాలను ప్రకటించడమే కాదు, వాటిని సమర్థవంతంగా అమలు చేయడం చాలా ముఖ్యం. మొత్తం మీద, కొనుగోలు నిర్వాహకుల సూచీ అనేది ఒక ముఖ్యమైన దిక్సూచి లాంటిది. అది మన ఆర్థిక వ్యవస్థ ప్రయాణాన్ని ముందుగానే సూచిస్తుంది. ఇప్పుడు వస్తున్న ఆశాజనకమైన సంకేతాలను సరైన చర్యలతో మరింత బలోపేతం చేసి, ముందున్న సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటేనే స్థిరమైన, అందరికీ ప్రయోజనం కలిగించే వృద్ధిని సాధించగలం. కేవలం ఈ ఒక్క సూచీనే కాకుండా, అన్ని ఆర్థిక వివరాలను కలిపి చూస్తేనే మన ఆర్థిక వ్యవస్థ పూర్తి చిత్రాన్ని స్పష్టంగా అర్థం చేసుకోగలం. ●

## వెహికల్ పార్కింగ్ షెడ్డు వద్ద భారీ వృక్షాల తొలగింపు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,మే19, ప్రభాతవార్త: వార్త కథనానికి వర్సిటీ అధికారులు స్పందించారు. ఈనెల 15వ తేదీన వార్త దినపత్రికలో 'వర్సిటీలో కూలేందుకు సిద్ధంగా ఉన్న వెహికల్ షెడ్డు' అనే వార్త ప్రచురితమైంది. అధ్యాపకులు, అధికారులు, ఉద్యోగుల వాహనాలు పార్కింగ్





**వార్త ప్రభావం**

చేసుకునేందుకు ఏర్పాటు చేసిన వెహికల్ షెడ్డుపై భారీ వృక్షాలు వాలిపోవడంతో షెడ్డు పడిపోయే అవకాశం ఉంది. ముందుగా తగు జాగ్రత్తలు తీసుకోకపోతే భారీనష్టం జరిగుతుందని వార్త కథనంలో ముందస్తు సమాచారం అందజేసింది. దీంతో అధికారుల ఆదేశాలతో సిబ్బంది ఈనెల 17న షెడ్డుపై వాలిన భారీ వృక్షాలను తొలగించారు. కాగా వర్సిటీలో నిర్మించిన పలు భవనాలపై మర్రి చెట్లు పెరుగుతున్నాయి. కొన్ని చోట్ల ఏసి అవుట్‌డోర్ యూనిట్‌కు దగ్గరగా, మరికొన్ని చోట్ల గోడల అంచుల్లో ఈ చెట్లు పెరుగుతున్నాయి. వాటిని కూడా అధికారులు తొలగించాలని వర్సిటీ ఉద్యోగులు కోరుతున్నారు. భవనాలను పరిశీలించేందుకు విశ్రాంత ఇంజనీర్‌ను వర్సిటీ నియమించింది. క్షేత్ర స్థాయి పరిశీలన చేయాల్సిన అవసరం ఉందని వర్సిటీ వర్గాలు కోరుతున్నాయి.

## హనుమత్ జయంతి మహోత్సవాలు

గుంటూరు కల్చరల్,మే 19,ప్రభాతవార్త : స్థానిక మారుతీనగర్‌లోని శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీమారుతీ దేవాలయ ప్రాంగణంలో హనుమాన్ జయంతి మహోత్సవాలు ఈనెల 22నుంచి 25వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 22వ తేది ఉదయం ఆలయ ప్రాంగణంలో 108పర్యాయాలు హనుమాన్‌చాలీసా పారాయణం జరుగుతుంది,ఆంజనేయ స్వామి వారికి విశేష ఆకుపూజలు జరుగుతాయి. సాయంత్రం శ్రీశారదా రామలింగేశ్వర భజన సమాజం వారిచే భక్తి సంకీర్తన నిర్వహిస్తారన్నారు. 23వ తేది ఉదయం 9గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం లక్ష మల్లెలార్చన, 24వ తేది ఉదయం ఊరేగింపు సాయంత్రం శ్రీ సువర్చల సమేత ప్రసన్నాంజనేయస్వామి వారి కళ్యాణం, 25వ తేది ఉదయం 9గంటలకు దీక్షాదారుల ఇరుముడి ప్రదక్షిణములు భక్తి సంకీర్తన నడుమ హనుమ రుద్ర హోమం నిర్వహించి హనుమత్ దీక్షాదారులందరి చేత పూర్ణాహుతి నిర్వహించి మాలా విసర్జన చేయుట జరుగుతుంది .

## క్రమశిక్షణ పట్టుదలతోనే లక్ష్యాలు సాధ్యం

గుంటూరు విద్య,మే 19,ప్రభాతవార్త : క్రమశిక్షణ పట్టుదల ఉంటే జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్




అన్నారు. గుంటూరు రూరల్ మండలం అంకిరెడ్డిపాలెం సమతా నగర్‌లో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో "యువ విద్యార్థుల శిక్షణా శిబిరం" 3రోజులపాటు జరిగింది. ఈ శిక్షణా శిబిరంలో కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ చదువుకునే ప్రతి విద్యార్థి అంబేద్కర్ ఆలోచనా విధానం కలిగి ఉండాలని, ఆయాచితంగా వచ్చే దేన్నైనా తీసుకోకుండా, కష్టపడి సాధించాలన్నారు. అంబేద్కర్ చిన్నప్పటి నుండి ఎన్నికష్టాలు ఎదురైనా ఎవరి దగ్గర చేతులు చాచలేదని...కాబట్టి ప్రతి ఒక్కరూ అంబేద్కర్‌ని ఆదర్శంగా తీసుకొని జీవించాలన్నారు. "యువ విద్యార్థుల శిక్షణా శిబిరం" కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్ పాల్ మాట్లాడుతూ చదువుకునే ప్రతి ఒక్కరూ మహనీయులను ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఉన్నత స్థితి నుంచి ఉన్నతమైన స్థితిలోనికి రావాలని పాల్గొన్న విద్యార్థులకు వివరించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తన మనసుని కంట్రోల్లో ఉంచుకోవాలని మనస్సు మరియు బుద్ధి ఒకే ఆలోచన కలిగి ఉండాలని, విద్యార్థిగా చదువుకోవడం తప్ప వేరే ఆలోచన ఉండకూడదని, జీవితంలో నువ్వు గెలిచి నీ తల్లితండ్రులను మరియు మీ గ్రామాన్ని గెలిపించాలన్నారు. బాస మాసపత్రిక ఎడిటర్ ఎన్.జె.విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థికి మార్కులు కొలమానం కాదని, తక్కువ చదువు చదివిన చాలా మంది మేధావులు ప్రపంచాన్ని శాసించారని..ప్రతి ఒక్కరూ పుస్తక పరిజ్ఞానం కలిగి ఉండాలని, అనుకున్న లక్ష్యాన్ని సాధించే వరకు విశ్రమించకూడదన్నారు. కార్యక్రమంలో అతిథులు మద్దు అంకయ్య, కొండపల్లి విల్సన్, విప్పర్ల విజయభాస్కర్, ప్రొఫెసర్ శేషుబాబు, ల్యాంప్ సంస్థ కోఆర్డినేటర్ షేక్ బాజీ, అంబేద్కర్ ఆలోచనా వేది సమతా నగర్ సభ్యులు దొడ్డా నాగమల్లి రాజు, నూతలపాటి సుబ్బారావు, దొడ్డా రాజేంద్రప్రసాద్, తురకా మంగయ్య, స్థానిక విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆదర్శవంతమైన నాయకుల్లో అగ్రగామి పుచ్చలపల్లి

గుంటూరు కల్చరల్,మే 19,ప్రభాతవార్త : భ్రష్టు పట్టిన నేటి రాజకీయ వ్యవస్థలో ఉన్నత విలువలు గల సుందరయ్య లాంటివారు మరలా ఎదిగి వస్తేనే వ్యవస్థ ప్రక్షాళన అవుతుందని, అత్యంత ఆదర్శవంతమైన నాయకుల్లో అగ్రగామి పుచ్చలపల్లి సుందరయ్య అని అవగాహన సంస్థ సభ్యులు




నివాళులర్పించారు. ఆయన వర్ధంతి సందర్భంగా సంస్థ కార్యాలయంలో "సోషలిజంతోనే నూతన సమాజం" అన్న అంశంపై చర్చ జరిగింది. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ సంక్షోభంలో కూరుకుపోతున్న పెట్టుబడిదారీ వ్యవస్థ ఫలితంగానే రాజకీయ విలువలు సైతం దిగజారిపోతున్నాయన్నారు. మార్కెట్ ఆలోచనా విధానం, అస్తిత్వ రాజకీయాలు, మతోన్మాదం, ఫాసిస్టు రాజకీయాలు పుంజుకుంటున్నాయని సమాజంలో సైద్ధాంతిక క్షీణత ఏర్పడిందన్నారు. విశ్రాంత టెలికం అధికారి ఎన్.సదాశివం మాట్లాడుతూ స్వాతంత్ర పోరాట విలువల్లోంచి సుందరయ్య లాంటి మహనుభావులు రాజకీయాల్లో అడుగుపెట్టారన్నారు. కార్యక్రమంలో విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, జనార్ధన్‌రావు, తదితరులు ప్రసంగించారు.

## 5న 'ఛలో విజయవాడ'ను విజయవంతం చేయండి

### --ఐక్యవేదిక చైర్మన్ చాంద్‌భాషా

గుంటూరు విద్య,మే 19,ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో జిల్లా ఐక్యవేదిక చైర్మన్ చాంద్ భాషా అధ్యక్షతన జూన్ 5న చలో విజయవాడ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై జూన్ 5వ తేదిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగులను కోరారు. కార్యక్రమానికి రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిధిగా హాజరు కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక చైర్మన్ చాంద్ భాష మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై రాజీలేని పోరాటం చేసేది మాత్రమే మన అసోసియేషన్ అని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కరీముల్లా షాఖాదరి, జిల్లా కోశాధికారి పోతురాజు సంయుక్త కార్యదర్శి విజయబాబు, లక్ష్మీనారాయణ, మురళీ, పొన్నూరు తాలూకా యూనిట్ అధ్యక్షులు, హరిబాబు, తాడికొండ తాలూకా యూనిట్ అధ్యక్షులు సుబ్బారావు, నగర శాఖ అధ్యక్షులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పెద్దరత్తయ్య, మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు అరుణకుమారి రోజా, పద్మజ, ప్రభావతి, అలీషు, నీలిమా, రమణి, తదితరులు పాల్గొన్నారు.

**ఒరిజినల్ పొలం దస్తావేజులు పోయినవి**

తుళ్ళూరు మండలం వడ్డమాను గ్రామానికి చెందిన మల్లాది శ్రీహరి రావు సన్నాఫ్ వెంకయ్యకు వడ్డమాను గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 76/ఏ నందు ఎకరం పొలం సర్వే నంబర్ 85లో 9సెంట్లు పొలంతో పాటు ఇంటి స్థలానికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు ఈనెల 9వ తేది బ్యాంకు పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై తుళ్ళూరు వెళ్లి వస్తుండగా పోయినవి పొలం దస్తావేజు నంబర్ 510/2012 స్థలం దస్తావేజు నంబర్ 167/99 దొరికిన వారు 94944 17345కి తెలపగలరు.

# గుంటూరు వార్త



## గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మినీ మహానాడును జయప్రదం చేయండి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు తూర్పు, మే 19 ప్రభాతవార్త : గుంటూరు జిల్లా టిడిపి కార్యాలయంలో మంగళవారం జరిగే గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతలతో ఎమ్మెల్యే మాధవి సమావేశం నిర్వహించారు. తొలుత



ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి వినతులు స్వీకరించారు. వాటిని పరిష్కరించవలసిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ కుటుంబసభ్యులకు అతి పెద్ద పండుగ మహానాడు అన్నారు. దీనిలో భాగంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మినీ మహానాడును ఘనంగా నిర్వహించనున్నామని ఎమ్మెల్యే మాధవి తెలిపారు. దీనికి నియోజకవర్గం నుండి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. అదే విధంగా పార్టీ సంస్థాగత ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్నామని, కష్టపడిన ప్రతి నాయకుడు, కార్యకర్తకు తప్పనిసరిగా న్యాయం చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు. అదే విధంగా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి, ప్రతిపక్ష నాయకులు చేసే విష ప్రచారాన్ని ప్రజలతోనే తిప్పికొట్టాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు.

## మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం

### - ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నాం
### - గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు తూర్పు, మే 19 ప్రభాతవార్త : గుంటూరు నగరంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సోమవారం రూ.2.67 కోట్లతో సి.సి.డ్రైన్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. హిమని సెంటర్ నుంచి బండ్ల బజారు వరకు రూ.58.50 లక్షలు హుడా రోడ్డులో సైడ్ డ్రైన్ రూ.97 లక్షలు, కొబ్బరికాయలు సాంబయ్య కాలనీ 1 లైన్ నుంచి 6 లైన్ వరకు పైపు లైన్స్ రూ.34 లక్షలు, రాఫ్ నగర్ క్రాస్ రోడ్డులో పైపులైన్లు, సి.సి.డ్రైయిన్, సి.సి.రోడ్లు రూ.18.47 లక్షలు, దుర్గానగర్ 5వ లైన్ నుంచి జారీ స్వరాజ్‌నగర్ మీదుగా పొన్నూరు రోడ్డు వెయిట్ మిక్స్ రోడ్డు వరకు రూ.60 లక్షలతో ఈ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో మురుగునీరు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చిన్నపాటి వర్షానికి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలోకి సైతం మురుగునీరు చేరుతాయని, ఇకపై ఇలాంటివి కనిపించకుండా చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని వెల్లడించారు. బండ్లబజార్ ప్రాంతాలలో వ్యాపార వర్గాలు ఎక్కువగా ఉంటారని, ఈ క్రమంలో మురుగునీరు నిల్వ లేకుండా చేయడమే లక్ష్యమని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సిఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో గుంటూరు నగరాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, డిప్యూటీ మేయర్ సజీల, డివిజన్ అధ్యక్షులు సలీం, బ్రహ్మస్వామి, శ్రీనివాసరావు, కార్పోరేటర్ శంకూరి శ్రీనివాస్, చల్లా ఆంజనేయప్రసాద్, గాలి సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో ఉత్తమ వైద్యులుగా సేవలందించాలి

### --ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్

గుంటూరు విద్య,మే 19,ప్రభాతవార్త : వైద్యరంగంలో సంభవిస్తున్న అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి వైద్య విద్యార్థి అందిపుచ్చుకొని సమాజంలో ఉన్నతమైన వైద్యులుగా సేవలందించాలని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ అన్నారు. సోమవారం భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో జరిగిన పూర్వ విద్యార్థుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభకు భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు అధ్యక్షత వహించారు. డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ భాష్యం మెడెక్స్ నుండి వందలాది మంది




విద్యార్థులు ప్రతిష్టాత్మక ఎయిమ్స్, జిప్మర్ వంటి సంస్థల్లో సీట్లు సాధించి వైద్యవిద్యనభ్యసించడం ముదావహమన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో మీరెంచుకున్న లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ భాష్యం మెడెక్స్ ద్వారా ఎంతోమంది విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించి ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలల ద్వారా వైద్యవిద్య నభ్యసించి దేశ, విదేశాల్లో ఉత్తమ వైద్యులుగా రాణించడం ఒక గురువుగా తనకెంతో సంతృప్తి నిచ్చిందన్నారు. భాష్యం విద్యార్థులు నలుమూలలా భాష్యం ఖ్యాతిని ఇనుమడింపచేస్తున్నారని ఆనందం వ్యక్తంచేశారు. ముఖ్యఅతిధి డాక్టర్ పి.చంద్రశేఖర్‌ని చైర్మన్ భాష్యం రామకృష్ణ దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాష్యం మెడెక్స్‌లో విద్యనభ్యసించిన 300మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపి ఈఏపి సెట్ పరీక్షలు ప్రారంభం

గుంటూరు విద్య,మే 19,ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 19నుంచి ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఆయా తేదీల్లో ఉదయం మధ్యాహ్నం సెక్షన్‌లో ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న ఈ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం జరిగిన పరీక్షలకు మొత్తం 40,917గాను 37,665మంది హాజరయ్యారు. 92.03శాతం హాజరు నమోదైంది. అనకాపల్లి జిల్లాలో 190కి 175మంది, అనంతపురం 2818కి గాను 2539, అన్నమయ్య జిల్లా 1239కి గాను 11.53, బాపట్ల 550కి 519మంది, చిత్తూరు 874కి 798, ఈస్ట్ గోదావరి 1300మందికిగాను 1204 మంది, ఏలూరు 1003 కి 950మంది, గుంటూరు 2076కి గాను 1930కి, కాకినాడ 1845 కి గాను 1318, ఎన్టీఆర్ జిల్లా 3400కి 3101, పల్నాడు 962 కి గాను 898, ప్రకాశం 1692కి గాను 1542, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా 1383కి గాను 1277, శ్రీసత్యసాయి జిల్లా 203 కి గాను 191. శ్రీకాకుళం 1936కి గాను 1802, తిరుపతి 2458కి గాను 2277, విశాఖపట్నం 4564 కి గాను 4151. విజయనగరం 2162 కిగాను 2009, వెస్ట్ గోదావరి 2006 కి 1850, వైఎస్సార్ జిల్లా 1719కి గాను 1584, హైదరాబాద్ 538కి గాను 357 మంది చొప్పున హాజరయ్యారు. మొత్తంగా 40,917మందికిగాను 37,688మంది హాజరయ్యారు.

## పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు

### - నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు తూర్పు, మే 19 ప్రభాతవార్త : గుంటూరు నగరంలో పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో రూ.3.34 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేయుటకు శంఖుస్థాపన చేశామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. సోమవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 11,12,15,17 డివిజన్లలో సి.సి.రోడ్లు, సి.సి.డ్రైన్లు



నిర్మించుటకు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు నజీర్ అహ్మద్‌తో కలిసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో చిన్నపాటి వర్షానికే రోడ్లపైకి వర్షపునీరు నిలవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని స్థానిక ప్రజా ప్రతినిధుల ప్రతిపాదనలతో గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలో 11,12,15,17 డివిజన్లలో 3.34 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించుటకు శంఖుస్థాపన చేశామన్నారు. గుంటూరు నగరంతో పాటు నగరంలో విలీన గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులు పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో నిర్వహించుటకు చర్యలు తీసుకున్నామన్నారు. నగరాభివృద్ధికి గుంటూరు పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రివర్యులు పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వారితో మాట్లాడి నిధులు త్వరితగతిన అందేలా ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. గుంటూరు నగరాభివృద్ధికి నగరంలోని ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులను కలుపుకొని వెళ్తామని, వారి అభిప్రాయాల మేరకు అభివృద్ధి పనులు నిర్వహిస్తామని తెలియజేశారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో వర్షం కురిసిన సందర్భంలో తూర్పు నియోజకవర్గంలోని పట్నం బజారు నుండి పీకలవాగు వరకు వర్షపు నీరు కాలువల్లోకి వెళ్ళకుండా రోడ్లపై నిలబడుట వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం హిమని వద్ద నిర్మిస్తున్న డ్రైన్స్ వలన వర్షపునీరు నేరుగా పీకల వాగులోకి వెళ్ళేలా నిర్మిస్తున్నారన్నారు. అంతేగాక తూర్పు నియోజకవర్గంలోని శివారు కాలనీలలో నూతనంగా డ్రైన్లు, రోడ్లు నిర్మించుటకు శంఖుస్థాపనలు చేస్తున్నామన్నారు. అదే విధంగా తూర్పు నియోజకవర్గం త్రాగునీటి, పారిశుద్ధ్య సమస్యలు లేకుండా నగరపాలక సంస్థ అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్.సజీల, నగరపాలక సంస్థ ఈఈ సుందర రామిరెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## పార్కుల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలి : కమిషనర్

గుంటూరు తూర్పు, మే 19 ప్రభాతవార్త : గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పార్కుల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. సోమవారం కమిషనర్ శ్రీనివాసులు శ్యామలానగర్, చౌడవరం, పొత్తూరు తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని పార్కుల్లో నూతనంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అత్యవసర ప్రాతిపదికన చేపట్టాలన్నారు.



శ్యామలానగర్ పార్కులో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఎక్విప్మెంట్‌ల మరమ్మత్తులను టెండర్ ఓపెన్ కాగానే పనులు చేపట్టాలని డిఈఈని ఆదేశించారు. పార్కుల్లో పచ్చదనం పెంపుకు ఉద్యానవన విభాగ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాలకు పార్కుల వాకింగ్ ట్రాక్‌లలో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి, నూరుశాతం ఇంటింటి చెత్త సేకరణ చేయడం ద్వారా ప్రధాన ప్రాంతాల్లో బ్లాక్ స్పాట్స్ లేకుండా చేయవచ్చుని, అందుకు పిన్ పాయింట్‌గా పారిశుధ్య పనులు జరిగేందుకు సచివాలయం పరిధిలో కార్మికుల హాజరు, పనితీరు, పారిశుద్ధ్యం పూర్తిగా శానిటేషన్ కార్యదర్శే బాధ్యత వహించాలన్నారు. డ్రైన్లు శుభ్రం చేయడం లేదని ప్రజల నుండి ఫిర్యాదులు అందుతున్నాయని, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఎస్‌లు మధ్యాహ్న సమయంలో కార్మికులు డ్రైన్లు శుభ్రం చేసేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఈఈ శ్రీనివాసరావు, టిపిఎస్‌లు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మనమిత్ర..ను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్ళాలి

### --అన్ని సేవలు ప్రజలకు వాట్సాప్ గవర్నెన్స్‌లో అందించాలి
### --ఆర్టీజిఎస్‌లో డేటా అనుసంధాన ప్రక్రియ వేగవంతం కావాలి
### --అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశాలు

సచివాలయం,మే 19,ప్రభాతవార్త : మనమిత్రను వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్ళి, ప్రభుత్వ సేవలన్నీ వారు మనమిత్రలో పొందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఆయన సోమవారం ఆర్టీజిఎస్ కార్యకలాపాలపైన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ సేవల ప్రగతి గురించి అధికారులను అడిగి



తెలుసుకున్నారు. జూన్ 12వ తేదీలోపు మనమిత్ర ద్వారా ప్రజలకు 500రకాల సేవలు ఇచ్చేలా అధికారులు పనిచేయాలన్నారు. ప్రజలు ఎవ్వరూ కూడా తమ పనులకోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగనవసరం లేకుండా అన్ని సేవలు మనమిత్ర ద్వారా పొందేలా చేయడమే ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఆశయమన్నారు. ఆ దిశగా మనమిత్రను ప్రజల్లోకి తీస్కెళ్ళాలన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడంలో సచివాలయం సిబ్బంది కీలకపాత్ర పోషించాలన్నారు. పంచాయితీ రాజ్ విభాగాధికారులనుద్దేశించి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం, చెత్తతొలగింపు పనుల్లో కొంత పురోగతి కనిపించిందని, అయితే పారిశుద్ధ్యం మరింత మెరుగుపడాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా కనిపించేలా చేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. డ్రోన్ మార్ట్ వెబ్ పోర్టల్‌ను ముఖ్యమంత్రి చేతుల మీద ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. సాంకేతికంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ పోర్టల్‌ను రూపొందించాలని సూచించారు. ఆర్టీజిఎస్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ప్రఖర్ జైన్ మాట్లాడుతూ ప్రస్తుతం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 325సేవలను ప్రజలకు అందిస్తున్నామని, ఈ నెలాఖరుకు 400సేవలు అందిస్తామన్నారు. ప్రభుత్వ ఆశయం ప్రకారం జూన్ 12వ తేదీ కల్లా 500సేవలు అందిస్తామన్నారు. వాట్సాప్ ద్వారా ప్రజలు డౌన్‌లోడ్ చేసుకునే ధృవపత్రాల తనిఖీ కోసం బ్లాక్ చైన్ టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగిస్తున్నామన్నారు. ఏపిసేవలో 14,269ధృవీకరణ పత్రాలకు, మీసేవలో 1240 ధృవీకరణ పత్రాలకు బ్లాక్ చైన్ టెక్నాలజీ అమలు చేయడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో పాత సర్టిఫికెట్లను కూడా బ్లాక్ చైన్ టెక్నాలజీ ద్వారా ధృవీకరించడం జరుగుతుందన్నారు. డేటా లేక్ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని చెప్పారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్, డైరెక్టర్ కృష్ణతేజ్, ఏపిఎస్ ఆర్టీసి ఎండి ద్వారకా తిరుమలరావు, పౌరసరఫరాల శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## ర్యాంకులు సాధించిన రామకృష్ణసేవాసమితి కోచింగ్ విద్యార్థులు

మాచర్ల, మే 19 ప్రభాతవార్త: మాచర్ల పట్టణంలో శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో ఉచితంగా ఏర్పాటు చేసిన ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షల్లో ఇక్కడ కోచింగ్ తీసుకున్న పలువురు



విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు సేవాసమితి నిర్వాహకులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోచింగ్ ద్వారా మంచి ర్యాంకులు సాధించేలా కృషి చేసిన ఉపాధ్యాయులను, ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ఏపీఆర్‌జేసీ శివబాలాజీ 312, సూర్యప్రకాష్ 820, శివ మహాలక్ష్మి 2225, డి.ప్రవల్లిక 3300 ర్యాంకులు సాధించారు. ఇంకా పదివేల లోపు అయిదుగురు, పాలిటెక్నిక్‌లో డి.స్వప్న 6050, ఎస్‌కే యాసిన్ 10000, పి.నవ్య 11634, శివబాలాజీ 12996, ఇంకా 20 వేల లోపు అయిదుగురు ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఉచితంగా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేసిన మెట్టు గోవిందరెడ్డిని విద్యార్థులు, తల్లిదండ్రులు, పట్టణ ప్రజలు అభినందించారు.

## తెలుగుదేశం పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే రాజకీయాల్లో సంచలనం: జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి

### - మాచర్లలో నియోజకవర్గ స్థాయి మహానాడు విజయవంతం

మాచర్ల, మే 19 ప్రభాతవార్త: తెలుగుదేవ: పార్టీ స్థాపించిన తొమ్మిది నెలల్లోనే పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి దేశ రాజకీయాల్లో సంచలనాలను సృష్టించిన ఘనత స్వర్గీయ నందమూరి తారక రామారావుకే చెల్లుతుందని పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పునరుద్ఘాటించారు. మాచర్ల పట్టణం మానుకొండ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ



మహానాడు కార్యక్రమం దిగ్విజయంగా జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ పురవీధులన్నీ పసుపు జెండాలు రెపరెపలాడాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పార్టీ జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్‌బాబు, శాప్ ఛైర్మన్ రవినాయుడు, శిల్పారామం ఛైర్మన్ మంజులారెడ్డి తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ముఖ్యఅతిథులుగా విచ్చేసిన అతిరథ మహారథులకు పార్టీ శ్రేణులు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక పార్కు సెంటర్ నుంచి మానుకొండ కల్యాణ మండపం వరకు భారీ ర్యాలీ చేశారు. మహానాడు వేదికపైన తెలుగుజాతి ఆత్మగౌరవం, తెదేపా వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా



నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రగతి కోసం పది తీర్మానాలను మాచరన్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రవేశపెట్టి లక్ష్యాలను క్యాడర్‌కు నిర్దేశించారు.

**సంక్షేమం అభివృద్ధికి బాటలు!**

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేస్తూ ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నారని మంత్రి రవికుమార్ వెల్లడించారు. అన్న ఎన్టీఆర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని తెలుగుదేశం పార్టీ కీర్తిని చంద్రబాబు ప్రపంచ నలుమూలలా వ్యాప్తి చేస్తున్నారని కొనియాడారు. యువ నాయకులు నారా లోకేష్ తండ్రి బాటలో నడుస్తూ కార్యకర్తల సంక్షేమం కోసం



పాటుపడుతున్నారని చెప్పారు. సాగు, తాగునీరు ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి, ప్రజలకు చంద్రబాబు కచినచతంగా సుపరిపాలన అందిస్తారని వివరించారు.

**ప్రగతిచ పథకాలు ఏవీ ఆగవు!: ఎంపీ లావు**

ఎన్డీయే ప్రభుత్వ హయాంలో ప్రగతి, పథకాలు ఆగవని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. లక్ష్యాల నిర్దేశానికే మహానాడు కార్యక్రమం అని, సాగునీరు, మౌలిక రంగ ప్రాజెక్టులపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిసారిస్తున్నారని చెప్పారు. ఎన్నికల ముందు మాచర్ల నియోజకవర్గంలో తెదేపా జజెండాను ఎగురవేసి, బ్రహ్మారెడ్డిని గెలిపించుకునేందుకు కేడర్ పోలింగ్ బూత్‌లో యుద్ధం చేసిందని గుర్తు చేశారు. సామాజిక న్యాయం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. కష్టపడిన కార్యకర్తలకు కచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు.

**మాచర్ల నియోజకవర్గ ప్రగతికి పది తీర్మానాలు: ఎమ్మెల్యే జూలకంటి**

మాచర్ల నియోజకవర్గ ప్రగతికి మహానాడు వేదికపై పది తీర్మానాలు చేశామని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. కూడు, గూడు, గుడ్డ నినాదంతో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమానికి పెద్దపీఠ వేశారని ఆయన గుర్తు చేశారు. ప్రతి ఇంటికి తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు అందించే వరకు విశ్రమించనని హామీ ఇచ్చారు. అన్న ఎన్టీఆర్ స్ఫూర్తితో పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కడపలో ఈ నెల 27, 28, 29న మహానాడు నిర్వహిస్తున్నారని, ఇదే ఉత్సాహంతో పెద్ద ఎత్తున నియోజకవర్గం నుంచి తరలివెళ్లి పసుపు పండుగ మహానాడును జయప్రదం చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్‌బాబు, శాప్ ఛైర్మన్ రవినాయుడు, శిల్పారామం ఛైర్మన్ మంజులారెడ్డి, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.దారునాయక్, మాచర్ల మున్సిపల్ ఛైర్మన్ మదార్‌సాహెబ్, తెదేపా ముఖ్య నాయకులు, మాచర్ల మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ యాగంటి మల్లికారఢ్జునరావు, మాచర్ల పట్టణ తెదేపా అధ్యక్షుడు కొమెర దుర్గారావు, ఎనుముల కేశవరెడ్డి, కజ్జం సైదయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎన్టీయే ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట: మంత్రి గొట్టిపాటి




మాచర్ల, మే 19 ప్రభాతవార్త: ఎన్టీయే ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట వేస్తున్నామని పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం దుర్గి మండల కేంద్రంలో కస్తూరిబా గాంధీ గిరిజన బాలికల పాఠశాలలో జూనియర్ కళాశాల అప్‌గ్రేడ్ కోసం అదనపు గదుల నిర్మాణాల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని, శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. దాదాపు రూ. కోటి 52 లక్షలతో నిర్మాణాలు జరగనున్నాయి. అలానే ఏపీ మోడల్ స్కూల్ బాలికల వసతిగృహ నిర్మాణానికి రూ.కోటి 73 లక్షల నిధులతో ముఖ్యఅతిథులు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు దారునాయక్, దుర్గి మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగుదేశం మినీ మహానాడు

### - పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, టిడిపి నాయకులు

నరసరావుపేట, మే 18 ప్రభాతవార్త : నరసరావుపేటలో మినీ మహానాడు కార్యక్రమాన్ని తెలుగుదేశంపార్టీ సోమవారం ఘనంగా నిర్వహించింది. స్థానిక టౌన్‌హాల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి



రామచంద్రప్రసాద్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ ప్రతిపక్షంలో కష్టపడటంతో ఎంతో నష్టపోయామన్నారు. ఇష్టపడి గెలుపును సాధించామన్నారు. చంద్రబాబునాడుయును సిఎం చేసుకోవడమే లక్ష్యంగా నాయకుడు, అభ్యర్థి ఎవరు అని చూడకుండా కార్యకర్తలు పని చేశారన్నారు. చంద్రబాబు పాలన అద్భుతంగా ఉందన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమాన్ని అందిస్తున్నారని తెలిపారు. నాయకులు మన్నవ మోహనకృష్ణ, గోనుగుంట్ల కోటేశ్వరరావు, నల్లపాటి రాము మాట్లాడుతూ పేదల కోసం అన్న ఎన్టీఆర్ తెలుగుదేశంపార్టీని స్థాపించారన్నారు. దేశంలో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. ప్రధానమంత్రి సైతం చంద్రబాబు పాలనను ఆదర్శంగా తీసుకుంటున్నామని ప్రకటించడం గొప్ప విషయమన్నారు. అద్భుతమైన రాజధాని నిర్మించడంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలను తెలుగుదేశంపార్టీ చేపడుతుందన్నారు. కడపలో ఈ నెల 27,28,29 తేదీలలో నిర్వహించే మహానాడు సభలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు వారు పిలుపునిచ్చారు.

## మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి పరామర్శ



నరసరావుపేట, మే 18 ప్రభాతవార్త : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. కంజుల యలమందారెడ్డి వైకుంఠ సమారాధన కార్య క్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ సందర్భంగా ఆయన మృతిపట్ల సంతాపాన్ని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గోపిరెడ్డి వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

## శిక్షణ పొందిన డ్రైవర్లకు సర్టిఫికెట్ల ప్రదానం

నరసరావుపేట, మే 18 ప్రభాతవార్త : ఏపిఎస్ ఆర్టీసీ డిపోలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ తీసుకున్న 19వ బ్యాచ్ డ్రైవర్లకు సోమవారం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.మధు సర్టిఫికెట్‌లను అందజేశారు. డిపో మేనేజర్ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. జిల్లా అధికారి మధు మాట్లాడుతూ ప్రమాద రహిత డ్రైవర్లుగా, మంచి ఇంధన పొదుపు డ్రైవర్లుగా విధులు నిర్వహించాలన్నారు. డ్రైవర్ల పాత్ర కీలకమన్నారు. మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్‌ను ఖచ్చితంగా పాటించి ప్రమాదాల నివారణకు దోహదపడాలని కోరారు. డ్రైవింగ్ శిక్షకులు బొల్లయ్య, సుభాని పాల్గొన్నారు. 20వ బ్యాచ్ అడ్మిషన్లు జరుగుతున్నాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు.



## ప్రతి సమస్యను పరిష్కరించండి : జిల్లా ఎస్పీ

నరసరావుపేట క్రైం, మే 18 ప్రభాతవార్త : ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చిన ప్రతి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాలిచ్చారు. సోమవారం 72 ఫిర్యాదులను గ్రీవెన్స్‌లో స్వీకరించారు. కుటుంబ, ఆర్థిక, ఆస్థి తగాదాలు, మోసానికి సంబంధించిన సమస్యలు ఫిర్యాదుదారులు తెలియజేశారు. పిడుగురాళ్ళ మండలానికి చెందిన కీర్తన తన ఫిర్యాదులో భర్త, అతమామలు వరకట్నం కోసం వేధిస్తున్నారని తెలిపారు. సత్తెనపల్లి మండలానికి చెందిన అఖిల తన ఫిర్యాదులో తన భర్త చెడు వెసనాలకు బానిసై చంపుతానని బెదిరిస్తున్నాడని తెలిపారు. అమరావతి మండలానికి చెందిన సునీల్‌కుమార్, అతని సోదరి సంధ్యారాణికి సంబంధించి ఉన్న ఆస్థి వివాదాన్ని పరిష్కరించాలని కోరారు. నరసరావుపేటకు చెందిన రామారావు చీటిపాటల సమస్యను తెలియజేశారు. పిడుగురాళ్ళకు చెందిన ఖాజా మొహిద్దీన్ తన ఫిర్యాదులో వేణు అనే వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని రూ.2 లక్షలు తీసుకొని మోసం చేసినట్లు తెలిపారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని ఎస్పీ కె.శ్రీనివాసరావు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లకు ఆదేశాలిచ్చారు.



## మొక్కుబడులు చెల్లించుకున్న జనసేన నాయకులు



నరసరావుపేట, మే 18 ప్రభాతవార్త : జనసేన పార్టీ 2024 ఎన్నికల్లో విజయం సాధిస్తే మొక్కు చెల్లించుకుంటామని ఎన్నికల సమయంలో చేసిన పూజలకు సంబంధించి సోమవారం జనసేన పార్టీ నాయకులు అడిగొప్పల గ్రామంలో వేంచేసియున్న శ్రీ నీలంపాటి శ్రీలక్ష్మి అమ్మవారిని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కృష్ణంశెట్టి గోవిందరావు, బెల్లంకొండ అనీల్, అద్దేపల్లి ఆనంద్, గుప్తా శ్రీకాంత్, వీర మహిళ మిరియాల సుబ్బమ్మ తదితరులు పాల్గొని మాట్లాడారు. తాము అనుకున్నదానికంటే ఎక్కువ సీట్లను ప్రజలు జనసేన పార్టీకి ఇచ్చారని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ డిప్యూటీ సిఎంగా రాష్ట్రానికి సేవలందిస్తున్నారని పేర్కొన్నారు.

## ప్రభుత్వ పథకాలు, సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టండి : కలెక్టర్



నరసరావుపేట, మే 18 ప్రభాతవార్త : ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాలిచ్చారు. సోమవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయనంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమీక్షలో కలెక్టర్ అరుణ్‌బాబు, జేసి సూరజ్‌గనోరే, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయనంద్ మాట్లాడుతూ స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ కింద అమలు చేస్తున్న ప్రాజెక్టులలో పల్నాడు జిల్లాలో పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ప్రోటోకాల్స్ పాటించి విజయవంతం చేయాలన్నారు. వైజాగ్‌లో నిర్వహించే యోగా దినోత్సవంలో దేశ ప్రధాని నరేంద్రమోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొంటారన్నారు. జిల్లా, మండల, గ్రామ స్థాయిలలో యోగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 21న కర్టెన్ రైజన్ కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకొని నిర్వహించాలని ఆదేశాలిచ్చారు.

## ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల దోపిడిని అరికట్టాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



నరసరావుపేట టౌన్, మే 18 ప్రభాతవార్త : ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల దోపిడిని అరికట్టాలని జిల్లా కలెక్టర్‌కు ప్రజా సంఘాల నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. నాయకులు రామకృష్ణ, నల్లపాటి రామారావు, దరియావలి, శ్రీను నాయక్, బాదుగున్నల శ్రీను తదితరులు మాట్లాడారు. అధిక ఫీజులతో ప్రైవేట్ స్కూల్స్, కళాశాలలు దోపిడి చేస్తున్నాయన్నారు. పదవ తరగతి వరకు చదివించాలన్నా నోట్ పుస్తకాలు, యూనిఫాం, షూస్ వంటి వాటి పేరుతో నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. పేదలకు ఇవ్వాల్సిన 25 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం లేదన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ఎస్సీ కార్పోరేషన్ నుండి షరతులు లేకుండా రుణాలు ఇప్పించాలి : ఎమ్మార్పీయస్**

ఎస్సీ కారో ్పరేషన్ రుణాలకు సంబంధించి బ్యాంకర్లు ఎటువంటి షరతులు లేకుండా రుణాలు ఇవ్వాలని ఎమ్మార్పీయస్ జిల్లా అధ్యక్షులు చింతిరాల మీరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ కార్పోరేషన్ లోను మంజూరు చేసినా బ్యాంకర్లు సివిల్ స్కోర్ లేదని, షూరిటీ చూపించాలని, డ్వాక్రాలలో బాకీలు ఉండకూడదని సాకులు చెప్పి రుణాలు ఇవ్వడం లేదన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణయ్య, సాగర్, ప్రశాంతిరాజు పాల్గొన్నారు.

## మండల ఉపాధ్యక్ష పదవిని కైవసం చేసుకున్న తెలుగుదేశంపార్టీ

నరసరావుపేట, మే 18 ప్రభాతవార్త : నరసరావుపేట మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవిని తెలుగుదేశంపార్టీ కైవసం చేసుకుంది. మొత్తం 16 మంది ఎంపిటిసిలు ఉండగా కోరం లేకపోవడంతో ఇప్పటికే రెండు పర్యాయాలు ఎన్నిక వాయిదా పడింది. జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీ ఎన్నికల అధికారిగా సోమవారం వ్యవహరించారు. కేసానుపల్లి ఎంపిటిసి వంగపూడి సువార్తను



ఉపాధ్యక్షురాలిగా, ఉప్పలపాడు ఎంపిటి కందుల నాగమ్మ, పమిడిపాడు-1 ఎంపిటిసి కంచేటి భార్గవిలు ప్రతిపాధించి బలపరిచారు. దీంతో ఎన్నికల అధికారి సువార్తను ఉపాధ్యక్షురాలుగా ప్రకటించి డిక్లరేషన్ ఫారాలను అందజేశారు. డిఎస్పీ కె.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎంపిడిఓ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో బందోబస్తును ఏర్పాటు చేశారు.

**ప్రజాస్వామ్యం గెలిచింది : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ**

నరసరావుపేట మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవిని తెలుగుదేశంపార్టీ కైవసం చేసుకుందని, ఈ ఎన్నిక ప్రజాస్వామ్యాన్ని గెలిపించిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఉపాధ్యక్ష ఎన్నికలు ముగియగానే పార్టీ శ్రేణులు విజయోత్సవాలను నిర్వహించాయి. ఈ స ందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు మీడియాతో మాట్లాడుతూ వైకాపా హయాంలో ఎంపిటిసిలను కనీసం నామినేషన్లు సైతం వేయనివ్వలేదన్నారు. రెండు పర్యాయాలు కోరం లేకపోవడంతో వాయిదా పడిందన్నారు. మూడవ సారి ఎన్నికలకు హాజరు కావాలని, ప్రజాస్వామ్యబద్ధంగా అందరి ఎంపిటిసిలను ఆహ్వానించామన్నారు. అయితే ఆ పార్టీ నాయకులు సొంత పార్టీ వారినే మరో ప్రాంతానికి తీసుకెళ్ళి దాచిపెట్టడం సిగ్గుచేటన్నారు. ప్రజా బలంతో ఎప్పుడైనా గెలవాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి చంద్రబాబునాయుడు పాలనకు మద్దతుగా ముగ్గురు ఎంపిటిసిలు వైకాపా నుండి తెలుగుదేశంపార్టీలో చేరడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## విద్యతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యం: మంత్రి సత్యకుమార్


వెల్దుర్తి, మే 19 ప్రభాతవార్త: విద్యతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని ఏపీ వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో దాదాపు రూ.2.20 కోట్ల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న అదనపు గదుల



శంకుస్తాపన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని భూమిపూజ చేసి శిలాఫలాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడు, పల్నాడు జిల్లా తెదేపా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్‌బాబు, రాష్ట్ర తెదేపా ఎస్టీ సెల్ అధ్యక్షులు దారునాయక్, తెలుగు యువత ఆర్గనైజింగ్ కార్యదర్శి కుర్రి శివారెడ్డి, కళ్లం రామాంజిరెడ్డి, పలువురు తెదేపా, బీజేపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆలయ భూముల్లో అక్రమ తవ్వకాలు!

రెంటచింతల, మే 19 ప్రభాతవార్త: అక్రమ సంపాదనకు అలవాటుపడిన కొందరు ఆలయ భూఉల్లోని మట్టినీ వదలడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఎక్కడపడితే అక్కడ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా యథేచ్ఛగా లారీలకొద్దీ మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇందుకు నిదర్శనంగా మండలంలోని మిట్టగుడిపాడు వేణుగోపాలస్వామి





దేవస్థానానికి సంబంధించిన సర్వే నంబరు168లో గుర్తు తెలియని వ్యక్తులు జేసీబీతో మట్టి తవ్వకాలు జరిపి అక్రమ సంపాదనకు తెరలేపారు. దాదాపు 25 అడుగుల పొడవు, 4 అడుగుల వెడల్పు మేర విస్తీర్ణంలో తవ్వకాలు జరిపి మట్టి తరలించుకుపోయారు. లోతైన గుంతలు తవ్వి నాణ్యమైన మొరం మట్టిని తీసి అమ్ముకుంటూ అక్రమార్కులు డబ్బులు దండుకుంటున్నారు. నాణ్యమైన మొరం మట్టికి మార్కెట్లో మంచి గిరాకీ ఉండటంతో ఇదే అదనుగా భావించి అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఆలయ భూముల్లో మట్టిని మాయం చేస్తున్నారు. ఆలయ భూముల్లో అక్రమ తవ్వకాలు జరుపుతుండటంపై దేవాదాయ శాఖ అప్రమత్తమైంది. సోమవారం ఈవో గాదె రామిరెడ్డి ఈ విషయమై స్థానిక తహశీల్దారు దృష్టికి తెచ్చి తహశీల్దారు కార్యాలయంలో, పోలీసు స్టేషన్లోనూ అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు చేశారు.

## టౌన్‌హాల్ ప్రస్తుత దుస్థితికి గత ప్రభుత్వమే కారణం :ఎమ్మెల్యే ప్రత్తిపాటి

### టివి, రంగస్థల నటి గుడివాడ లహరిని సత్కరించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి, డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు

### ప్రశాంతంగా సంతోషంగా ఉండే చిలకలూరిపేటకు అవలక్షణాలు అంటించిన ఘనత గత పాలకులదే : ప్రత్తిపాటి

చిలకలూరిపేట,మే19,ప్రభాతవార్త: పట్టణంలో ఒకప్పుడు కళాప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో నిత్యం కళకళలాడిన చిలకలూరిపేట సిఆర్ క్లబ్ వంటి కళాక్షేత్రాలను కూడా గత పాలకులు కళావిహీనంగా మార్చారని, పరిపాలన అంటే ఏమిటో తెలియని వారివల్ల ప్రజలే కాకుండా కళానిలయాలు, కళాకారులతో పాటు ప్రజలు కూడా నానా అవస్థలు పడ్డారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి తెలిపారు. ఆదివారం రాత్రి పట్టణంలోని సిఆర్ క్లబ్ ఆవరణలో చివరిరోజు సిఆర్‌క్లబ్, చిలకలూరిపేట కళాపరిషత్ నాటిక పోటీల సందర్భంగా టివి రంగస్థల నటి గుడివాడ లహరి సత్కార సభలో ఆయన



ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన తెలియని ప్రబుద్ధుల నిర్వాకాల వల్లే రాష్ట్రం, ప్రజలు అన్నింటిలో వెనుకబడ్డారని అన్నారు.



కేసులు, కక్షసాధింపుల సంస్కృతి తీసుకువచ్చిన గత పాలకుల మూర్ఖపు విధానాలతో ఐదు సంవత్సరాలపాటు ప్రజలు నరకం అనుభవించారని అన్నారు. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే నియోజకవర్గ ప్రజలలో విద్వేషాలు నింపి, చిలకలూరిపేటకు కొత్త అవలక్షణాలు అంటించిన ఘనత గత పాలకులదే అని ప్రత్తిపాటి వివరించారు. అటువంటి పరిస్థితులు తిరిగి రాకూడదనే అందరూ కోరుకుంటున్నారని, నియోజకవర్గ ప్రజలు ఎప్పుడు సుఖసంతోషాలతో ఉండాలన్నదే తన కోరిక అని ప్రత్తిపాటి తెలిపారు. చిలకలూరిపేట నియోజకవర్గానికి సాధించిన నిధులు, చేసిన అభివృద్ధిని



ఒకానొక సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకూడా మెచ్చుకున్నారని ప్రత్తిపాటి ఈ సందర్భంగా వివరించారు. పేట ప్రజల సంతోషం కంటే తనకేది ముఖ్యం కాదని, వారికోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి తానెప్పుడూ ముందుంటానని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. సిఆర్ క్లబ్ నిర్వాహకులు కళలు, నాటకాలను ప్రోత్సహించడమే కాకుండా కళాకారులను గుర్తించి సన్మానించడం అభినందించదగిన విషయమని అన్నారు. ఈ నియోజకవర్గంలో కళలను ప్రోత్సహిస్తున్న యడ్లపాడు పువ్వులపల్లి సుందరయ్య కళాపరిషత్ అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, సిఆర్‌క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావులు, వారి బృందాన్ని ప్రత్తిపాటి పేరుపేరునా అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు జవ్వాజి మదన్‌మోహన్, సిఆర్‌క్లబ్ ఉపాధ్యక్షులు చెరుకూరి కాంతయ్య, కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, కోశాధికారి మక్కెన నరసింహారావు, చిలకలూరిపేట కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి షేక్ షఫీ ఉజమాలు పాల్గొన్నారు. కాగా మూడవ రోజు అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారిచే చిగురుమేఘం నాటికను ప్రదర్శించారు. ఈ నాటికను కావూరి సత్యనారాయణ రచించగా, యేపూరి హరిబాబు దర్శకత్వం వహించారు. రెండవ ప్రదర్శనగా ది అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ చిలకలూరిపేట వారిచే ఆలోకో సరదాగా అనే నాటికను కళాకారులు సత్యనారాయణ ప్రదర్శించారు. ఈ నాటికను ఉద్దేపల్లి భరత్‌కుమార్ రచించగా దర్శకత్వం ఎస్‌కె షఫీ వహించారు. అనంతరం అమృతలహరి థియేటర్ ఆర్ట్స్, గుంటూరువారిచే నాన్నా నేనొచ్చేస్తా, నాటికను ప్రదర్శించారు. ఈ నాటికను తాళాబత్తుని వెంకటేశ్వరరావు రచించగా అమృతలహరి దర్శకత్వం వహించారు.

ఈ మూడు రోజుల కళాపరిషత్‌లో ప్రదర్శించిన నాటికలలో ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళాభారతి కరీంనగర్ వారి చీకటిపువ్వు నాటిక దక్కించుకుంది. రెండు ఉత్తమ ప్రదర్శనగా అమృతలహరి ఆర్ట్స్ గుంటూరువారి నాన్నా నేనొచ్చేస్తా నాటిక గెలుచుకుంది. మూడవ ఉత్తమ ప్రదర్శనగా అమరావతి ఆర్ట్స్ గుంటూరువారి చిగురుమేఘం నాటికకు లభించింది. జ్యూరీ ప్రదర్శనగా కళాంజలి హైదరాబాద్‌వారి రైతేరాజు నాటికకు లభించింది. ఉత్తమ నటుడిగా చీకటి పువ్వు నాటికలో వంశీ పాత్రధారి కె సత్యనారాయణకు లభించింది. ఉత్తమ నటిగా చీకటిపువ్వు నాటికలో పవిత్ర పాత్రధారి లహరికి లభించింది. ఉత్తమ క్యారెక్టర్ నటిగా నాన్నా నేనొచ్చేస్తా నాటికలో సావిత్రమ్మ పాత్రధారిణి కె సరితకు లభించింది. ఉత్తమ హాస్యనటుడిగా దొందూ దొందే నాటికలో ఆరోగ్యం పాత్రధారి జబర్దస్త్ ప్రకాష్ సాధించారు. ఉత్తమ సహాయనటుడిగా చీకటిపువ్వు నాటికలో సిద్ధార్థ కు లభించింది. ఉత్తమ సహాయ నటిగా చిగురుమేఘం నాటికలో నరసమ్మ పాత్రధారి బి నాగరాణికి లభించింది. ఉత్తమ రచన రైతేరాజు నాటిక రచయిత కంచర్ల సూర్యప్రకాష్‌కు దక్కింది. ఉత్తమ దర్శకుడిగా చీకటిపువ్వు నాటిక దర్శకుడు మంచాల రమేష్‌కు వచ్చింది. ఉత్తమ రంగాలంకరణ బ్రహ్మస్వరూపం నాటికకు రంగాలంకరణ చేసిన సురభి నాగరాజుకు లభించింది. కన్సొలేషన్ బహుమతులను వరుసగా రైతే రాజు, బ్రహ్మస్వరూపం, ఇది రహదారికాదు,చీకటిపువ్వు, దొందూ దొందే,చిగురుమేఘం, నాన్నా నేనొచ్చేస్తా నాటికలలో పాత్రధారులు తిరుమల, ఈసిహెచ్‌కె ప్రసాద్, చిరంజీవి దినేష్, యేపూరి శ్రీనివాస్, కె కుమారి, సిఎ ప్రసాద్, ఎసికెడి హసనేలకు లభించాయి. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా జెట్టి హరిబాబు, ఘంటా సుమనమణి, మాండ్యాదాపల్లు వ్యవహరించారు.

## 35వ వార్డు టిడిపి నూతన కార్యవర్గాన్ని అభినందించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట,మే19,ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలలో బాగంగా పట్టణంలోని 35వ వార్డు టిడిపి నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. వార్డు అధ్యక్షులుగా కానుల శివకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా జరపల చిననాయక్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా



నూతనంగా ఎన్నికైన కమిటి సభ్యులు మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావును మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ప్రత్తిపాటి అభినందించి పార్టీ అభివృద్ధికోసం ఐకమంగా కష్టపడి పనిచేయాలని వారికి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండా వీరయ్య, బాచిన రఘు, సుబ్బారావు, ఆంజనేయులు, సాంబశివనాయక్, కోటేశ్వరరావు నాయక్, కుల్లి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు

చిలకలూరిపేట,మే19,ప్రభాతవార్త: పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండప ఆవరణలో వేంచేసియున్న శ్రీ పద్మావతి గోదా సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవాలయంనందు సోమవారం స్వామివారి జన్మనక్షత్రమైనటువంటి శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆలయకమిటీ వారు ఏర్పాటుచేసిన అభిషేకం మరియు ప్రత్యేక పూజలలో మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చేవూరి కృష్ణమూర్తి, టిడిపి కౌన్సిలర్లు కొత్తకుమారి, కూనల ప్రమీల, లక్ష్మీతిరుమల, కంచర్ల కరుణ,రాయని హరిత, జంగా సుజాత, అలపాటి కాలేషా, చిలకల రామలింగేశ్వరరావు, అమరా మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## గిన్నీస్ బుక్ రికార్డు సాధించిన అంకిత్‌పాల్‌కు సత్కారం

సత్తెనపల్లి, మే 19 ప్రభాతవార్త : గిన్నీస్ బుక్ రికార్డు సాధించిన అంకిత్‌పాల్‌ను లోక్ జనశక్తి పార్టీ జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోవారం సత్కరించారు. నాయకులు మాట్లాడుతూ అంకిత్‌పాల్ 18 దేశాలలో 1046 మందితో స్వరాలు ఆలపించి గిన్నీస్ బుక్ రికార్డు




సాధించారన్నారు. ఆర్థిక వెసులబాటు లేకున్నా ఉన్నత శిఖరాలను సాధించేందుకు చిన్నారి అంకిత్‌పాల్ ఎంతో ప్రతిభ చూపారని తెలిపారు. తల్లిదండ్రులు చదువు ఒక్కటే లోకం కాదని, వారిలో ఉండే ఆసక్తిని గమనించి ఆయా రంగాలలో ప్రోత్సాహం అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహంకాళి వెంక ట్రావు, కొండబాబు, పత్తిపాటి కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## దళిత విద్యార్థిపై దాడిని ఖండించిన కాంగ్రెస్


సత్తెనపల్లి, మే 19 ప్రభాతవార్త : దళిత విద్యార్థి జేమ్స్ పై తిరుపతి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన దాడిని కాంగ్రెస్ నాయకులు ఖండించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు దాసరి జ్ఞానరాజ్‌పాల్ మాట్లాడారు. జేమ్స్ బిటెక్ చివరి సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. అయితే అదే



కళాశాలలో యశ్వంత్‌నాయుడు జేమ్స్‌ను పదేపదే అవమానించాడని తెలిపారు. యశ్వంత్‌నాయుడుతో పాటు రూపేష్, కిరణ్, జగ్గా, నాని తదితరులు దాడి చేశారన్నారు. హత్యాప్రయత్నం చేసే సమయంలో స్థానికులు అక్కడకు రావడంతో దాడి చేసినవారు పరారయ్యారని తెలిపారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

## సిసి కెమేరాలు ఏర్పాటు చేయండి

పెదకూరపాడు, మే 19 ప్రభాతవార్త : మండల ప్రజలు తమ గ్రామాలలో ముఖ్యమైన ప్రదేశాలలో సి.సి.కెమేరాలు ఏర్పాటు చేయాలని సి.ఐ. సురేష్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ



దేవాలయాలు, ముఖ్యమైన రాజకీయ నాయకుల విగ్రహాల వద్ద తప్పనిసరిగా కెమేరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నేర నియంత్రణలో భాగంగా ప్రజలు సహకరించాలని కోరారు. వీటివల్ల దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను నివారించవచ్చని తెలియజేశారు.

## 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలి

అమరావతి, మే 19 ప్రభాతవార్త : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కూలీల వేతనాలను వెంటనే ఇవ్వాలని 20వతేదీన గ్రామ సచివాలయాలు, మండల కేంద్రాల్లో జరగనున్న ఆందోళనలు, నిరసన కార్యక్రమాల్లో ఉపాధిహామీ కూలీలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక



సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు కోరారు. మునగోడు గ్రామంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం కూలీల సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. సకాలంలో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనులు చేసే ప్రాంతంలో మజ్జిగ, మంచినీరు, పలుగు, పార, అలవెన్స్‌లు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు సయ్యద్ మొహిద్దీన్, మేట్‌లు షేక్.గాలిసాహెబ్, నేలపాటి జయకుమార్, చం ద్రశేఖరరెడ్డి, షేక్.రఫీ, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై జరుగుతున్న సామాజిక లైంగిక దాడులను అరికట్టాలి

తాడేపల్లి,మే 19,ప్రభాతవార్త : రాష్ట్రవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న సాంస్కృతిక,సామాజిక,లైంగిక దాడులను అరికట్టాలని నిందితులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పిఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లీగల్ సెల్క కన్వీనర్,న్యాయవాది చిలువూరు నాగరాజు మాదిగ రాష్ట్ర ప్రభుతా వ్వనికి విజ్ఞప్తి చేశారు.రాష్ట్రవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు,వేధింపులు జరుగుతున్న నేపధ్యంలో ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలోసమీక్షా సమావేశం జరిగింది.జరుగుతున్న దాడులపై భవిష్యత్తులో జరగకుండా పూర్తిగా అరికటా ్టలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజ్యాంగాధిపతి గవర్నర్ కు న్యాయవాది చిలుకూరు నాగరాజు మాదిగ బహిరంగ లేఖ



అందజేస్తామని తెలిపారు.అంబేడ్కర్ రాజ్యాంగం దళితులకు కల్పించిన జీవించే హక్కులను కాపాడండి సామాజిక భద్రతను కల్పించాలన్నారు.కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రాష్ట్రవ్యాప్తంగా దళితులపై పెరుగుతున్న టిడిపి జనసేన దాష్టీకం ఓట్లేసి గెలిపించిన దళితులకు అంబేడ్కర్ రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కులను కాలరాస్తున్న టిడిపి జనసేన ఆధునిక అగ్రవర్ణ మనువాదులు. ఇప్పటికీ స్పందించని ఖండించని సిఎం,డిప్యూటీ సీఎం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై హింస దాడులు,సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నాయని తెలియజేయుటకు చాలా చింతిస్తున్నామన్నారు. దళితుల ఓట్లతో గద్దెనెక్కాక టీడిపి,జనసేన స్థానిక నాయకులు దళితులపై పదే పదే సామాజిక దాడులు కొనసాగిస్తూ సమాజంలో వారిని తీవ్రమైన భయాందోళనలకు గురిచేయడమే కాకుండా అభద్రతా భావంలోనికి నెట్టివేయడం దారుణమన్నారు. తద్వారా భారత దేశ మూలవాసులైన దళితులకు అంబేద్కర్ రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కులకు భంగం కలిగిస్తూ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కల్గిస్తున్నారని ఆవేదన వ్యక్ తంచేశారు.ఈ సమీక్షా సమావేశంలో ఎమా ్మర్పిఎస్ జిల్లా అధ్యక్షులు కిన్నెర నాగరాజు మాదిగ,ఎస్టీ నాయకుడు కట్టా అశోక్,రావూరి కృష్ణ,కారుమూరి సురేష్,దూరు మదన్‌కుమార్,తదితరులు పాలొ ్గన్నారు.

## శ్రీగంగా భగీరధ సగర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ

తాడేపల్లి,మే 19,ప్రభాతవార్త : శ్రీగంగా భగీరధ సగర సంక్షేమ సంఘం,శ్రీకాశీ అన్నపూర్ే ణ్ శ ్వరీ సేవా ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో 1000మందికి ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. వేసవి నేపధ్యంలో గత రెండునెలలుగా ఉచిత చల్లటి మినరల్ వాటర్,మజ్జిగ పంపిణీ చేశారు.శ్రీగంగా భగీరధ సగర సంక్షేమ సంఘం,శ్రీకాశీ అన్నపూరే ్ణశ ్వరీ సేవా ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో ఆధ్వర్యంలో మంగళగిరి తాడేపల్లి కారొ ్పరేషన్ పరిధిలోని గౌతమబుద్ధ రోడ్డు వద్ద శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం కార్యాలయ ప్రాంగణంలో శ్రీకాశీ అన్నపూర్ణేశ్వరీ సేవా ట్రస్ట్ చైర్మన్,శ్రీ గంగా భగీరథ సగర సంక్షేమ సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివరావు నేతృత్వంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం వద్ద ప్రతి సోమవారం ఉచిత మజ్జిగ పంపిణీ కార్యాక్రమం ఈ సోమవారం కూడా నిర ్వహించారు.ఈ సందర్భంగా సుమారు 1000మంది పాదాచారులకు,వాహనదారులకు,ఆర్టీసీ



బసు ్సల ప్రయాణీకులకు చల్లటి మజ్జిగను ఉచితంగా పంపిణీ చేశారు.అనంతరం సంఘ అధ్యక్షులు పందేటి సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కి నిరంతరం కృషిచేస్తున్న ముఖ్యమంత్రి నారా చం ద్రబాబునాయుడు,మంత్రి మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్ స్ఫూర్తితో సేవాగుణంతో వేసవి నేపధ్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం ప్రారంభం నుండి గత రెండు నెలలుగా నిర్విరామంగా ప్రతిరోజు పాదాచారులకు,వాహనదారులకు,ఆర్టీసీ బస్సు ప్రయాణీకులకు ఉచితంగా చల్లటి మినరల్ వాటర్‌ను అందించడంతోపాటు దాతల సహకారంతో ప్రతి సోమవారం 1000మందికి పైగా పాదాచారులకు, కార్యక్రమంలో నంగళం ప్రసాద్,కర్నాటి శివ సత్యనారాయణ,దుంపల సోములు,పంచల శివన్నారాయణ,పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం,కగ్గా శ్రీనివాసరావు,పండలనేని కోటేశ్వరరావు,ఉద్దంటి మురహరిరావు,సయ్యద్ కాలేషా,బేతపూడి మధుబాబు,నల్లమోలు నాగరాజు,రెడ్డి వీరరాఘవులు,నంధ్యాల గోపాలకృష్ణ,పందేటి శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.

## రూ. వేల కోట్ల చెత్తపన్నులేసి, కోట్ల టన్నుల చెత్తను పోగుపెట్టిన ఘనత జగన్‌దే : ప్రత్తిపాటి

చిలకలూరిపేట,మే19,ప్రభాతవార్త: ప్రజలపై వేలకోట్ల చెత్తపన్నువేసి, కోట్ల టన్నుల చెత్తను సద్వినియోగం చేయకుండా రాష్ట్రమంతా పోగుపెట్టిన అసమర్ధ ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి నిలిచారని, చిలకలూరిపేట డంపింగ్ యార్డ్ పరిధిలో రెండు లక్షల టన్నుల చెత్తను గత ప్రభుత్వం పోగుపెట్టిందని మాజీమంత్రి, స్దానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. సోమవారం పట్టణ సమీపంలోని మానుకొండవారిపాలెం వద్దనున్న డంపింగ్ యార్డ్‌ను ప్రత్తిపాటి పరిశీలించారు. ఆ డంపింగ్ యార్డ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన చెత్తనుండి ఎరువు తయారుచేసే యూనిట్‌ను





ప్రత్తిపాటి ప్రారంభించారు. గతంలో నిల్వ ఉంచిన చెత్తతో పాటు, ఎప్పటికప్పుడు సేకరిస్తున్న చెత్తను అక్టోబర్‌లోపు పూర్తిగా తొలగించి డంపింగ్ యార్డ్‌ను శుభ్రపరిచి సుందరీకరించే ప్రక్రియకు శ్రీకారం చుట్టామని ప్రత్తిపాటి తెలిపారు. డంపింగ్ యార్డ్‌ను బాగుచేసి, మంచి మొక్కలు నాటి చుట్టుపక్కల ఉండే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. రెండు లక్షల టన్నులు చెత్తను వేరోచోటకి తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్న ప్రత్తిపాటి టన్నులకు రూ750 చొప్పున రూ 13 కోట్లు నుంచి రూ 15 కోట్లు వరకు ఖర్చుచేస్తున్నామన్నారు. నిల్వ ఉంచిన చెత్తను పూర్తిగా తొలగించాక, మరలా వచ్చే చెత్తను కూడా ఎప్పటికప్పుడు చెత్త సేకరణ కేంద్రాలకు తరలించడం జరుగుతుందని అన్నారు. స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌లో బాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి కార్యాచరణలో బాగంగానే చెత్త తరలింపును చేపట్టడం జరిగిందని అన్నారు. ఇప్పటికే రోజువారి చెత్తను ఎప్పటికప్పుడు జిందాల్ పరిశ్రమకు తరలిస్తున్నామని, చెత్త రహిత స్వచ్ఛ చిలకలూరిపేట పట్టణమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ పతి శ్రీహరిబాబు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, డిఈ షేక్ అబ్దుల్ రహీం, టిడిపి పక్ష కౌన్సిల్ నాయకుడు గంగా శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, టిడిపి నాయకులు పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, కందుల రమణ, ముల్లా కరిముల్లా, పార్టీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్‌తో దేశ శక్తి సామర్థ్యాలను మోదీ ప్రపంచానికి చాటి చెప్పారు : మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

### చిలకలూరిపేట పట్టణంలో కోలాహలంగా సాగిన తిరంగా ర్యాలీ

చిలకలూరిపేట,మే19,ప్రభాతవార్త: అమాయక పౌరులపై జరిగిన ఉగ్రదాడికి ప్రతిస్పందనగా ఆపరేషన్ సింధూర్ ద్వారా ఉగ్రవాద శిబిరాల ధ్వంసంతో భారతదేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.





కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఉగ్రవాదుల ఏరివేతలో బాగంగా తీసుకున్న సాహసోపేతమైన చర్యలకు, దేశ రక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు అన్నివేళలా అండగా నిలిచారని ప్రత్తిపాటి తెలిపారు. ఉగ్రదాడిపై భారత్ సాధించిన ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా పట్టణంలో సోమవారం సాయంత్రం జరిగిన తిరంగా ర్యాలీలో కూటమి నాయకులతో కలసి ప్రత్తిపాటి ఉత్సాహంగా పాల్గొన్నారు. 26మంది సాధారణ పౌరులను బలితీసుకున్న ఉగ్రవాదుల దుశ్చర్యకు ప్రతిగా భారతసైన్యం పాకిస్తాన్‌లోని ఉగ్రశిబిరాలపై దాడులు జరిపి 100మందికి పైగా ఉగ్రవాదులను అంతం చేయడం దేశానికే గర్వకారణమని అన్నారు. ఈ చర్యకు కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా దేశమంతా మద్దతు పలకడం నిజంగా గర్వించాల్సిన విషయమని అన్నారు. భారత్‌తో పెట్టుకుంటే ఎవరైనా తుడిచిపెట్టుకుపోవడం ఖాయమని, ఉగ్రరహిత దేశంగా తీర్చిదిద్దాలన్న గొప్ప లక్ష్యంతో ప్రధాని మోదీ పనిచేస్తున్నారని ప్రత్తిపాటి కొనియాడారు. ఆపరేషన్ సింధూర్‌లో భారత త్రివిధ దళాలు చూపిన అసమాన ధైర్యసాహసాలకు యావత్‌దేశం సెల్యూట్ చేస్తుందన్నారు. భారత్ యుద్ధరీతులు, సైనిక బలానికి భయపడి పాక్ కాళ్లబేరానికి వచ్చి పాక్ కాల్పుల విరమణకు అంగీకరించిందని అన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో ప్రధాని మోదీ దేశాన్ని ఒక త్రాటిపైకి తెచ్చారని ప్రత్తిపాటి తెలిపారు. ఈ తిరంగా ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, జనసేన ఇన్‌చార్జి తోట రాజారమేష్, బిజెపి నాయకులు పోట్రూ పూర్ణచంద్రరావు, టిడిపి నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, గంగా శ్రీనివాసరావు, కందుల రమణ కౌన్సిలర్లు, మున్సిపల్ కమీషనర్ పి శ్రీహరిబాబు, పట్టణ సిఐ పి రమేష్, పట్టణ ఎస్ఐలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## రూ34లక్షలు విలువచేసే బంగారు వస్తువులను దోచుకున్న ఘటనలో రికవరీ చేసిన రూరల్ సిఐ బృందం

చిలకలూరిపేట,మే19,ప్రభాతవార్త: మండలంలోని పసుమర్రు గ్రామంలోని ఆ గ్రామానికి చెందిన యలగాల హనుమాయమ్మ తన ఇంటికి ఈనెల 6వతేదిన తాళాలు వేసి సంతమాగులూరు మండలంలోని వేల్పూరు గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి 11వతేది తన ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టబడి, బీరువా తలుపులు వంచి తెరవబడి, అందులో ఆమె పెట్టిన రూ42






సవర్ల బంగారు ఆభరణాలు, హాలు అల్మారాలో పెట్టిన 59.40 గ్రాముల వెండివస్తువులు, రెండు రాగి చెంబులు, ఇత్తడి చెంబులు కనిపించడంలేదని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 12వతేదిన పిర్యాదు చేసిందని నరసరావుపేట డిఎస్‌పి కె నాగేశ్వరరావు సోమవారం రూరల్ సిఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. కాగా వీటిని రూరల్ సిఐ బి సుబ్బనాయుడు ఆధ్వర్యంలో రూరల్ ఎస్ఐ జి అనిల్‌కుమార్, వారి బృందం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా వాటిని జిల్లా ఎస్‌పి కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నరసరావుపేట డిఎస్‌పి కె నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చిలకలూరిపేట రూరల్ సిఐ బి సుబ్బనాయుడు, రూరల్ ఎస్ఐ జి అనిల్‌కుమార్, వారి క్రైం బృందం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒంగోలు బ్రిడ్జి, గొర్రెల మండి వద్ద ఈ కేసులో ముద్దాయిలను అరెస్ట్ చేయడం జరిగింది. వారి వద్దనుంచి రూ34లక్షల విలువచేసే 42 సవర్ల బంగారు, వెండి, రాగి వస్తువులను స్వాదీనం చేసుకోవడం జరిగిందని డిఎస్‌పి కె నాగేశ్వరరావు వివరించారు. ఈ సంఘటనలో పాల్గొన్న ముద్దాయిలు చిలకలూరిపేట పట్టణం, డైక్‌మెన్ కాలనీకి చెందిన పి రాముడు,
పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి మండలం, తాడేపల్లి గ్రామానికి చెందిన బీరా సిద్దు ఎలియాస్ ఏసు ప్రస్తుతం మదర్‌థెరిస్సా కాలనీలో నివాసం ఉంటున్న బీరా సిద్దును అరెస్ట్ చేశారు. ఈ కేసును కొద్ది రోజులలో ఛేదించి పట్టుకున్న రూరల్ సిఐ బి సుబ్బనాయుడు, ఎస్ఐ అనిల్‌కుమార్, క్రైం పార్టీని ఎస్‌పి కంచి శ్రీనివాసరావు అభినందించారు. వీరికి దిశా నిర్ధేశం చేసిన నరసరావుపేట డిఎస్‌పి కె నాగేశ్వరరావుకు కూడా ఎస్‌పి అభినందనలు తెలియచేశారు.

## 21న డిఈఓ కార్యాలయం ముట్టడి : ఐక్యవేదిక నాయకులు

చిలకలూరిపేటటౌన్,మే19,ప్రభాతవార్త: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మారాలని, ఉపాధ్యాయ సంఘాల ప్రధాన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 21వతేదిన రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి 13 జిల్లాలలో డిఈఓ కార్యాలయాల ముట్టడి కార్యక్రమాన్ని



చేయనున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు సోమవారం స్ధానిక యూటిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు రాష్ట్ర నాయకులు కె కోటేశ్వరరావు, యూటిఎఫ్ జిల్లా నాయకులు కె శ్రీనివాసరెడ్డి, ఎపిటిఎఫ్ నాయకులు బి సంపత్‌బాబు, హెచ్‌యం అసోసియేషన్ అధ్యక్షులు డి వెంకటేశ్వర్లు, పిఆర్‌టియు నాయకులు షేక్ ఖాజీవలిలు పాల్గొని తెలియచేశారు.

## 21వ తేదీన డీఈఓ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయండి

బాపట్ల,మే19,ప్రభాతవార్త: ఉపాధ్యాయ పాఠశాల, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసము ప్రభుత్వము సాచివేత ధోరణి అనుసరిస్తుందని ఐక్య ఉపాధ్యాయ సంఘాల ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ భాషా అన్నారు.సోమవారం స్థానిక ఎస్టియుకార్యాలయం నందు బాపట్ల తాలూకా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉపాధ్యాయ పాఠశాల, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసము ప్రభుత్వము సాచివేత ధోరణి అనుసరిస్తుందని గత ప్రభుత్వం చేసిన విధానాలని



ఈ ప్రభుత్వం కూడా అనుసరిస్తుందని తెలియజేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవో ని మార్పు చేస్తూ ఈ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోలు 19, 20,21 జీవోలు 117 జీవో కు ప్రత్యామ్నాయంగా లేవని విద్యా,పాఠశాల రంగాన్ని బాగు చేసే విధంగా లేవని తెలిపారు. ప్రభుత్వము ఇప్పటికైనా పాఠశాల విద్యారంగాన్ని కాపాడటానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని తెలిపారు.లేనియెడల ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమ కార్యక్రమము ద్వారా పాఠశాల విద్యారంగాన్ని కాపాడుకుంటాయన్నారు.యుటిఎఫ్ నాయకులు వినయ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వము 117 జీవో ద్వారా ఆరు రకాల పాఠశాలలుగా విభజించి విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పోయే విధంగా వ్యవహరించిందని కూటమి ప్రభుత్వము 9 రకాల పాఠశాలలుగా విభజించి గత ప్రభుత్వం చేసిన విధానాల్ని అనుసరిస్తూ విద్యార్థులను ప్రైవేట్ పాఠశాల పంపించడానికి పూనుకున్నదని తెలియజేశారు. ఎస్టియు బాపట్ల జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని తెలిపినారు.యుటిఎఫ్ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల నిష్పత్తి 1:45 చేయడం వలన మిగులుగా చూపించిన సబ్జెక్టు టీచర్లు అందరూ ఉన్నత పాఠశాలలో సర్దుబాటు అవుతారని తెలిపినారు.యుటిఎఫ్ బాపట్ల జిల్లా కార్యదర్శి జంపని శ్రీనివాసరావు మాట్లాడుతూ మాన్యువల్ కౌన్సిలింగ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 21వ తేదీన గుంటూరు జిల్లా డిఈఓ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని, సమస్యలు పరిష్కారం కాకపోతే 23వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయ ముట్టడిని కూడా విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయబాబు, సురేష్,సుభాని, నాగరాజు,నారాయణ,పివి నాగరాజు పాల్గొన్నారు.

# వినుకొండలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం!

**వినియోగదారుల్లో కొరవడిన చైతన్యం**
**ప్రాణాంతకమని తెలిసినా వీడని నిర్లక్ష్యం**
**చర్యలు లేకే వ్యాపారుల ఇష్టారాజ్యం**
**నిర్మూలనలో అధికారుల అలసత్వం!**

వినుకొండ,మే19,ప్రభాతవార్త: ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి ముప్పు అని తెలిసినా మనుషులు క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నా చాలా మంది వీటి వినియోగం నుంచి దూరం కావడం లేదు. ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ కవర్ల వినియోగం వినుకొండ నియోజకవర్గంలో రోజు రోజుకు పెరిగిపోతూనే ఉంది. వాటర్ బాటిళ్ళు, పాలప్యాకెట్లు, కాఫీ,టీ కప్పులు,శుభకా ర్యాల్లో భోజనానికి ఉపయోగించే పేట్లు,గ్లాజులు ప్లాస్టిక్‌తో తయారైన వాటినే వినియోగించడం ఆందోళన కలిగిస్తోంది. చివరకు తినుబండారాలు పార్సిల్ చేసే





కవర్లు కూడా ప్లాస్టిక్ కవర్లే కావడం పరిస్థితి తీవ్రతకు అద్ధం పడుతోంది. ప్లాస్టిక్ వస్తువులు,పాలిథిన్ కవర్లు విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకోవడంలో సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీనివల్లే వాటి వినియోగం పట్టణంలో విచ్చలవిడిగా పెరుగుతోందని అంటున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ భూమిలో కలిసిపోవడానికి కొన్ని వందల ఏళ్ళు




పడుతుంది. తద్వారా నేల కూడా కాలుష్యంగా మారి భూసారం కోల్పోతుందని వ్యవసాయాధికారులు వివరిస్తున్నారు. ఫలితంగా పంటలు సక్రమంగా పండవని,కరువులు సంభవించే ప్రమాదం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో శుభకార్యాల్లో భోజనానికి అరటి ఆకులు వినియోగించేవారు. కూరగాయాలకు మార్కెట్‌కు వెళ్లేటప్పుడు చేతి సంచులు,వెదురుతో తయారు చేసిన బుట్టలు తీసుకెళ్లేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగంతో లాభాల కన్నా నష్టాలే అధికమని వైద్యులు అంటున్నా చాలా మంది పెడచెవిన పెడుతున్నారు. 50, 20 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్లు అత్యంత ప్రమాదకరమని,పలుచగా ఉన్న ఈ కవర్ల దృఢత్వం కోసం అధిక మోతాదులో రసాయనాలు కలుపుతారని ఇవి చాలా హాని కలిగిస్తాయని,ముఖ్యంగా పిల్లల్లో జ్ఞాపకశక్తి తగ్గిపోవడం,పెద్దల్లో గుండె,నాడీ సంబంధిత వ్యాధులు సంభవించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. అరికట్టాలి ్సన బాధ్యత కలిగిన సంబంధిత అధికారులు మాత్రం మిన్నకుండిపోతున్నారు. నిషేధిత ప్లాస్టిక్ అమ్మినా,కొనుగోలు చేసినా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరికలు చేస్తున్నా కొందరు వ్యాపారులకు ఇదేమీ పట్టడం లేదు. మరోవైపు అధికారులు తూతూ మంత్రంగా ఒకటో,రెండో దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి మమ అనిపిస్తుండటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా విక్రయాలు జరుపుతున్నారు. వినుకొండ మున్సిపల్ పరిధితోపాటు మండలాల పరిధిలో గ్రామ,వార్డు సచివాలయ వ్యవస్థ ఉన్నా నిర్మూలనలో అధికారులు తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు. వీటి వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలను చైతన్యం చేయడంతోపాటు,చట్టాన్ని ఉల్లఘిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకొని నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత వరకు అరికట్టే బాధ్యత అధికారులపై ఎంతో

# వినుకొండలో ఘనంగా టిడిపి మినీ మహానాడు

**పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలు,నాయకులు**
**పసుపుమయంగా మారిన ప్రాంగణం**
**స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన నేతలు**
**కార్యకర్తలే తెదేపాకు బలం నేతల ప్రసంగాలు**



వినుకొండ,మే19,ప్రభాతవార్త: వినుకొండ పట్టణంలోని తిమ్మాయిపాలెం రోడ్డు నందు గల వై కన్వెన్షన్ హాలులో నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమం ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ నలుమూలల నుంచి నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి తెదేపా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య



అతిథులుగా తెదేపా పార్లమెంటరీ నేత, నర్సరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు, జిల్లా తెదేపా అధ్యక్షులు కొమ్మాలపాటి



శ్రీధర్,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్,జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు హాజర య్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి పార్టీ జెండా ఆవిష్కరించి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు అన్ననందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాలపై తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపి శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఎన్టీఆర్ టిడిపి పెట్టి పెనుమార్పు తెచ్చారన్నారు. కూడు, గూడు, నీడ నినాదంతో పేదలను ఆదుకున్నారన్నారు. పెత్తందార్లు, సంపన్నులు రాజకీయాల్లో ఏలుబడి చేస్తున్న రోజుల్లో అన్న ఎన్టీఆర్ అతి సామాన్యులకు టిక్కెట్లు ఇచ్చి శాసనసభకు పంపారన్నారు. జీ.వీ మాట్లాడుతూ సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం పెట్టిన పార్టీ తెలుగుదేశం అని చెప్పారు. మహిళలకు ఆస్తి హక్కు, పేదలకు రూ.2లకే కిలో బియ్యం వంటి సంక్షేమ పథకాలతో పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అన్న మాటకు ఎన్టీఆర్ నిజమైన ఆర్థం చెప్పారన్నారు. అన్న ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. తెదేపాకు కార్యకర్తలే బలం అని కడపలో జరగనున్న మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ తెలుగునాట రాజకీయ చైతన్యం,అన్ని వర్గాలకు అధికారం తెదేపా ద్వారానే దగ్గరైందన్నారు. కష్టపడిన వారికి పార్టీలో సముచిత స్థానం ఎప్పుడు ఉంటుందని చెప్పారు. ఏ స్థాయికి చేరినా పార్టీకి ఎప్పుడు విధేయులై ఉండాలన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి మాట్లాడుతూ తెదేపా ఎన్నో కష్టాలు దాటుకుని వచ్చిందని కార్యకర్తల వల్లే తెదేపా బలంగా ఉందని అన్నారు. తెదేపా ప్రజా సమస్యల పరిష్కారం కోసం అభివృద్ధి కోసం నిరంతరం పని చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసి సమిష్టిగా అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. మక్కెన మాట్లాడుతూ కార్యకర్తలకు ప్రాముఖ్యతనిచ్చే పార్టీ ఏదైనా ఉందంటే అది ఒక్క తెలుగుదేశం మాత్రమే అని అన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో దుష్ట పాలన అంతం చేయడానికి తెదేపా కార్యకర్తలు సైనికుల్లా పని చేశారని ప్రశంసించారు. ఇదే ఉత్సాహంతో మహానాడు కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు రూ.5లక్షలు చొప్పున భీమా చెక్కులను జీ.వీ అందజేశారు. కార్యకర్త మృతి చెందితే 15 రోజుల్లో తెలియజేసి,30 రోజుల్లో ధృవపత్రాలుతో వినుకొండ పట్టణంలోని తెదేపా కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో మానుకొండ శివప్రసాద్, గంగాధర్, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ అర్జీలపై ఆడిట్ నిర్వహించాలి

బాపట్ల,మే19,ప్రభాతవార్త:పిజిఆర్ఎస్ అర్జీలపై ఆడిట్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు.సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు అర్జీల ద్వారా తమ సమస్యలను కలెక్టర్ దృష్టి కి తెచ్చారు.170 దరఖాస్తులు నమోదయ్యాయి.అర్జీదారుల సమస్యలను కలెక్టర్ సావధానంగా విన్నారు. వాటికి అక్కడికక్కడే



ఆయన పరిష్కార మార్గం చూపారు. తన పరిధిలో లేని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. కొన్నిటిని క్షేత్రస్థాయి పరిశీలనకు, మరికొన్నింటిని విచారించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీఆర్ఎస్ లో నమోదయ్యే ప్రతి అర్జీని అధికారులు నిశితంగా పరిశీలించి, పరిష్కరించాలన్నారు. పరిష్కారమైన అర్జీకి సంబంధించిన సదరు ఫిర్యాదుదారుడి ఇంటి వద్దకు వెళ్లి ఫోటో అప్ లోడ్ చేయాల్సి ఉందన్నారు. ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఏపీ ఎఫ్ ఆర్ ఎస్ ద్వారా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఆన్ లైన్ హాజరు వేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, బాపట్ల ఆర్డిఓ పి గ్లోరియా, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం ఆమోదం

బాపట్ల,మే19,ప్రభాతవార్త: రైతులకు మద్దతు ధర కల్పించడంలో భాగంగా 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం ఆమోదించిందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. జిల్లా అధికారులతో సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ వర్చువల్ విధానం ద్వారా డివిజన్, మండల స్థాయి అధికారులతోనూ ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరణలో బాపట్ల జిల్లాలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి సేకరించాలని జిల్లాకు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 29 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు.బయట మార్కెట్లో ధాన్యం ధరలు తగ్గడం, అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు నష్టపోతున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. బాపట్ల జిల్లాలో అత్యధికంగా ధాన్యం పంట సాగుతున్న నేపథ్యంలో ధాన్యం సేకరణ లక్ష్యం పెంచేలా అనుమతులు



ఇవ్వాలని పలుమార్లు కోరినట్లు తెలిపారు. స్పందించిన ప్రభుత్వం తాజాగా 25వేల మెట్రి టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులు ఇచ్చిందన్నారు. తాజా అనుమతులతో జిల్లాలో మొత్తంగా 55 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయం తీసుకుందన్నారు. ధాన్యం సేకరణ వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.పి ఫోర్ విధానంలో బంగారు కుటుంబాలు మార్గదర్శిలను అనుసంధానించే ప్రక్రియ చేపట్టాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. బంగారు కుటుంబాలకు మార్గదర్శిలు అందించే సహాయం ఎలా చేరవేయాలో ప్రణాళికల రూపొందించాలన్నారు. నీటి తీరువా వసూలు జిల్లాలో రూ.19 కోట్లు లక్ష్యం కాగా, గడచిన పది రోజుల్లో రేపల్లె రెవిన్యూ డివిజన్ పరిధిలో రూ.75 లక్షలు, బాపట్ల డివిజన్ లో రూ.27 లక్షలు, చీరాల డివిజన్ లో రూ.11 లక్షలు సొమ్మును వసూలు చేశామన్నారు. మిగిలినవి లక్ష్యం మేరకు వసూలు చేయాలన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద పట్టణాలలో 2,500 యూనిట్లను స్థాపించాలని మున్సిపల్ కమిషనర్లకు లక్ష్యాలను నిర్దేశించామన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో సూర్య ఘర్ యూనిట్ల స్థాపన ప్రతి ఎంపీడీవో కి 1500 యూనిట్లను లక్ష్యంగా ఇచ్చామన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా అధికారులు పనిచేయాలని సూచించారు. వాహనాలకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రజలలో అవగాహన కల్పించడం ద్వారా ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోగలమన్నారు. రీ సర్వే ప్రక్రియ క్షేత్రస్థాయిలో వేగంగా జరిగేలా ఆర్డీవోలు, తహసిల్దార్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గృహ నిర్మాణ లక్ష్యాలు వేగంగా పూర్తయ్యేందుకు పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో జాప్యం ఉండరాదన్నారు.ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు తహసిల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు జాతీయ యోగా దినోత్సవం

బాపట్ల,మే19,ప్రభాతవార్త: ప్రజలంతా మానసిక ఒత్తిడి నుంచి విముక్తి పొందడానికి కేంద్ర ప్రభుత్వం యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు.జాతీయ యోగా దినోత్సవం, ప్రభుత్వ పథకాలు, ప్రభుత్వ సేవలకు ప్రజా స్పందన తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాజధాని అమరావతి నుంచి రాష్ట్ర ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీక్షణ సమావేశం సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా మానసిక ఒత్తిడి నుంచి విముక్తి పొందడానికి కేంద్ర



ప్రభుత్వం యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తుందన్నారు. అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. రేషన్ బియ్యం, గ్యాస్ సిలిండర్లు, బస్సు సర్వీసులు, పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, పంచాయతీ సేవలు, చెత్త సేకరణ, తదితర అంశాల గురించి ప్రజల అభిప్రాయాలపై జిల్లాల వారీగా ఆయన సమీక్షించారు. ఈ సమావేశానికి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి హాజరయ్యారు. అనంతరం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.యోగా దినోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించాలని, ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. సచివాలయాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందుకోసం సుశిక్షితులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వాలన్నారు. యోగ కార్యక్రమానికి హాజరైన వారంతా యాప్ లో తమ పేర్లు నమోదు చేసుకోగానే ప్రభుత్వం నుంచి ధ్రువీకరణ పత్రాలు ప్రజలకు అందుతాయన్నారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకునే ప్రక్రియపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. యోగా కార్యక్రమాన్ని బాపట్ల జిల్లాలో జయప్రదంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. మండల స్థాయిలో కార్యక్రమాల నిర్వహణకు ప్రజా ప్రతినిధులను సైతం ఈ కార్యక్రమాలలో భాగస్వాములను చేయాలని ఆయన సూచించారు. యోగా దినోత్సవం సందర్భంగా నెలరోజులపాటు ఈ కార్యక్రమాలను అన్ని ప్రాంతాలలో నిర్వహించాలన్నారు. యోగా ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు పోటీ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విజేతలకు బహుమతులిచ్చి కార్యక్రమాన్ని మరింతగా ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాటు సారా తయారీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

బాపట్ల,మే19,ప్రభాతవార్త: నాటు సారా తయారీ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అధికారులకు తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో లైన్ డిపార్ట్మెంట్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్లను నాటు సారా రహిత జిల్లాగా తయారు చేయడానికి లైన్ డిపార్ట్మెంట్ అధికారులందరూ కృషి చేయాలన్నారు.నాటు సారా నిర్మూలనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 అనే కార్యక్రమాన్ని తలపెట్టిందని ఆయన అన్నారు. జిల్లాలో నాటు సారా నిర్మూలన పై పొబిషన్ మరియు ఎక్సైజ్ అధికారులను ఆయన ఆరా తీశారు. నవోదయం 2.0 అమలుపై వారు తీసుకున్న చర్యలను జిల్లా కలెక్టర్ కు ఎక్సైజ్ శాఖ అధికారులు వివరించారు. జిల్లాలో బాపట్ల,చీరాల, స్టువర్టుపురం లో ఎరుకుల కులం చెందిన వారు ఎక్కువగా ఉన్నందున, అక్కడకు తనిఖీలకు వెళ్ళిన సమయంలో వారు ఎస్. టి యాక్ట్ ద్వారా కేసులు పెడతామని బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని వారు జిల్లా కలెక్టర్ వివరించారు. నాటు సారా నిర్మూలన పై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అన్నారు.నాటు సారా తయారీ, అమ్మకాలు, రవాణా




విషయంలో మూడు విభాగాలకు సంబంధించి 16 గ్రామాలు సమస్యాత్మకంగా ఉన్నాయని ఎక్సైజ్ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. రాబోవు 15 రోజులలో జిల్లాలో నాటు సారా తయారు చేసే సమస్యత్మకమైనటువంటి 16 గ్రామాలలో విఆర్ఓ, పంచాయతీ సెక్రెటరీ,పోలీస్ సిబ్బందితో దాడులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అన్నారు.ప్రజలకు నాటు సారా తయారీ ద్వారా కలిగే నష్టాలను, పెనాల్టీలను వివరించి వారిలో భయం కలిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లాలో పోలీస్, ఎక్సైజ్ శాఖ, అటవీ శాఖ అధికారులు సమన్వయముతో పనిచేసి నాటుసారా నిర్మూలనకు కృషి చేయాలని ఆయన అన్నారు. నాటు సారా తయారీ మానుకున్నట్లయితే వారికి జీవనోపాధులు మెరుగుపరచడానికి బ్యాంకు రుణాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా మత్తు టాబ్లెట్లు, చాక్లెట్లు, లిక్విడ్ గంజాయి కనపడడానికి వీలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ విషయంలో ఏ స్థాయి అధికారి అయినా జోక్యం ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరైనా బెదిరింపు చర్యలకు పాల్పడితే వారిపై పిడి యాక్ట్ కు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. డి అడిక్షన్ సెంటర్లను తనిఖీ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మరియు వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ విషయంలో రెడ్ క్రాస్ వారి సహాయ సహకారాలు అందించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు, పిడి డి ఆర్ డి ఎ శ్రీనివాసరావు , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియ, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ నారాయణ బట్టు,ఎక్సైజ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

20-5Pg5.qxd:20-5Pg5.qxd 01/01/01 6:37 AM Page 1





# స్వర్ణాలయంపై కన్నేసిన పాకిస్థాన్

## దాయాది వ్యూహాన్ని తిప్పికొట్టిన భారత్ ఆర్మీ

**న్యూఢిల్లీ, మే 19:** ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా ఇటీవల పాక్ జరిపిన క్షిపణి, వైమానిక దాడులను భారత సాయుధ దళాలు సమర్థంగా తిప్పికొట్టాయి. ధైర్యసాహసాలు, పరాక్రమంతో శత్రుదేశ దాడులను అడ్డుకున్నాయి. పాక్ క్షిపణులు, డ్రోన్లను మన ఎల్70, ఆకాశ్ తదితర గగనతల రక్షణ వ్యవస్థలు అద్భుతరీతిలో నేలమట్టం చేశాయి. సరిహద్దు రాష్ట్రాల్లోని అనేక నగరాలకు హాని జరగకుండా భారత సైన్యం కాపాడింది. అయితే ఆపరేషన్ సిందూర్ తర్వాత అక్కసుతో అమృత్ సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని పాక్ లక్ష్యంగా చేసుకుంది. ఈ దాడులను ఎలా అడ్డుకున్నామో 15 పదాతిదళ విభాగం జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ కార్తిక్ సి శేషాద్రి వెల్లడించారు. ఇంటెలిజెన్స్ నుంచి అందిన సమాచారం ప్రకారం గోల్డెన్ టెంపుల్ వంటి మతపరమైన ప్రదేశాలతో సహా భారత పౌర, సైనిక స్థావరాలను పాక్ లక్ష్యం చేసుకుంటుందని భారత సైన్యం ఊ హించింది. పాక్ సైన్యానికి ఎటువంటి చట్టబద్ధమైన లక్ష్యాలు లేవని తెలుసు. గోల్డెన్ టెంపుల్‌ను లక్ష్యంగా చేసుకొనే అవకాశాలు కనిపించాయి.

ముందుగానే ఊహిం చడంతో స్వర్ణ దేవాలయానికి అదనపు రక్షణ కల్పించాం. మే8న తెల్లవారుజామున గోల్డెన్ టెంపుల్ లక్ష్యంగా పాక్ డ్రోన్లు, దీర్ఘ శ్రేణి క్షిపణులను ప్రయోగించింది. ముందే సిద్ధమై ఉన్న ఇండియన్ ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ గన్నర్స్ పాకిస్థాన్ సైన్యం ప్రణాళికలను తిప్పికొట్టింది. స్వర్ణ దేవాలయంపై ఒక్క గీత కూడా పడకుండా అన్ని డ్రోన్లు, క్షిపణులను కూల్చివేశారని మేజర్ జనరల్ కార్తిక్ సి శేషాద్రి వెల్లడించారు. పహల్గాంలో అమాయక భారత, విదేశీ పర్యటకులే లక్ష్యంగా జరిపిన ఉగ్రదాడి ఫలితంగానే ఇండియా ఆపరేషన్ సిందూర్ చేపట్టిందని కార్తిక్ తెలిపారు. ఇందులో భాగంగా పాక్, పీవోకేలోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై భారత్ మెరుపు దాడులు చేసిందని వివరించారు. తొమ్మిది స్థావరాలలో, ఏడింటిని భారత సైన్యం ప్రత్యేకంగా నాశనం చేసిందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సాయుధ దళాలు సంపూర్ణ ఖచ్చితత్వంతో అనేక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకున్నాయని పేర్కొన్నారు. ఉగ్రవాద సంస్థల ప్రధాన కార్యాలయాలు ఉన్న మురిద్కే, బహవల్పూర్ వంటి ప్రాంతాలపై దాడి చేశాయని అన్నారు. భారత సైన్యం పాకిస్థాన్ సైనిక, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోలేదని వెల్లడించారు. ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదు కొనసాగుతోంది. పాక్ కవ్వింపులకు పాల్పడితే గట్టి ప్రతిస్పందన తప్పదు. పాక్ సైన్యం లోపాలు, ఎదుర్కొన్న ఒత్తిడి గురించి తెలుసు. పాక్ సైన్యం ఏవైనా దాడులకు యత్నిస్తే వినాశకరమైన ప్రతిస్పందనను ఇస్తాం. అవసరమైతే పాకిస్థాన్‌ను పూర్తిగా నాశనం చేస్తామని కార్తిక్ తెలిపారు. మరోవైపు, పాకిస్థాన్ దాడుల నుంచి తమ ప్రాణాలు కాపాడినందుకు అమృత్ సర్ ప్రజలు ఇండియన్ ఆర్మీకి కృతజ్ఞతలు తెలిపారు. భారత సాయుధ దళాలతో భుజం భుజం కలిపి నిలబడతామని పేర్కొన్నారు.

గోల్డెన్ టెంపుల్ సహా సరిహద్దు ప్రాంతాలలోని మతపరమైన ప్రదేశాలను రక్షించడానికి సైన్యం అన్ని ప్రయత్నాలను చేసిందని కొనియాడారు. సాయుధ దళాలకు ప్రజలు తమ సామర్థ్యాల మేరకు సహాయం చేయ డానికి ప్రయత్నిస్తున్నారని స్థానికులు తెలిపారు. ఇండియన్ ఆర్మీ స్వర్ణ దేవాలయం, నగరంలోని కొన్ని ప్రాంతాలను రక్షించిందన్నారు.



## ఆపరేషన్ సిందూర్‌లో ఎన్ని విమానాలు నష్టపోయాం?

### వివరాలివ్వాలని డిమాండ్ చేసిన రాహుల్

**న్యూఢిల్లీ, మే 19:** ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత వైమానిక దళం ఎన్ని విమానాలను కోల్పోయిందో చెప్పాలని ఎఐసిసి నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. జైశంకర్ ఈ విషయంపై మౌనంగా ఉన్నారని ఆరోపిస్తూ పలు ప్రశ్నలు సంధించారు. విదేశాంగ మంత్రి జైశంకర్ వహించడం కేవలం సమాచారాన్ని వెల్లడించకపోవడం మాత్రమే కాదు. అదొక విపత్కర పరిణామం. మరోసారి అడుగుతున్నాను. పాకిస్థాన్ పై దాడుల గురించి ఆ దేశానికి ముందే తెలియడం వల్ల ఎన్ని భారతీయ విమానాలను కోల్పోయాం? ఇది తప్పిదం కాదు. నేరం. దేశానికి నిజం తెలియాలని రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. దీనికి జైశంకర్ గతంలో మాట్లాడిన వీడియోను జోడించారు. మరోవైపు, రాహుల్ గాంధీ వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎంపీ మాణకం ఠాగూర్ సమర్థించారు. 2025 మే 17న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఒక నిర్దిష్టమైన ప్రశ్నను అడిగారు. పాక్ కు భారత్ చేసే దాడుల గురించి ముందుగానే తెలుసు కాబట్టి మనం ఎన్ని భారతీయ విమానాలను కోల్పోయాం, ఏ పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోనైనా ప్రతిపక్షాలు జాతీయ భద్రత విషయాలను లేవనెత్తినప్పుడు మంత్రులు స్పందించాల్సిన బాధ్యత ఉంటుంది. అయినప్పటికీ విదేశాంగ మంత్రి జైశంకర్ మౌనంగా ఉన్నారు. ఈ నిశ్శబ్దం తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. పాక్ కు ఆపరేషన్ సిందూర్ గురించి ముందుగానే ఎందుకు సమాచారం ఇచ్చారు. ఈ కార్యాచరణ గోప్యత ఉల్లంఘనకు ఎవరు అధికారం ఇచ్చారు దీని కారణంగా మన సాయుధ దళాలు ఎలాంటి పరిణామాలను ఎదుర్కొన్నాయి ఇది దౌత్యపరమైన విషయం కాదు. శత్రువుకు ముందస్తు సమాచారం ఇవ్వడం నేరం. దేశానికి నిజం తెలియాలని మాణికం ఠాకూర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పాక్ ఉగ్రవాద వ్యవస్థలపై గురిపెట్టిన విషయాన్ని ఆపరేషన్ సిందూర్ మొదలుపెట్టడానికి ముందే కేంద్ర సర్కారు ఆ దేశానికి చెప్పి తప్పు చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శనివారం విమర్శించారు. ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేయడానికి ముందు పాక్ కు సమాచారం ఇచ్చినట్లు జైశంకర్ చెప్పినట్లు వీడియోలో ఉంది. ఆపరేషన్ ప్రారంభంలో తాము పాక్ కు ఒక సందేశాన్ని పంపించాం. పాక్ ఉగ్రవాద స్థావరాలపై దాడి చేస్తున్నామని, పాక్ సైనిక స్థావరాలపై కాదని చెప్పాం. ఈ దాడుల్లో జోక్యం చేసుకోకుండా పాక్ ఆర్మీ బయట నిలబడే అవకాశం ఉంది. ఆ మంచి సలహాను పాక్ పట్టించుకోలేదని జైశంకర్ వ్యాఖ్యానించారు. అయితే రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై భారత విదేశాంగ శాఖ ఇప్పటికే క్లారిటీ ఇచ్చింది. ఈ వ్యాఖ్యలు వాస్తవాలను పూర్తిగా తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని ఖండించింది. ఆపరేషన్ సిందూర్ మొదలైన తొలి దశలో చేసిన హెచ్చరికను, ఆపరేషన్‌కు ముందు చేసినట్లు ఆరోపించడం తప్పుడు వ్యాఖ్యగా పేర్కొంది.



## జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలి

### అత్యవసర విచారణకు సుప్రీం అనుమతి

**న్యూఢిల్లీ, మే 19:** జడ్జి ఇంట్లో నోట్ల కట్టల కేసుకు సంబంధించి అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని దాఖలయిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. అంతే కాకుండా ఈ పిటిషన్ అత్యవసర విచారణకు కూడా అనుమతించింది. పిటిషనర్ న్యాయవాది మాథ్యూస్ జె నెడుంపార తన పిటిషన్‌ను ఇద్దరుసభ్యుల బెంచ్‌పై దాఖలు చేసారు. అత్యవసర విచారణ చేయాలని అన్నారు. చీఫ్‌జస్టిస్ బిఆర్‌గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసిహ్‌ల ఆధ్వర్యంలోని బెంచ్ నెడుంపార విజ్ఞప్తులను పరిగణనలోనికి తీసుకుంది. లోపాలను సవరిస్తే అత్యవసర విచారణ జరుగుతుందని సిజెఐ తెలిపారు. గతంలో 14వ తేదీ సుప్రీంకోర్టు అత్యవసర విచారణకు అనుమతించలేదు. ఈనెల 8వ తేదీ సుప్రీంకోర్టు నియమించిన హౌస్‌కమిటీ తక్షణమే ఆయన్ను పదవినుంచి తొలగించాలని సిఫారసు చేసింది. రిటైర్డ్ చీఫ్ జస్టిస్ సంజీవ్‌ఖన్నా ఈమేరకు కేంద్రానికి ఆయన్ను పదవీచ్యుతిచేయాలని సిఫారసు కూడా చేసారు. అయితే జస్టిస్ వర్మ తాను వైదొలిగేందుకు నిరాకరించారు. జస్టిస్ వర్మను రాజీనామా చేయాలని కోరారని, ఆయన అంగీకరించకపోవడంతో ఆయన్ను పదవినుంచి తొలగించాలని సిఫారసులు చేసారని, అయితే ఆయన తిరస్కరించినట్లు తెలిపారు. త్రిసభ్య కమిటీ ఇచ్చిన నివేదికను మాజీ సీజెఐ ఖన్నా రాష్ట్రపతి, ప్రధానమంత్రులకు పంపిస్తూ తాను కూడా స్వయంగా ఆయన్ను తొలగించాలని సిఫారసులుచేసారు. త్రిసభ్య కమిటీ తన నివేదికను ఈనెల 4వ తేదీనే అందచేసింది. దీనితో చీఫ్‌జస్టిస్ వర్మను రాజీనామాచేయాలని కోరారు. ఆయన నిరాకరించడంతో పదవినుంచి తొలగించాలని సిఫారసులుచేసారు. కమిటీ తమ విచారణలో మొత్తం 45 మంది నుంచి వివరాలను సేకరించింది. వీరిలో ఢిల్లీ పోలీస్ కమిషనర్ సంజయ్ అరోరా, ఢిల్లీ ఫైర్‌సర్వీస్ చీఫ్‌ల వాంగ్మూలాలు కూడా ఉన్నాయి. అలాగే కమిటీ సభ్యుల ముందు జస్టిస్ వర్మ తన స్పందన తెలియజేయడానికి నిరాకరించారు. 40 రోజుల తర్వాత కమిటీ తన నివేదికను ఇచ్చింది. గత మార్చి 25న సుప్రీంకోర్టు విచారణకమిటీ నియమించింది. జస్టిస్ షీల్‌నాగు, జస్టిస్ జీఎస్ సంధావాలియా, జస్టిస్ అనుశివ రామ్ లతోకూడిన కమిటీని నియమించారు. జస్టిస్ వర్మ తన వాదనగా తాను స్టోర్‌రూమ్‌లో నగదు భద్రంచేయలేదని, తాను కాని తన కుటుంబసభ్యులు కానీ ఎవ్వరూ ఇలా చేయలేదని అన్నారు. అలాగే పట్టుబడిన సొమ్ములు తమవి కావన్నారు. తామే ఇక్కడ పెట్టాని చెప్పడం ముందస్తు వ్యూహంగా ఉందని చెప్పారు. తాను నివసించే ప్రాంతానికి ఈ స్టోర్ రూమ్ దూరంగా ఉంటుందని, మధ్యలో ప్రహరీగోడ కూడా వేరుచేసి ఉంటుందని, తనను ఇరికించేందుకే మీడియా కూడా సొంత విచారణచేసిందని ఆరోపణలు చేసారు.



## మీ క్షమాపణ నటించినట్లుగా ఉంది

### మధ్యప్రదేశ్ ఎంపికి సుప్రీంకోర్టు చీవాట్లు

**న్యూఢిల్లీ, మే 19:** కర్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్ షా చేసిన వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మంత్రి క్షమాపణలను అంగీకరించలేమని చెప్పింది. ప్రజాప్రతినిధిగా ఉన్నప్పుడు ఆచితూచి మాట్లాడాలని బాధ్యతగా ఉండాలని తెలిపింది. కొన్నిసార్లు న్యాయ విచారణను తప్పించుకునేందుకు కొందరు మర్యాదపూర్వకంగా మాట్లాడినట్లు నటిస్తారని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. మరికొన్నిసార్లు మొసలి కన్నీరు కారుస్తారని చెప్పింది. ఇందులో కున్వర్ విజయ్ షా క్షమాపణ ఎలాంటిదని న్యాయస్థానం ప్రశ్నించింది. క్షమాపణలు ఎక్కడ, ఎలా చెప్పారు. క్షమాపణ చెబుతున్నప్పుడు అందులో కొంత అర్థం ఉండాలి. కొన్నిసార్లు న్యాయ విచారణను తప్పించుకునేందుకు కొందరు వ్యక్తులు మర్యాదపూర్వకంగా మాట్లాడినట్లు నటిస్తారు. మరికొన్ని సందర్భాల్లో మొసలి కన్నీరు కారుస్తారు. ఇందులో మీ క్షమాపణ ఎలాంటిది. ఏదో న్యాయస్థానం అడిగింది కాబట్టి చెబుతున్నా అన్నట్లుగా ఉంది మీ వ్యవహారం. మనస్ఫూర్తిగా క్షమాపణలు చెప్పడానికి మీకున్న అభ్యంతరం ఏమిటీ అని ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది. దేశం మొత్తం సిగ్గుపడుతోంది మీరు ఒక ప్రజాప్రతినిధిగా ఉన్నారు. అలాంటప్పుడు బాధ్యతగా ఉండాలి. ప్రతి పదాన్ని ఆచితూచి మట్లాడాలి. మీరు చేసిన వ్యాఖ్యల కారణంగా దేశం మొత్తం సిగ్గుపడింది. మేము మీ వీడియోలను చూశాం. మీరు చాలా అసభ్యకరమైన భాషను ఉపయోగించారు. మొత్తం దేశం మన సైన్యం పట్ల గర్వంగా ఉదని తీవ్ర స్థాయిలో స్పందించింది. మంత్రి వ్యాఖ్యలపై విచారణకు మధ్యప్రదేశ్‌కు చెందని ఐపీఎస్‌లతో మంగళవారం ఉదయం 10గంటల లోపు సిట్ ఏర్పాటు చేయాలని ఆ రాష్ట్ర డీజీపీని సుప్రీంకోర్టు ఆదేశించింది. ముగ్గురు సీనియర్ ఐపీఎస్ లతో దీన్ని ఏర్పాటు చేయాలని అందులో ఒక మహిళ ఉండాలని పేర్కొంది. ఈ నెల 28 లోగా నివేదిక అందజేయాలని సిట్ ను ఆదేశించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి మీడియాకు వివరాలను వెల్లడించిన కర్నల్ ఖరేషీని ఉద్దేశిస్తూ ఆమెను ఉగ్రవాదుల సోదరి అని విజయ్ షా వ్యాఖ్యానించారు. దీనిపై తీవ్ర దుమారం చెలరేగింది. దీంతో ఈ వ్యవహారాన్ని సుమోటోగా తీసుకున్న మధ్యప్రదేశ్ హైకోర్టు ఆయనపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ ఆ మంత్రి సుప్రీంకోర్టును ఆశ్రయించగా తాజాగా విచారణ సందర్భంగా ఆక్షేపించింది. ప్రస్తుతానికి అరెస్టు నుంచి మినహాయింపు కల్పించిన కోర్టు విచారణకు సహకరించాలని మంత్రిని ఆదేశించింది.



## ఉక్రెయిన్ చర్చలకు వెళ్లేముందు పోప్ లియోను కలిసిన అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్

**వాటికన్‌సిటీ, మే 19:** ఉక్రెయిన్‌పై రష్యా కాల్పుల విరమణ చర్చలకు గాను వెళుతున్న అమెరికా ఉపాధ్యక్షుడు జెడివాన్స్ రోమన్‌కాథలిక్ కొత్త మతపెద్ద పోప్ లియో15ను కలుసుకున్నారు. జెడివాన్స్ మోటార్ కాన్వాయ్ వాటికన్ నగరంలోకి ఉదయం ఏడున్నర గంటలకే చేరుకుంది. వాన్స్ కూడా రోమన్ కేథలిక్‌కావడం మొదటి అమెరికా కాథలిక్ మతగురువు పోప్‌గా రావడంతో వీరిద్దరి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఆయనతోపాటే వాటికన్ సిటీకి విదేశాంగమంత్రి మార్కో రుబియో, వాన్స్ అధికారప్రతినిది లూక్ ష్రోడర్‌లు కూడా వాటికన్‌సిటీలో పోప్‌ను కలిసారు. సోమవారం పోప్ లియో తన ప్రారంభ ప్రార్థనలకుగాను మర్యాదపూర్వకంగా కలిసేందుకు వచ్చినట్లు తెలిపారు. తన పాత డైకోసీ పెరులోని చిక్లాయోనుంచి కూడా కొందరు క్రైస్తవ నాయకులు వాటికన్‌సిటీకి వచ్చారు. రష్యా యుద్ధంలో పక్కకుపోయింది. మానవతా ధృక్పథంతో సాయి, ఖైదీల మార్పిడి, రష్యాఅదుపులో ఉన్న ఉక్రెయిన్ చిన్నారులను అప్పగించడం వంటి అంశాలను ప్రస్తావించిన పోప్ ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపివేయాలని కోరుతూ వచ్చారు. జెడివాన్స్ సమక్షంలోకూడా ఇవే అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. శాంతిచర్చలు జరగాలని వాటికన్‌సిటీ ముందనుంచి కోరుకుంటున్నదని పోప్ లియో ఈసందర్భంగా పేర్కొన్నారు. ఆదివారం ప్రార్థనలు ముగిసిన తర్వాత పోప్ లియోతో కొద్దిసేపు గడిపిన తర్వాత వాన్స్ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, యూరోపియన్ కమిషనక్ అధ్యక్షురాలు ర్సులా వాండర్‌లేయన్ లతో చర్చల్లో పాల్గొన్నారు. మాజీ కార్డినల్ రాబర్ట్ ప్రివోస్ట్ అయిన లియో అమెరికాలోని చికాగోలో జన్మించారు. అత్యధిక కాలం పెరూలోని చిక్లాయోలోనే మతపెద్దగా గడిపారు. పోప్‌గా బాధ్యతలుచేపట్టిన మొదటిరోజునుంచి కూడా ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుక కృషి చేస్తామన్నారు. వాన్స్ చర్చల తర్వాతనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, నాటో నాయకులతో ఫోన్‌లోనే చర్చలు జరుపుతారని అమెరికా ప్రతినిధి బృందం తెలిపింది.

## నాథూలా పాస్ మీదుగా మానససరోవర్ యాత్ర

### మొదటి బ్యాచ్‌జూన్ 15న ప్రారంభం




**గ్యాంగ్‌టక్, మే 19:** కైలాస్ మానస్ సరోవర్ యాత్రను నాథూలా పాస్ మీదుగా ప్రారంభించేందుకు కేంద్రం నిర్ణయించింది. టిబెట్ స్వయం ప్రతిపత్తిప్రాంతంలో ఉన్న కైలాసపర్వత యాత్ర, మానససరోవర్ యాత్రలకు ఈసారి నాథూలా పాస్‌నే ఎంపికచేసారు. సిక్కింకు రాష్ట్రహోదా లభించి 50 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా కేంద్రం ఈనిర్ణయం తీసుకుంది. ప్రదాని నరేంద్రమోడీసైతం సిక్కిం రాష్ట్రహోదా వేడుకలను భారీ ఎత్తున నిర్వహించాలని నిర్ణయిస్తున్న నేపథ్యంలో నాథూలాపాస్‌మీదుగా ఈసారి కైలాస్ మానస్‌సరోవర్ యాత్రను చేపట్టాలని నిర్ణయించారు. విదేశాంగశాఖ వివరాలప్రకారం జూన్‌నుంచి సెప్టెంబరు వరకూ ప్రతి ఏటా రెండు విభిన్న రూట్లలో జరిగే యాత్ర ఈసారి నాథూలా మీదుగా భారీ ఎత్తున నిర్వహించాలని చూస్తున్నారు. ఉత్తరాఖండ్‌లోని లిపూలేఖ్, సిక్కింలోని నాథూలా ప్రాంతాలు మాత్రమే మానస్‌సరోవర్ యాత్రకు అనుకూలంగా ఉంటాయి. వేలాదిమంది హిందూ భక్తులు, జైనులు, బౌద్ధులు ఈ యాత్రకు వస్తుంటారు. మొత్తం ఈ యాత్రకోసం సుమారు పది బ్యాచ్‌ల వరకూ బయలుదేరతాయి. నాథూలాపాస్ మీదుగా జరిగే యాత్ర 21 రోజులుపాటు జరుగుతుంది. ఒక్కొక్క వ్యక్తికి రూ.2.83 లక్షలు వ్యయం అవుతుంది. వచ్చే జూన్ 15న మొదటి బ్యాచ్ ఢిల్లీనుంచి బయలుదేరుతుంది. నాథూలా సరిహద్దు మీదుగా జూన్ 20వ తేదీకి చేరుతుంది. చివరి బ్యాచ్ ఆగస్టు ఏడో తేదీ బయలుదేరి సరిహద్దుకు 12వ తేదీ చేరుతుంది. సిక్కిం రాజధాని గ్యాంగ్‌టక్‌నుంచి నాథూలా పాస్ పరిసరాలవరకూ సిక్కిం ప్రభుత్వం ఈ యాత్రకు విస్తృత ఏర్పాట్లుచేసింది. నాథూలా పాస్ కాబిలంగ్‌చోక్ నియోజకవర్గం ఎంపి భూటియా పరిధిలోకి వస్తుంది. గ్యాంగ్‌టక్ నాథూలా మధ్య ప్రయాణానికి కూడా ఏర్పాట్లు భారీగాచేసారు. రెస్ట్‌హౌస్‌లు, మరుగుదొడ్లను కూడా నిర్మించారు. ఈ యాత్రను భారత యాత్రీకులకోసం ప్రారంభించారు. భారత పాస్‌పోర్టులు ఉన్న వారు ఈ యాత్రకు అర్హులు. ప్రభుత్వపరంగా ఎలాంటి సబ్సిడీ, ఆర్థికసాయం వంటివి ఉండవు. కోవిడ్ 19 కారణంగా 2020లో ఈ యాత్రను సస్పెండ్‌చేసారు. అలాగే చైనా, భారత్‌లవైపులడక్‌ప్రాంతంలో నిలిచిన మిలిటరీ ప్రతిష్టంభన కారణంగా కూడా మానస్‌సరోవర్ యాత్రనునిలిపివేసారు. ఈ ఏడాది మళ్లీ పునరుద్ధరిస్తున్నారు.

## జన్‌సురాజ్ జాతీయ అధ్యక్షుడుగా ఉదయ్‌సింగ్



**పాట్నా, మే 19:** జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకులు ప్రశాంత్‌కిశోర్ మాజీ బిజెపి ఎంపి ఉదయ్ సింగ్‌ను తమ పార్టీకి మొదటి జాతీయ అధ్యక్షుడుగా ఎంపిక చేసారు. ఆయన పేరును పార్టీ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఇపుడు ఇక ప్రజల్లోకి వెళ్లడంపైనే ప్రాధాన్యతనిస్తామని, సంస్థాగత బాధ్యతలన్నీ ఉదయ్‌సింగ్, ఆరిసిపి సింగ్‌లు పర్యవేక్షిస్తారని ఆయన అన్నారు. బీహార్‌నుంచి తన పాదయాత్రను పునరుద్ధరిస్తానని ఆయన అన్నారు. ఉదయ్‌సింగ్ పార్టీకి రవాణా వసతులు కూడా పర్యవేక్షిస్తారని, ఇందుకోసం ఏర్పాటు చేసిన కమిటీ కూడా ఆయనకు బాధ్యతలు అప్పగించడంపై ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. గత ఏడాది అక్టోబరు రెండో తేదీ ప్రారంభించిన జన్‌సురాజ్‌పార్టీ పూర్తిస్థాయి అధ్యక్షుడు లేకుండానే కొనసాగుతోంది. ప్రశాంత్‌కిశోర్ మొదటినుంచి కూడా ఎలాంటి పార్టీ పదవులు తనవద్ద ఉంచుకోనని, తాను చేపట్టనని కూడా చెప్పారు. మాజీ ఐపిఎస్ అధికారి మనోజ్ భర్తీని పార్టీకి వర్కింగ్‌ప్రెసిడెంట్‌గా నియమించారు. అప్పటినుంచి కూడా పార్టీ కార్యకలాపాలు చూస్తున్నా ప్రశాంత్‌కిశోర్ మాత్రం ప్రజల్లోకి మరింతగా ఎలా చొచ్చుకుపోవాలన్న అంశంపైనే ఫోకస్ పెంచారు.

## బెంగళూరును ముంచెత్తిన భారీ వర్షాలు!



**బెంగళూరు, మే 19:** బెంగళూరులో గత మూడు రోజులు వర్షాలు దంచికొడుతన్నాయి. సోమవారం కురిసిన భారీ వర్షం కారణంగా నగరంలో గోడ కూలి 35 ఏళ్ల మహిళ మృతి చెందింది. అలాగే ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలువురి ఇళ్లు, కార్యాలయాల్లోకి వరదనీరు చేరింది. పలు చోట్ల రోడ్లన్నీ జలమయం అవ్వడంతో జనజీవనం స్తంభించిపోయింది. ఒక పక్క డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. శనివారం జరగాల్సిన ఐపీఎల్ మ్యాచ్ కూడా రద్దయిపోయింది. శాంతినగర్‌లోని సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ సీసీబీ కార్యాలయం వర్షపు నీటిలో మునిగిపోయింది. పలు కీలక పత్రాలు నీటిలో తడిసిముద్దాయ్యాయి. భద్రతా కారణాల దృష్ట్యా సీసీబీని చామరాజ్‌పేట్ నుంచి శాంతినగర్‌కు మార్చారు. కార్యాలయంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో మోకాలిలోతు నీరు చేరింది. బెంగళూరులో ఇప్పటివరకు అత్యంత వర్షపాతం నమోదైన ప్రాంతాల్లో హోరామావులోని సాయి లేఅవుట్ ఒకటి. శనివారం కురిసిన వర్షానికి లేఅవుట్‌లో 4 నుంచి 5 అడుగుల నీటిలో మునిగిపోయింది, దీని వల్ల వీధుల్లో మోకాళ్ల లోతు నీరు చేరిందని అధికారులు తెలిపారు. హోరామావు, కావేరీ నగర్, సంపంగి రాంనగర్ సహా అనేక లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. నీటిని తొలగించడంలో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. మూసుకుపోయిన డ్రైనేజీలను బాగుచేయాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు వాటిని శుభ్రం చేయలేదని నగరవాసులు పేర్కొన్నారు. బెంగళూరులో గత 24 గంటల్లో నగరంలో దాదాపు 104 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ గణాంకాలు చెబుతున్నాయి. భారీ వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపవడం వల్లే తీవ్ర నష్టం జరిగినట్లు ప్రతిపక్ష బీజేపీ ఆరోపించింది. బీజేపీ చేసిన విమర్శలపై డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. వర్షాల సమయంలో బెంగళూరులో ఈఇబ్బందులు కొత్తేమీ కాదని చెప్పారు. తమ ప్రభుత్వం దీర్ఘకాలిక పరిష్కారానికి కృషి చేస్తోందని చెప్పారు. బీజేపీ అధికార ప్రతినిధి అశ్వత్ నారాయణ్ గౌడ మాట్లాడుతూ, వారంక్రితం భారీ వర్షపాతం ఉంటుందని ఐఎండీ హెచ్చరించినా, ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదన్నారు. వర్షబీభత్సానికి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బాధ్యత తీసుకోవాలని విమర్శించారు.

## ఆరు దశాబ్దాల తర్వాత ఇజ్రాయెల్‌కు 'గూఢచారి' వస్తువులు



**టెల్అవీవ్, మే 19:** ఇజ్రాయెల్‌కు చెందిన గూఢచారి ఎలి కోహెన్‌కు సంబంధించిన వేలాది వస్తువులను 60 యేళ్ల తర్వాత సిరియా నుంచి టెల్అవీవ్ సొంతం చేసుకొంది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్వయంగా వెల్లడించారు. ఆయన భార్య నాడియో కోహెన్‌తో నెతన్యాహు వాటిని పంచుకున్నారు.'ఎలి కోహెన్‌ను ఉరి తీసిన 60 యేళ్ల తర్వాత నేను నాడియా కోహెన్‌ను కలిశాను. కోహెన్ వస్తువులను తీసుకొచ్చేందుకు మొస్సాద్ ఒక ప్రత్యేకమైన ఆపరేషన్ నిర్వహించింది. దాదాపు 2,500 వస్తువులను తిరిగి తీసుకొచ్చాం. అందులో కోహెన్‌కు సంబంధించిన వ్యక్తిగత వస్తువులు, ఆయన స్వయంగా రాసిన లేఖలు ఉన్నాయి. కోహెన్ ఒక హీరో. ఒక గొప్ప గూఢచారి. మా బందీలను తీసుకొచ్చేందుకు మేము అవిశ్రాంతంగా శ్రమిస్తాం' అని నెతన్యాహు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కోహెన్ మృతదేహాన్ని తిరిగి తీసు కురా వాలని నాడియా నెతన్యాహును కోరారు.

**ఎవరీ ఎలి కోహెన్..** ఎలి కోహెన్ ఇజ్రాయెల్‌కు చెందిన గూఢచారి. 1960లో సిరియాలోని రాజకీయ, సైనిక వ్యవహారాల్లో ఎలి కోహెన్ సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకున్నాడు. ఆ తర్వాత సిరియా రక్షణమంత్రికి అగ్ర సలహాదారుడిగా ఎదిగాడు. 1965లో ఇజ్రాయెల్‌కు రేడియో ద్వారా సమాచారం పంపుతూ సిరియన్ నిఘా సంస్థలకు పట్టుబడ్డాడు. కొన్ని రోజు విచారణ తర్వాత అదే యేడాది మే 18న డమాస్కస్‌లో అతడిని ఉరితీశారు. అతడి మృతదేహాన్ని ఇప్పటివరకు ఇజ్రాయెల్‌కు అప్పగించలేదు. అయితే, కోహెన్‌ను టెల్అవీవ్‌లో హీరోగా పరిగణిస్తారు. కోహెన్ పట్టుబడిన తర్వాత సిరియన్ నిఘా సంస్థలు ఆయనకు సంబం ధించిన అనేక వస్తువులను స్వాధీనం చేసుకున్నాయి. అందులో పలు కీలక పత్రాలు, రికార్డింగ్‌లు, ఫొటోలు, వ్యక్తిగత వస్తువులు, ఇజ్రా యెల్‌లోని అతని కుటుంబానికి రాసిన లేఖలు ఉన్నాయి. వీటన్నింటినే తాజాగా టెల్అవీవ్ సొంతం చేసుకుంది.

ఇక, గతవారం నాలుగు దశాబ్దాలుగా కనిపించకుండా పోయిన ఓ సైనికుడి మృతదేహాన్ని సిరియా నుంచి టెల్అవీవ్ స్వాధీనం చేసుకుంది. అతడు 1982లో లెబనాన్-సిరియా దళాల మధ్య జరిగిన ఘర్షణల్లో మరణించినట్లు తెలుస్తోంది.

## సరిహద్దు గ్రామాల్లో ఎటుచూసినా ధ్వంసమైన ఇళ్లే

### సాయం కోసం ఎదురుచూస్తున్న నివాసితులు



**పూంచ్,రాజౌరి, మే 19:** సరిహద్దు జిల్లాలయిన పూంచ్, రాజౌరిల్లో పాకిస్థాన్ సైన్యం జరిపిన కాల్పులకు వేలాది ఇళ్లు ధ్వంసం అయ్యాయి. సరిహద్దుల్లో సుమారు పదివేలకుపైగా ఇళ్లు ధ్వంసం అయ్యాయని కాశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా సైతం అంగీకరించిన సంగతి తెలిసిందే. ప్రజలు వారి అదృష్టం అనుసరించి ఈ కాల్పులనుంచి బయటపడ్డారని, భారత్; పాకిస్తాన్ దళాల దాడుల్లో సరిహద్దుల్లో ఉన్న కుటుంబాలు భయంభయంతో గడిపాయని అక్కడి ప్రజలు చెపుతున్నారు. పూంచ్ మాజీ సెక్రటరీ జనరల్ సూర్జన్‌సింగ్ మాట్లాడుతూ కంఖామొహల్లాలో తమకు ఉన్న ఇంటిలో ఆరోజు నిద్రిస్తున్నామని, ఏడోతేదీ తమ ఇంటి పైకప్పు పైకి ఒక మోర్టార్ వచ్చిపడిందని అన్నారు. దీనితో శ్లాబ్‌మొత్తం ఛిద్రం అయిం దన్నారు. తనతోపాటు సమీపంలో ఉన్న ఇళ్లను కూడా ధ్వంసంచేసాయన్నారు. తన సోదరుడు మాజీ సైనికుడు అమర్‌జీత్‌సింగ్ తన ఇంట్లోని రెండో అంతస్తులో నిలుచుని ఉన్నాడని, పౌరు గింటి వాళ్లకు హెచ్చరికలు చేస్తూ కనిపించాడని, అయితే ఆయనే బుల్లెట్ల బారినపడి చనిపోయాడన్నారు. ఊపిరితిత్తులు, కడుపులో బుల్లెట్లు దిగి తీవ్ర గాయాలయ్యాయన్నారు. ఆసుపత్రికి తరలించిన రెండుగంటల్లోపే చనిపోయినట్లు ఇక్రమ్ అనే మరో నివాసి చెప్పాడు. ఉత్తర కాశ్మీర్‌లోని ఊరినుంచి పూంచ్, రాజౌరి, జమ్ము జిల్లాల్లోనే ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో పాకిస్తాన్ సైన్యం దాడులకు తీవ్ర నష్టంజరిగింది. పూంఛ్‌లోని గురుద్వారా ప్రాంతంలో కూడా బాంబులు పడ్డాయని, గురుద్వారా అద్దాలు, కిటికీలను ధ్వంసంచేసాయని, గురుద్వారా సమీపంలోనే నివసిస్తున్న జగ్‌జీత్‌సింగ్ తన ఇంటి అంతస్తులు రెండింటిని కూడా పాకిస్తాన్ కాల్పుల్లో ధ్వంసం చేసారని, బెడ్‌రూమ్, గ్రౌండ్‌ఫ్లోర్ రెండూ కూడా విచ్ఛిన్నం అయ్యా యన్నారు. రాజౌరి జిల్లాలో అయితే ఏకంగా జిల్లా అదనపు కమిషనర్ రాజ్‌కుమార్ థప్పా కాల్పుల్లో ప్రాణాలు వదిలారు. ఆయన అధికారిక నివాసం రాజౌరి పట్టణంలో ఉంది. పక్కగది లోనే ఉన్న ఆయన ముగ్గురు సహాయకులు, సెక్యూరిటీ గార్డు మాత్రం తప్పించుకోగలిగారు. ఈ ప్రాంతంలోనే అనేక ఇళ్లు పాక్ కాల్పులకు విపరీతంగా దెబ్బతిన్నాయి. ఇదేవిధంగా సరిహద్దు జిల్లాల్లో వాస్తవాధీన రేఖవెంబడి ఉన్న ఇళ్లు పొలాలు కూడా విపరీతంగా దెబ్బతిన్నట్లు జమ్ముకాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్, ముఖ్య మంత్రిలకు నివేదికలందాయి. దెబ్బతిన్న ఇళ్ల పునర్నిర్మాణానికి సాయం చేస్తామని ముఖ్య మంత్రి ప్రకటించినా లెఫ్టినెంట్ గవర్నర్‌నుంచి మాత్రం ఎలాంటి స్పందన రాకపోవడంతో సరిహద్దుగ్రామాల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### సంభాల్‌మసీదు సర్వే నిలిపివేయాలన్న

## పిటిషన్ తిరస్కృతి

### దిగువకోర్టు ఉత్తర్వులను సమర్థించిన అలహాబాద్ హైకోర్టు

**లక్నో, మే 19:** హరిహరమందిరాన్ని కూల్చివేసి ఆస్థలంలో సంభాల్ మసీదు నిర్మించారని పేర్కొంటూ దాఖలయిన పిటిషన్లపై దిగువకోర్టు ఇచ్చిన సర్వే ఉత్తర్వులపై సంభాల్ షాహి మామసీదు కమిటీ పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు తిరస్కరించింది. దిగువకోర్టు సోమవారమే ఉత్తర్వులు జారీచేసింది. అలహాబాద్ హైకోర్టు బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్ దిగువకోర్టు ఉత్తర్వులను సమర్థించారు. మసీదు సర్వేచేయాలనడం సహేతుకమేనని అన్నారు. హిందూ కక్షిదారులు దాఖలు చేసిన పిటిషన్ విచారణ అర్హమైనని అన్నారు. గత ఏడాది నవంబరు 19న సంభాల్ సివిల్‌జడ్జి ఆదిత్య సింగ్ మసీదు సర్వేకు ఆదేశించారు. ఇందుకోసం అడ్వకేట్ కమిషనర్ రమేష్‌సింగ్ రాఘవ్‌ను కూడా నియమించింది. హైకోర్టు తన తీర్పును ఈనెల 13వ తేదీ రిజర్వులో ఉంచింది. అంతకుముందు జనవరి 8వ తేదీ మసీదు సర్వేపై తాత్కాలిక స్టేను మంజూరు చేసింది.

20-5Pg6exHMNWJQE.qxd:20-5Pg6exHMNWJQE.qxd 01/01/01 7:52 AM Page 1





అధికారులతో సమీక్షిస్తున్న ఇఓ

## భక్తుల సౌకర్యాలకు పెద్దపీట: ఇఓ వికె శీనా నాయక్ ఆదేశాలు

**ఇంద్రకీలాద్రి, మే 19, ప్రభాతవార్త** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారిని దర్శించుకోడానికి వచ్చే భక్తుల సౌకర్యానికి పెద్దపీట వేయాలని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థాని ఇఓ వికె శీనా నాయక్ అధికారులను ఆదేశించారు . సోమవారం ఆయన ఆలయాధికారులతో విస్తృతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భక్తుల సంతృప్త స్థాయిపెంపు, గౌరవంగా మెలగడం, సాంకేతికతో భక్తులకు మెరుగైన సేవలం దించడం పై అంశాలవారీగా చర్చించి ఇంకా మెరుగ్గా పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఇఇ కోటేశ్వర రావు, ఎఇఓలు పి చంద్రశేఖర్, ఎన్ రమేష్ బాబు, జె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా 'శయన బుద్ధవిహార్ ప్రాజెక్టు' అభివృద్ధి పనులు : మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రా ప్రాంత బౌద్ధచౌతన్య గాధలను,ఒక నాటి చారిత్రక విశిష్టతను విశ్వవ్యాప్తం చేసే దిశలో "శయన బుద్ధవిహార్ ప్రాజెక్టు "అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు ఏపీ పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.ప్రాజెక్టుకు పూర్వవైభవం తీసుకుని వస్తామని దుర్గేష్ ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా జిల్లా ఘంటసాలలో గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన ఈ ప్రాజెక్టు గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మధ్యలోనే ఆగిపోయిందని మంత్రి తెలిపారు.కూటమి ప్రభుత్వం ప్రాజెక్టును తిరిగి ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో అన్ని వర్గాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. బౌద్ధ ధర్మానికి ప్రతీకగా నిలిచే అతి కొద్ది ప్రాంతాల్లో కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలోని ఘంటసాల గ్రామం ఒకటి. ఈ ప్రాంత ప్రాచీన బౌద్ధ చరిత్ర నేపథ్యాన్ని గౌరవిస్తూ గతంలో టీడీపీ ప్రభుత్వం ఇక్కడ గౌతమ బుద్ధుని మహాపరి నిర్యాణానికి గుర్తుగా 2017లో శయన బుద్ధవిహార్ ప్రాజెక్టును చేపట్టింది. అప్పట్లో ప్రభుత్వం కోటిన్నర రూపాయలు కేటాయించగా ఘంటసాలకు చెందిన ప్రవాసాంధ్రుడు గొర్రెపాటి రంగనాథ్ 2.2 ఎకరాల స్థలాన్ని పర్యాటక శాఖకు విరాళంగా అందజేశారు.గతంలో టీడీపీ ప్రభుత్వ హయంలో ఈ ప్రాజెక్ట్ అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు.అనంతరం 2019-24 నడుమ అసంపూర్తిగా నిలిచిపోయిన శయన బుద్ధవిహార్ ప్రాజెక్టు స్థలంలోనే ఇటీవల నిర్వహించిన బౌద్ధ జయంతి వేడుకలు నిర్వహించామన్నారు.. రాష్ట్రంలో బుద్ధుడు నడయాడిన ప్రదేశాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. శయన బుద్ధ ప్రాజెక్టు మనం ఇక్కడ చూస్తున్నాము.

అసంపూర్తిగా మిగిలి ఉంది. దీని విషయంలో మనం నిర్ణయం తీసుకోవాలి. అటు విశాఖపట్నంలోనూ పలు ప్రాంతాలు ఉన్నాయి. ఇవన్నీ బౌద్ధాన్ని ప్రాచుర్యంలోకి తీసుకొచ్చాయి. ఈ ప్రాంతాలలో మరింతగా అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని మంత్రి తెలిపారు. 2017 సెప్టెంబర్ 16న ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు.



## మల్టివేరియేట్ డేటా విశ్లేషణపై వర్క్‌షాప్

**శ్రీకాళహస్తి,మే 19 ప్రభాతవార్త** తిరుపతి ఐఐటి సాంకేతిక రంగంలో పరుగులు తీస్తుంది. ఈ నేపథ్యంలో రక రకాల పరిశోధనలకు పునాదులేస్తుంది. తిరుపతి ఐఐటిని సుమారు 540 ఎకరాల్లో స్థాపించటం జరిగిందని డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ వివరించారు. సోమవారం ఇక్కడ పరిశోధనా పద్దతి మరియు మల్టివేరియేట్ డేటా విశ్లేషణపై వర్క్ షాప్‌ను నిర్వహించారు.ఐఐటిలోని హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగం సారథ్యంలో ఐదు రోజుల వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసారు.ఈ నెల 23వ తేది వరకు నిర్వహించే కార్యక్రమాలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని నిర్వాహాకులు తెలిపారు.ఈ వర్క్‌షాప్‌ను విభాగాధిపతి డాక్టర్ చంద్రశేఖర్ బహినిపతి పర్యవేక్షణలో డీన్ ప్రొఫెసర్ ముత్తుకుమార్ పళనిస్వామి ప్రారంభించారు.ఈ కార్యక్రమాలకు 50మంది హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్‌కు దేశ వ్యాప్తంగా ఉన్న పిహెచ్‌డి ,పరిశోధనా విద్యార్థులు,ఫ్యాకల్టీ సభ్యులు హాజరౌతారని వివరించారు. అంతేకాక ఇంజనీరింగ్,నిర్వహణ, లైఫ్‌సైన్సెస్,హ్యూమానిటీస్‌తో సహా విభిన్న నేపధ్యాలను చెందిన వారు ఉన్నట్లు వివరించారు.సెషన్‌లను ఐఐటి ఫ్యాకల్టీ సభ్యులు నిర్వహిస్తారని వివరించారు.ఈ ప్రారంభ కార్యక్రమాల్లో అధ్యాపక సభ్యులు డాక్టర్ వనీత్ కశ్యప్ డాక్టర్ విష్ణు,సి,రాజన్ సమన్వయం చేసారు.

## పోక్సో, గ్యాంగ్ రేప్ కేసుల్లో 169 మంది నిందితులకు కఠిన శిక్షలు - డిజిపి హరీష్ కుమార్ గుప్తా

### - మహిళలపై జరిగే వ్యవస్థీకృత నేరాలను అరికట్టడానికి ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఏర్పాటు

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పలు నేరాలకు సంబంధించి ,నమోదు చేసిన క్రిమినల్ కేసుల్లో నిందితులకు శిక్షపడే విధంగా సాక్ష్యాధారాలను సేకరించడంలో పోలీసు విజయవంతమైందని ఏపీ డీజీపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు.ఆ మేరకు ఆయన సోమవారం మీడియాకు సమాచార పత్రం విడుదల చేసారు.నేర నిరూపణలో సాంకేతికత వినియోగం,చురుగ్గా సాక్ష్యాలను గుర్తించి కేసులను పటిష్టంగా రూపొందించడంలో పోలీసు అడుగులు వేస్తోందన్నారు.గడిచిన 10 నెలల్లో పోక్సో , వరకట్న హత్యలు, మహిళల హత్యలు, రేప్,గ్యాంగ్ రేప్ కేసుల్లో 169 మంది నిందితులకు న్యాయస్థానాలు కఠిన శిక్షలు విధించడం జరిగిందని తెలిపారు. మహిళలు, బాలికల భద్రతకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. మహిళలపై జరిగే వ్యవస్థీకృత నేరాలను అరికట్టడానికి ఐజీ రాజకుమారి నేతృతంలో ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.మహిళలకు శక్తి యాప్‌ను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. మహిళల భద్రతకై అత్యంత అధునాతన ఫీచర్లు కలిగిన"శక్తి యాప్ ఇపుడు హిందీ, ఇంగ్లీష్ భాషల్లో యూజర్లకు అందుబాటులో ఉండటంతో పాటుగా ప్లేస్టోర్(అండ్రాయిడ్ ఫోన్), ఐఓఎస్(ఆపిల్‌ఫోన్) నుండి యాప్ ను డౌన్ లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు. శక్తి యాప్ ను అందుబాటులోకి తీసుకువచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 1,52,16,440 మంది శక్తి యాప్ ను తమ మొబైల్ లో డౌన్ లోడ్ చేసుకోవడం జరిగిందన్నారు. అత్యవసర సహాయం కోసం (ఎస్ఓఎస్) 11,60,146 మంది కాల్ చేయగా వీటిలో 34,192 తక్షణమే స్పందించవలసిన కాల్స్ గా నమోదు చేసుకొని, 3,193 ఎఫ్ఐఆర్ లు నమోదు చేయడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఈ యాప్ ద్వారా 242 ఫ్యామిలీ కౌన్సిలింగ్ రిక్వెస్టులు, సేఫ్ ట్రావెల్ కోసం 160,



తప్పిపోయిన పిల్లల కోసం 18 మంది ఈ యాప్ ద్వారా రిపోర్టు చేయడం జరిగిందన్నారు. మహిళల భద్రతకై రాష్ట్రవ్యాప్తంగా ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో 164 శక్తి టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.



జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

## నాణ్యతతో కూడిన వైద్యం ప్రభుత్వ లక్ష్యం

### మంత్రి అనగాని సత్యప్రసాద్

**విజయవాడ, మే 19, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. సోమవారం నేషనల్ హెల్త్ మిషన్ బ్లడ్ సెల్, విజయవాడ హీమోఫిలియా సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడ హయత్ ప్లేస్లో నిర్వహించిన రెండు రోజుల బ్లీడింగ్ డిజార్డర్స్ కాన్ఫరెన్స్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హీమోఫిలియా వంటి అరుదైన వ్యాధికి మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు. హీమోఫీలియా సొసైటీ విజయవాడ చాప్టర్ కార్యదర్శి డా ఎంబిఎస్‌వి ప్రసాద్ మాట్లాడుతూ విజయవాడలో 1100 మంది, విశాఖలో 900 మంది హీమోఫీలియాతో జీవనం సాగిస్తున్నారని, వీరికి వైద్య, ఆర్థిక, మానసిక, సామాజిక సాయం అందిస్తామన్నారు. సిఎంసి (నెల్లూరు), ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునోహిమటాలజి (ముంబై) వంటి కొన్ని కేంద్రాల్లో మాత్రమే అందించే జీన్స్ ఆధారిత, రోగ నిర్ధారణ సేవలందిస్తామన్నారు.

## ప్రతి పథకాన్ని ప్రజలకు అందచేస్తాం!

### కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి



**కావలి (నెల్లూరు), మే 19, ప్రభాతవార్త :** ప్రతి పథకాన్ని ప్రజలకు అందచేస్తామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలి పట్టణంలోని దొడ్లమనోహర్‌రెడ్డి కళ్యాణమండపంలో సోమవారం మినీమహానాడు హోరెత్తింది. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల కాలంలో మృతిచెందిన టిడిపి కుటుంబసభ్యులకు నివాళులర్పించి రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. వైసిపి అరాచకాలకు తట్టుకోలేక టిడిపిలోకి వలసలు పెరుగుతున్నాయన్నారు. ఒక సిద్ధాంతంతో నందమూరి తారక రామారావు స్థాపించిన పార్టీ టిడిపి అన్నారు. సంక్షేమ పథకాల ఫలాలను ప్రజలకు అందచేస్తూ బలహీనవర్గాల అభివృద్ధికోసం ఒక అజెండాతో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు స్థాపించిన పార్టీ మన తెలుగుదేశంపార్టీ అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలి నియోజకవర్గంలో దామవరం విమానాశ్రయం, రామాయపట్నం పోర్టు, బిపిసియల్ కంపెనీని నిర్మిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు చెబుతున్నానన్నారు. అలాగే బిట్రగుంటలో వందేభారత్ సర్వీస్‌సెంటర్, మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్, కేంద్రీయ విద్యాలయం కావాలని నాయకులు తీర్మానించారన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించి త్వరలోనే అన్ని వచ్చేలా ఏర్పాటుచేస్తామన్నారు. కావలి రూరల్ మండలానికి, అల్లూరుకు సంబంధించి రాజుపాలెం నుంచి రామాయపట్నం పోర్టువరకు అల్లూరు బైపాస్‌తో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌మీదుగా జాతీయరహదారి నాలుగులైన్ల నిర్మాణానికి తీర్మానం చేయడం జరిగిందన్నారు.

## విజన్ 2047 లక్ష్యసాధనలో ప్రజా సమస్యల పరిష్కారమే తొలిమెట్టు

### - అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు :కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ



**జగ్గయ్యపేట, మే 19, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం విజన్ 2047 లక్ష్యసాధనలో ప్రజా సమస్యల పరిష్కారమే తొలిమెట్టుగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో అందవచ్చిన అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవంటూ ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీ శ ప్రభుత్వ యంత్రాంగాన్ని హెచ్చరించారు. జగ్గయ్యపేట పట్టణంలోని కోదాడ రోడ్‌లోగల బి కన్వెన్షన్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశతోపాటు తెలుగుదేశం పార్టీ జాతీయ కోశాధికారి, స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), కెడిసిసి బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన మాజీమంత్రి నెట్టెం రఘురామ్, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నందిగామ ఆర్‌డిఓ బాలకృష్ణ, గ్రామ-వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి జ్యోతి, డిఆర్‌డిఏ పిడి ఏఎన్‌వి నాంచారరావు, డిసిఓ పి లావణ్యకుమారి, డిఎస్‌పిలు ఏబిజి తిలక్, వెంకటేశ్వరరావు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. సభలో కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో సంతృప్తి అనేది అత్యంత ప్రధానమన్నారు. సమస్య తప్పనిసరిగా పరిష్కారం అవుతుందనే భరోసాను అధికారులు కల్పించాలన్నారు. నిబద్ధత, నాణ్యమైన విధంగా అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో మొత్తం 461 అర్జీలను స్వీకరించటం జరిగిందని, వీటిలో నందిగామ మండలానికి చెందినవి 38, చందర్లపాడు నుండి 8, వీరులపాడు నుండి 4, కంచికచర్ల నుండి 8, పెనుగంచిప్రోలు నుండి 56, వత్సవాయి నుండి 44, జగ్గయ్యపేట మండలం నుండి అత్యధికంగా 222, మిగిలినవి ఇతర మండలాల నుండి అందినట్లు కలెక్టర్ ప్రకటించారు. ఎమ్మెల్యే రాజగోపాల్ మాట్లాడుతూ అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన మార్గనిర్దేశనం చేయటం జరిగిందన్నారు. ఈనామ్ భూముల సమస్యలలు పెండింగ్‌లోవున్నాయని ప్రధానంగా జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతాల్లో బాధితులు ఎక్కువ మందిఇబ్బందులు పడుతున్నారని రంగాపురం నరసింహారావు, బాధిత బృంద సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు సమర్పించారు.

## విజయవాడ ఆటోనగర్లో ఉచిత కార్మిక పాఠశాల ప్రారంభం

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** కార్మికులకు ఉచిత శిక్షణ నిమిత్తం విజయవాడ ఆటోనగర్లో కార్మిక పాఠశాల ప్రారంభోత్సవం జరిగింది.ఆటోనగర్ టెక్నీషియన్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఈ పాఠశాలను ప్రముఖ న్యూరాలజిస్టు డా. గోపాలం శివన్నారాయణ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా అసోషియేషన్ అధ్యక్షులు రాజనాల బాబ్జి.,గౌరవ అధ్యక్షులు బాయన వెంకట్రావు, కార్యదర్శి టి.వి. నాగేశ్వరరావు వారితో పాటు తాడేపల్లిలో భగత్ సింగ్ లైబ్రరీ స్టడీ సెంటర్ నిర్వాహకులు ప్రొఫెసర్ బి శ్రీనివాస రావు , కార్మిక పాఠశాల బాధ్యులు రావేళ్ల లక్ష్మణరావులు పాల్గొన్నారు. కార్మిక పాఠశాల ముఖ్య నిర్వాహకులుగా ఆర్ రఘు గారు సభకు అధ్యక్షత వహిస్తూ ఆటోనగర్లో ఉచిత కార్మిక పాఠశాల ప్రారంభించాల్సిన అవసరం గురించి మాట్లాడారు. విజయవాడ ఆటోనగర్, ఆసియాఖండంలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడగా పేరుగాంచిందన్నారు. మహిళా కార్మికులతో సహా సుమారు లక్ష మంది మన ఆటోనగర్ లో జీవనం సాగిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికులు ఉన్నారు. కృష్ణా గుంటూరు జిల్లాల్లోని దూరప్రాంతాల నుండి కూడా శ్రామికులు రోజు ద్విచక్ర వాహనాల మీద ఆటోలలో, బస్సులలో, రైళ్ళలలో కూడా పనికి వస్తున్నారు. వీరిలో అత్యధిక మందికి తమ విద్యార్హతలు నైపుణ్యం, పర్సనాలిటీ డెవలప్మెంట్ పెంచుకోవాలన్నారు.

## వైద్యం వికటించి బాలింత మృతి

**కావలి (నెల్లూరు), మే 19, ప్రభాతవార్త :** కావలి పట్టణ ఏరియా వైద్యశాలలో వైద్యం వికటించి బాలింత రావినూతల సునీత (30) మృతిచెందడంతో కుటుంబసభ్యుల రోదనలతో కావలి ఏరియా వైద్యశాల దద్దరిల్లింది. న్యాయం జరిగేవరకు ఇక్కడినుంచి వెళ్లేదిలేదంటూ బాధితులు వైద్యశాల ఆవరణంలో బైఠాయించిన సంఘటన సోమవారం కావలిలో తీవ్రసంచలనం సృషించింది. వైద్యశాల ఆవరణం ఉద్రిక్తతగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. వివరాలిలా ఉన్నాయి. కుటుంబనియంత్రణ ఆపరేషన్ కోసం వస్తే వైద్యులు శవాన్ని అప్పగించారని బాధితులు గగ్గోలు పెట్టారు. కావలి మున్సిపాలిటి పరిధిలోని మద్దూరుపాడుకు చెందిన బాలింత రావినూతల సునీత కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం సోమవారం కావలి ఏరియా వైద్యశాలకు వచ్చారు. థియేటర్‌లోకి తీసుకువెళ్లిన పది నిముషాలకే శవాన్ని ఇచ్చారని బాధితులు ఆరోపించారు. అనస్థీషియా ఇచ్చామని రికవరి అవుతుందని సెలైన్ కడుతున్నామని మాయమాటలు చెప్పి వైద్యులు మోసగించారన్నారు. అనస్థీషియా కోసం 700 రూపాయలు డబ్బులు కూడా తీసుకున్నారని బాధితులు తెలిపారు. బయటనుంచి మందులు కూడా తమచేత తెప్పించారని కుటుంబసభ్యులు రోదిస్తూ తెలిపారు. వైద్యుల నిర్లక్ష్యం మూలంగానే తమ బిడ్డ చనిపోయిందని వైద్యశాలముందు కుటుంబసభ్యులు నిరసన నినాదాలతో గందరగోళం సృష్టించారు. మృతురాలి శరీరం చల్లగా ఉందని డాక్టర్లకు చెప్పినా పట్టించుకోలేదని గగ్గోలు పెట్టారు. మృతురాలు సునీతకు రెండునెలల బాబు అని, తల్లిలేని ఈ బిడ్డ పరిస్థితి ఏమిటని కుటుంబసభ్యులు రోదించారు. నిర్లక్ష్యంగా వైద్యసేవలు అందించి శవాన్ని అందచేసిన డాక్టర్లపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## మండల కమిటీల్లో యువతకు ప్రాధాన్యత

### అమరావతి నిర్మాణానికి శ్రీకాళహస్తి నుంచి శ్రీకారం

**శ్రీకాళహస్తి,మే 19 ప్రభాతవార్త** రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మండల,పట్టణ కమిటిల్లో మూడు సార్లు పదవులు అనభవించిన వారికి గుడ్‌బై చెబుతున్నామని యువతకు,మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. భారత దేశంలోనే ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 'అమరావతి నిర్మాణంలో' శ్రీకాళహస్తి ప్రజల్ని భాగస్వాముల్ని చేద్దామని ఇక్కడి నుంచి శ్రీకారం చుడుతామని ఆయన పిలుపు నిచ్చారు. ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు కడపజిల్లా కమలాపురం నియోజకవర్గంలోని సికె దిన్నెలో జరగనున్న మహానాడుకు వెళ్ళటానికి ఏర్పాట్లును సమీక్షించుటకు శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం విభజించి సుమారు 12 సంవత్సరాలైనా ఇప్పటి వరకు రాజధాని లేదన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా 'అమరావతిని రాజధానిగా' నిర్మించుటకు నిర్ణయించారన్నారు.

అయితే మన రాష్ట్రాన్ని ఐదేళ్ళ పాటు పరిపాలించిన నాయకుడు బటన్ నొక్కుడుతో అప్పుల పాల్జేసారని కాబట్టి మనం అందరం కలసి రాజధాని నిర్మాణానికి సహకరిద్దామని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. రూపాయి నుంచి మనకు ఎంత తోచితే అంత రాజధాని నిర్మాణానికి సిఎం సహాయ నిధికి పంపుతామని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. పరిపాలన అంతా మండల నాయకుల చేతిల్లోనే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పరి పాలన అంతా ఆయా మండలాల్లోని నాయకుల చేతుల్లో పెట్టానని సుధీర్‌రెడ్డి వివరించారు.

## నకిలీ పేరుతో మోనికా బేడీకి పాస్‌పోర్టు

### -కృష్ణమోహన్‌రెడ్డి తహసీల్దార్‌గా ఉన్నప్పుడే జారీ

### - అప్పట్లో కర్నూలు ఎస్పీగా పిఎస్ఆర్ ఆంజనేయులు

**విజయవాడ,మే 19,ప్రభాతవార్త ప్రతినిధి:**రెండున్నర దశాబ్దాల క్రితం దేశవ్యాప్తంగా,అంతర్జాతీయంగా సంచలనం సృష్టించిన అండర్ వరల్డ్ మాఫియా డాన్ అబూసలేం ప్రియురాలు,సినీనటి మోనికా బేడీకి నకిలీ పేరుతో పాస్‌పోర్టు జారీ చేసిన వ్యవహారం...మద్యం కుంభకోణం కేసులో తాజాగా అరెస్టైన జగన్ ఓఎస్డీ పెళ్ళకూరు కృష్ణమోహన్‌రెడ్డి కర్నూలు తహసీల్దారుగా ఉన్నప్పుడే జరిగిందని సిట్ అధికారులు ఆరోపిస్తున్నట్లు సమాచారం. ఆ దిశలోను ఆయనను విచారించేందుకు సిట్ సన్నద్ధమవుతుంది..సనా మాలిక్ కమల్ పేరిట మోనికా బేడీకి 2001 ఏప్రిల్ 9న నివాస ధృవీకరణ పత్రాన్ని ఆయనే జారీ చేశారు. కర్నూలు లోని బాబూ గౌండ వీధిలో నివాసం ఉంటున్నట్లు తప్పుడు సర్టిఫికెట్ ఇచ్చారు. దాన్ని అడ్డం పెట్టుకునే మోనికా బేడీ పాస్‌పోర్టు పొందగలిగారు. తన ప్రియుడు,1993 నాటి ముంబయి పేళుళ్ళ ఘటనలో కీలక పాత్రధారి,దేశద్రోహానికి సంబంధించి పలు కేసుల్లో అభియోగాలున్న అబూ సలేంతో కలిసి 2002లో పోర్చుగల్‌కు పారిపోయి, అక్కడి పోలీసులకు పట్టుబడ్డారు. ఆ తర్వాత తీగ లాగితే కర్నూలు కేంద్రంగానే ఈ నకిలీ పాస్‌పోర్టుల తయారీకి బీజం పడినట్లు వెలుగుచూసింది.

# లగ్జరీ హోటళ్లలో బస.. ఖరీదైన కార్లలో రాకపోకలు

### పలుమార్లు పాక్‌కు వెళ్లి ఐఎస్ఐ అధికారులతో భేటీలు

### దర్యాప్తులో వెలుగులోకి వస్తున్న యూట్యూబర్ జ్యోతి లీలలు

**న్యూఢిల్లీ, మే 19:** దాయాది దేశం పాకిస్థాన్‌కు గూఢచారిగా వ్యవహరించిందన్న ఆరోపణలపై అరెస్ట్ అయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసులో హరియాణా పోలీసులు దర్యాప్తు ముమ్మరంచేసారు. దేశద్రోహ కార్యకలాపాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఆమెను పాకిస్థాన్ ఐఎస్ఐ ఏజెంట్లు తమ అస్త్రంగా మలుచుకున్నట్లు పోలీసులు తేల్చారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఆమె పాక్ రాయబార కార్యాలయంలో పనిచేసే అధికారితో సంప్రదింపులు జరిపినట్లు నిర్ధారించారు. ఈ మేరకు హిసార్ ఎస్పీ శశాంక్ కుమార్ సావర్ మాట్లాడుతూ జ్యోతి మల్హోత్రా సైనిక లేదా రక్షణ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం వారితో పంచుకుందని ప్రస్తుత దశలో చెప్పలేమన్నారు. కానీ, పాక్ నిఘా వర్గాలతో ఐఎస్ఐతో ఆమె నేరుగా సంప్రదింపులు జరిపారని చెప్పారు. వాళ్లు ఆమెను ఓ అస్త్రంగా చేసుకున్నారని కచ్చితంగా చెప్పగలమన్నారు. జ్యోతి ఇతర యూట్యూబ్ ఇన్‌ఫ్లుయెన్స ర్లతో కూడా టచ్‌లో ఉన్నట్లు గుర్తించారు. వాళ్లు కూడా పీఐవోలతో సంప్రదింపులు జరుపుతు న్నారని అన్నారు. ఇది కూడా ఓ రకమైన యుద్ధమేనని తెలిపారు. ఇన్‌ఫ్లుయెన్సర్లను నియమించు కుంటూ వారి ప్రయత్నాలను అమలు చేస్తారని అన్నారు. జ్యోతి మల్హోత్రా పాకిస్థాన్‌లో పలుమార్లు పర్యటించిందని, ఓసారి చైనాకూ వెళ్లి వచ్చిందన్నారు. ఇటీవల బహిష్కరణకు గురైన పాకిస్థాన్ అధికారి డానిష్‌తో కూడా ఆమె టచ్‌లో ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఇప్పుడు ఆర్థిక లావాదేవీలు, ప్రయాణ వివరాలు విశ్లేషిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఆమె రాబడికి మించిన స్థాయిలో ఖర్చులచేసారని, ఖరీదైన రెస్టారెంట్లు, లగ్జరీ హోటళ్లలోనే బసచేసినట్లు తేలింది.చైనా పర్యటనల్లో కూడా ఆమె ఖరీదైన కార్లలో ప్రయాణించినట్లు గుర్తించారు. ఆమె ల్యాప్‌టాప్ సహా ఎలక్ట్రానిక్ పరికరాలపై ఫోరెన్సిక్ విశ్లేషణ చేస్తున్నారు. ఏం సమాచారం పంచుకుందనే విషయం అప్పుడు స్పష్టమవుతుందని పేర్కొన్నారు.గతంలో పూరీకి చెందిన మరో యూట్యూబర్‌తో జ్యోతికి ఉన్న సంబంధంపై ఒడిశా పోలీ సులు దర్యాప్తు ప్రారంభించారు. సెప్టెంబర్‌లో పూరీ సందర్శిం చారని, అక్కడ మరో మహిళా యూట్యూ బర్‌ను కలిసినట్లు గుర్తించామని ఒడిశా లోని పూరీ ఎస్పీ వినీత్ అగర్వాల్ వెల్లడించారు. పూరీకి చెందిన సదరు యూట్యూ బర్ ఇటీవల పాకిస్థాన్‌లోని కర్తార్‌పూర్ సాహిబ్ గురు ద్వారాను సందర్శించారని తేలింది. అయితే ప్రియాంక సేనాపతి అనే ఈ యూట్యూబర్ జ్యోతి తనకు కేవలం స్నేహితురాలు మాత్రమేనని యూట్యూబ్ ద్వారానే పరిచయమన్నారు. ఇదిలా ఉంటే జ్యోతి తండ్రి హ్యారిస్ మల్హోత్రా మాట్లాడుతూ యూ ట్యూబ్ విడియోల కోసం పాకిస్థాన్ వెళ్లిందన్నారు. అందుకు అవసరమైన అనుమతులు తీసుకున్నదని చెప్పిన ఆయన స్వాధీనం చేసుకున్న తమ ఫోన్లు ఇవ్వాలన్నారు. పాక్ అధికారుల పేర్లను హిందూ పేర్లతో ఫోన్‌బుక్‌లో సేవ్‌చేసినటు కూడా హర్యానా పోలీసులు తెలుసుకున్నారు. వాట్సాప్, స్నాప్‌చాట్, టెలిగ్రామ్ వంటి సాయంతోనే ఆమె సంప్రదింపులు జరిపింది. అన్నింటి కంటే ముఖ్యంగా పహల్గాంవ్‌లో జరిగిన దాడికి ముందే ఆమె ఆప్రాంతంలో పర్యటించి విడియోలు చేసిందని, ఆవిడియోలు వైరల్ అయిన తర్వాతనే పహల్గాంలో పర్యాటకులపై ఉగ్ర వాదుల దాడులు జరిగాయని పోలీసులు ధ్రువీకరించారు.





తలసీమియా,సికిల్‌సెల్ అనీమియా,హిమోఫీలియా వ్యాధులపై అవగాహన పోస్టర్లును ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్


## జన్యుపరంగా వచ్చే వ్యాధులను సైతం నియంత్రించే స్థితిలో అనేక ఆవిష్కరణలు

### వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,మే19,ప్రభాతవార్తప్రతినిధి:** జన్యుపరంగా వచ్చే వ్యాధులను సైతం నియంత్రించే స్థితిలో వైద్యరంగంలో అనేక ఆవిష్కరణలు అందుబాటులోకి వచ్చాయని రాష్ట్ర మెడికల్,హెల్ మినిస్టర్ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు.వీటిని రోగులకు అందుబాటులోకి తీసుకుని వచ్చే దిశలో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని తమ ప్రభుత్వం ఉందన్నారు. ప్రధాని నరేంద్రమోడీలోని కేంద్ర ప్రభుత్వం ఇందుకు పూర్తి స్థాయి సహకారం అందిస్తుందన్నారు.ఏ వ్యాధినైనా నివారించే పరిస్థితి ఉండక పోవచ్చునేమోగాని,ముందుగా గుర్తిస్తే నియంత్రించగలమన్నారు.తలసీమియా, సికిల్ సెల్ అనీమియా, హిమోఫీలియా వ్యాధులు జన్యుపరంగా వచ్చేవన్నారు.వీటిపై ఇంకా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుణదల హయత్ ప్లేస్ హోటల్ లో సోమవారం రక్త సంబంధిత వ్యాధుల నిర్ధారణ మరియు చికిత్సలో ఆధునిక పద్ధతులపై రెండు రోజుల శిక్షణ, అవగాహనా కార్యక్రమాన్ని నేషనల్ హెల్త్ మిషన్, హీమోఫోలియా సొసైటీ లు సంయుక్తంగా ఏర్పాటు చేశారు. రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతం సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో ఆంధ్రప్రదేశ్ ను దేశంలోనే అగ్ర స్థానంలో నిలపాలన్నదే కూటమి ప్రభుత్వ ఆకాంక్ష అని అన్నారు. రాష్ట్రంలో దాదాపు 1900 మంది హిమోఫీలియా బాధితులున్నారని, దాదాపు 2,100 మంది తలసీమియాతోను,ఇదే సంఖ్యలో సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్నారన్నారు. ఇది జన్యుపరంగా వారసత్వంగా వస్తున్న వ్యాధి అని, దీనికి మందులు వాడుతూనే ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వ్యాధిని ముందుగా గుర్తించడం చాలా ముఖ్యమన్నారు. బాధితుల్ని గుర్తించి వారికి క్రమం తప్పకుండా ఉచితంగా రక్త మార్పిడిని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్రంలోని 5 ఐసిహెచ్‌యస్ సెంటర్ల ద్వారా ముందస్తు వ్యాధి నిర్ధారణ పరీక్ష చేస్తున్నామన్నారు. వ్యాధి నిర్ణారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా చికిత్స, మందులు అందిస్తోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం తలసీమియా, సికిల్ సెల్ అనీమియా, హిమోఫీలియా వ్యాధులు బారినపడిన వారికి నెలకు రూ. 10 వేల పెన్షన్ కూడా అందిస్తుందన్నారు. రాష్ట్రంలో 40 సంవత్సరాల లోపు ఉన్న గిరిజన ప్రాంతాల్లో ప్రజలు 19 లక్షల మందికి సికిల్ సెల్ ఎనీమియా స్క్రీనింగ్ చేయాల్సి ఉండగా 10 లక్షల 50 వేల మందికి ఇప్పటి వరకు స్క్రీనింగ్ చేశామన్నారు, ఆ ప్రక్రియ ఇంకా కొనసాగుతుందని త్వరలోనే దీనిని పూర్తి చేయల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో 19,000 మంది పైగా క్యారియర్స్ ఉన్నారన్నారు. 2,100 మందికి వ్యాధి నిర్ధారణ అయ్యిందన్నారు. జన్యుపరమైన సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్ తర్వాత గుర్తింపు కార్డులిస్తున్నామన్నారు. నోడల్ ఆఫీసర్లకు అవగాహన కల్పించేందుకు రెండు రోజుల పాటు శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఇది కొత్త ఆవిష్కరణలకు దారితీసే విధంగా ఉపయోగపడుతుందన్నారు. తలసీమియా, హిమోఫీలియా, సికిల్ సెల్ ఎనీమియా విభాగాల్లో మరింత అవగాహన కల్పించేందుకు రెండు రోజుల ఒరియెంటేషన్ వైద్యులకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. వైద్య సేవలు మరింత మందికి ఉచితంగా అందించడంతోపాటు లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## నిర్ణీత గడువులోగా అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలి

బాపట్ల,మే19,ప్రభాతవార్త: నిర్ణిత గడువులోగా అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు.పోలీస్



ప్రధాన కార్యాలయంలో నిర్వహిచిన పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారులు వారి సమస్యలను స్వేచ్ఛగా ఎస్పీకి విన్నవించుకు న్నారు. కుటుంబ కలహాలు, భర్త,అత్తారింటి వేధింపులు, భూ ఆస్థి వివాదాలు, ఇతర సమస్యలపై వచ్చిన 50 అర్జీలను ఎస్పీ పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి అర్జీలను చట్ట పరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని తెలిపారు. పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహారిస్తే ఉపేక్షించబోమని పోలీస్ అధికారులను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీనివాస్ ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

## ఇదేనా అధికారుల హాజరు తీరు!

కర్లపాలెం,మే19,ప్రభాతవార్త: కర్లపాలెం మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పూర్తిస్థాయి అధికారులు హాజరు కావడం లేదు. అసలు కొన్ని శాఖలైతే ఇంతవరకు అక్కడ కనిపించనేలేదు. మరికొన్ని శాఖలైతే వారి కిందిస్థాయి సిబ్బందిని



పంపాము అనిపించుకుంటున్నారు. దీనిపై ఇప్పటివరకు ఉన్నతాధి కారులు వారికి ఎటువంటి నోటీసులు కూడా జారీ చేయలేదు. పై అధికారులు కఠినంగా ఉంటే తప్ప వీరు మారేలాగా లేరు. ఎందుకు అన్ని శాఖల అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరు కావడం లేదు. ఎందుకు ఇంత నిర్లక్ష్యం? ప్రజలంటే నిర్లక్ష్యమా..? ప్రజా సమస్యలు అంటే నిర్లక్ష్యమా?

## సిడబ్ల్యుఎస్ పిల్లల ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమం



కర్లపాలెం,మే19,ప్రభాతవార్త: సిడబ్ల్యుఎస్ పిల్లల ఎన్రోల్మెంట్ డ్రైవ్ మే 13 నుంచి జూన్ 9 వరకు జరుగుతుంది దీని ముఖ్య ఉద్దేశం కొత్తగా ఎవరైనా ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉంటే వాళ్లని నమోదు చేసి వాళ్ళ క్యాచ్ మెంట్ ఏరియాలో ఉన్న పాఠశాలలో చేర్పించటం ఏ పిల్లలు కూడా బడి బయట ఉండకూడదు అనే నినాదంతో ఈ కార్యక్రమం ప్రవేశపెట్టబడింది ఇది సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జరుగుతుంది. దీనిలో ఐఈడీ ఉపాధ్యాయురాలు అంగన్వాడీ కార్యకర్తలను మరియు సచివాలయ సిబ్బందిని కలుపుకొని కొత్తగా ఎవరైనా ఉన్నారేమోనని సర్వే చేయడం జరుగుతుంది .

# మౌలిక సదుపాయాలు కల్పిస్తాం..

### కార్యాలయాన్ని మరింత అభివృద్ధి పరుస్తాం-సబ్‌రిజిష్ట్రార్ ఆదినారాయణరెడ్డి

కొల్లిపర,మే 19 ప్రభాతవార్త: తాము ఎన్నాళ్ళు ఉద్యోగాలు చేసామనేది కాదని..వివిధ పనులపై కార్యాలయానికి వచ్చే వారికి మెరుగైన సేవలు అందిస్తున్నామా..అనేది ముఖ్యమని..ఆ సంకల్పంతో మేమందరం పనిచేస్తున్నామని చెబుతూ కార్యాలయంలో మౌళిక సదుపాయాలు కల్పించటంతో పాటు రిజిస్ట్రేషను కార్యాలయాన్ని మరింత అభివృద్ధి పరుస్తామని సబ్‌రిజిస్ట్రార్ ఆదినారాయణరెడ్డి స్పష్టం చేసారు.సోమవారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి డాక్యుమెంట్ రౌటర్స్,ప్రజలు మూకుమ్మడిగా



వచ్చారు.రిజిస్ట్రార్ ఆదినారాయణరెడ్డిని కలిపారు.తమరిని..ఆపీసు సిబ్బందిని సన్మానించటానికి వచ్చామని చెప్పటంతో ఒక్కసారే ఆయన ఆశ్చర్యపోయారు.వెంటనే డాక్యుమెంట్ రౌటర్సు స్పందిస్తూ రిజిస్ట్రేషను జరిగిన వెంటనే త్వరితగతిన దస్తావేజులు ప్రజలకు అందించటంలోనూ...కార్యాలయానికి వచ్చే ప్రజలకు వెయిటింగ్ రూము..మంచినీటి సౌకర్యం..బూత్‌రూం సౌకర్యాలు,కార్యాలయం ఆవరణలో ప్రజల భాగస్వామ్యంతో గార్డెనింగ్ ఏర్పాటు వంటి మెరుగైన సౌకర్యాలు కల్పించటంపై రిజిస్ట్రార్ ఆదినారాయణరెడ్డిని,కార్యాలయ సిబ్బందిని శాలువాతో పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు.అంతేగాకుండా రెండు తెలుగు రాష్ట్రాలలోని ఆపీసులలో కొల్లిపర సబ్‌రిజిస్టర్ ఆపీసుకు ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఐఎస్ఓ గుర్తింపు రావటానికి కారణమైన సబ్‌రిజిస్టర్ ఆదినారాయణరెడ్డి,సత్యశ్రీనివాస్,వాణికి ప్రత్యేక ధన్యవాదాలు..అభినందనలు తెలిపారు.సన్మానించిన వారిలో డాక్యుమెంట్‌రౌటర్‌లు తమ్మా బసవపున్నారెడ్డి,బొందలపాటి గంగాధర్,ఆరిమండ కోటిరెడ్డి,సుభాని,రమణశర్మ,మాధవరెడ్డి,కళ్యాణ్‌రెడ్డి,సుజారావు,జానకిరామ్,వీరయ్య,సాంబిరెడ్డి,ఖాజా, గ్రామస్తులు ఉన్నారు.

## ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి : మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,మే 19,ప్రభాతవార్త: ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు వాటికి శాశ్వత పరిష్కారం కనుగొనాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రధాన కార్యాలయం లోని కమాండ్ కంట్రోల్ రూంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార




వేదికను ఆయన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని, ప్రజల సమస్యలను వేగంగా,సమర్థవంతంగా పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పట్టణ ప్రణాళికా శాఖకు సంబంధించి-12, ఇంజనీరింగ్-2,రెవెన్యూ-1,వైద్య,ఆరోగ్యం-1,మొత్తం కలిపి 17 ఫిర్యాదులను అందుకున్నారు. కార్యక్రమంలో అదనపు కమీషనర్ ప్రాజెక్ట్స్ డాక్టర్ డి.చంద్రశేఖర్,చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్,డిప్యూటీ కమీషనర్ రెవెన్యూ జి.సృజన,సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.సత్యకుమారి,ఇన్‌ఛార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్,రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు,డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్,వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖరరెడ్డి,బయాలజిస్ట్ సూర్యకుమార్,తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్లు త్వరగా పేదలకు అందించే ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయాలి : కమీషనర్ ధ్యానచంద్ర

విజయవాడ కార్పొరేషన్,మే 19,ప్రభాతవార్త: పేదలకు అందించే ఇళ్ళను కాంట్రాక్టర్లు త్వరగా నిర్మించాలని, మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని నూతన భవనంలో ఆయనతో పాటు స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి ఎం.శివప్రసాద్,కాంట్రాక్టర్లు,లబ్ధిదారులు,హౌసింగ్,విఎంసి అధికారులతో సమన్వయ సమావేశాన్ని




నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ ధ్యానచంద్ర,స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి శివప్రసాద్‌లు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పేదలందరికీ ఇళ్ళు ఇచ్చే కార్యక్రమంలో భాగంగా కాంట్రాక్టర్లు అందరూ సహకరించాలని, త్వరగా ఇళ్ళన్నీ పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్లు,అధికారుల మధ్యలో సమన్వయ లోపంలో ఉన్న సమస్యలను ముఖాముఖి చర్చించడంతో సమస్యలను పరిష్కరిస్తూ,ప్రభుత్వం తరపు నుండి వారికి సంపూర్ణ సహాయం అందుతుందని వారికి ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా అధికారులు చర్యలు తీసుకుంటారని అన్నారు. కాంట్రాక్టర్లకు కేటాయించిన ఇళ్ళ నిర్మాణ పనులను త్వరగా పూవర్తి చేసి గడువు లోపు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి,సూపరింటెండింగ్ ఇంజనీర్ వర్క్స్ పి.సత్యన్నారాయణ,ప్రాజెక్ట్ ఆఫీసర్ యుసిడి విభాగం పి.వెంకట నారాయణ,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ చీఫ్ ఇంజనీర్ వేణుగోపాల్,పిడి లీలారాణి,హౌసింగ్ సిబ్బంది,విఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐఓలో విజయవంతంగా చికిత్స



విజయవాడ, మే 19, ప్రభాతవార్త : అమెరికన్ అంకాలజీ ఇన్స్టిట్యూట్ (ఏఐఓ) గుంటూరులో విజయవంతంగా 61 ఏళ్ళ రోగి ఆదినారాయణకు చికిత్స అందించినట్లు అంకాలజిస్ట్ డా ఫణీంద్ర కుమార్ నాగిశెట్టి సోమవారం మీడియాకు తెలిపారు. కణితితో సంబంధమున్న అరుదైన ఆటోఇమ్యూన్ రుగ్మతతో బాధపడుతున్న రోగికి రైట్ వీడియో అసిస్టెడ్ థొరోస్కోపిక్ సర్జరి థైమెక్టమీ అనే మినిమల్లీ ఇన్వాసిస్ సర్జికల్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించామని ప్రస్తుతం పేషంట్ క్షేమంగా వున్నారన్నారు.

## పిబిఎన్ కళాశాల విద్యార్థికి రజత పతకం

పొన్నూరు, మే 19, ప్రభాతవార్త: నిడుబ్రోలు పిబిఎన్ కళాశాలలో బికామ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న సిహెచ్ వెంకటేష్ ఖేలిండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో రజతపతకం సాధించి కళాశాలకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టారు. బీహారు రాష్ట్రంలోని రాజగిరి పట్టణంలో ఈ నెల 8వ తేదీ



నుంచి 14వ తేదీ వరకు జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో 89కేజీల విభాగంలో స్నాచ్, 117కిలోల విభాగంలో క్లీన్ అండ్ జర్క్, 155కిలోలు, మొత్తం 272కిలోల బరువులను లేవనెత్తి రజతపతకం సాధించినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీకాంత్ తెలిపారు. రజితపతకం సాధించిన వెంకటేష్‌ను కళాశాల ప్రెసిడెంట్ కెప్టెన్ ఎన్ అంకప్పచౌదరి, సెక్రటరీ, కరస్పాండెంట్ ఎన్.అన్నారావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.చిత్తరంజన్, ఫిజికల్ డైరెక్టర్ కె.భానుప్రసాద్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు అభినందించారు.

## టిడిపి సీనియర్ నాయకుడు వెంకట సుబ్బారావు మృతి

పొన్నూరు, మే 19, ప్రభాతవార్త: నిడుబ్రోలు పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పొన్నగంటి సుబ్బారావు(76) ఆదివారం అర్ధరాత్రి మృతి చెందారు. పొన్నగంటి సుబ్బారావు టిడిపి అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. గతంలో నిడుబ్రోలు సాగునీటి సంఘాల



అధ్యక్షుడిగా కూడా పనిచేసి రైతుల ప్రయోజనం కోసం పాటుపడ్డారు. అందరిని కలుపుకుపోయే స్వభావం కలవాడిగా, సౌమ్యుడిగా మంచి గుర్తింపు పొందారు. టిడిపి అధికారంలో ఉన్నా, లేకున్నా పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన నాయకుడిగా పొన్నగంటి ఖ్యాతి గడించారు. పొన్నగంటి మృతి వార్త తెలుసుకొన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. టిడిపి నాయకులు సుఖవాసి సుధీర్‌చంద్, జాగర్లమూడి సుధీర్, చలమశెట్టి సీతారామయ్య, బండ్లమూడి బాబూరావు, బొర్రు రామారావు, మాదల వెంకటేశ్వరరావు, పఠాన్ పిరోజ్‌ఖాన్, షేక్ బాజిసాహెబ్, చెన్నుపాటి భాస్కర్, ఆరె వరప్రసాద్ తదితరులు సుబ్బారావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## పిజిఆర్ఎస్‌కు ఆరు అర్జీలు

పొన్నూరు, మే 19, ప్రభాతవార్త: ప్రతి సోమవారం తహశాల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)కు వివిధ సమస్యలకు సంబంధించి ఆరు అర్జీలు అందినట్లు తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. వాటిలో రెవెన్యూకు సంబంధించి రెండు అర్జీలు,




సివిల్ సప్లయీస్‌కు సంబంధించి మూడు అర్జీలు, సర్వేకి సంబంధించి ఒక అర్జీ అందినట్లు తెలిపారు. వీటిని పరిష్కారం నిమిత్తం ఆయా శాఖలకు పంపినట్లు చెప్పారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రామారావు, ఐసిడిఎస్ సిడిపిఓ ఎస్.వెంకటరమణ, ఎపిఎం జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.

# వాహన చోదకులు నిబంధనలు పాటించాలి

### -అర్బన్ సిఐ లావూరి వీరానాయక్

పొన్నూరు, మే 19, ప్రభాతవార్త: వాహన చోదకులు తప్పని సరిగా నిబంధనలు పాటించాల్సిందేనని అర్బన్ సిఐ లావూరి వీరానాయక్ హెచ్చరించారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో సోమవారం



పలు వాహనాలను తనిఖీ చేశారు. వాహన చోదకులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, శిరస్త్రాణం(హెల్మెట్) ధరించాలన్నారు. నిబంధనలు పాటించనివారిపై జరిమానాలను విధించడంతోపాటు అవసరమైన కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. మరీ ముఖ్యంగా మైనర్లు ఎక్కువ మంది వాహనాలను నడుపుతున్నారని, మైనర్లకు వాహనాలను ఇస్తే వారి తల్లిదండ్రులను పిలిపించి బాధ్యులను చేస్తామన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ఆటోలు నడిపేవారు కూడా పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకుంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. అదేవిధంగా ఆటోలలో పెద్ద సౌండ్ సిస్టం పెట్టి వెనుక వచ్చే వాహనాలను పట్టించుకోవడం లేదన్నారు. దీని వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆటోవాలాలు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఆధునిక బోధనా పద్ధతులపై లోతైన అవగాహన అవసరం

### -ప్రొఫెసర్ బాలగణపతి దేవరకొండ

పొన్నూరు, మే 19, ప్రభాతవార్త: అధ్యాపకులకు పరిశోధన, డేటా విశ్లేషణ, అకడమిక్ రచన, పాలసీ అనుసంధానంతోపాటు ఆధునిక బోధనా పద్ధతులపై లోతైన అవగాహన అవసరమని యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీలోని ఫిలాసఫీ ప్రొఫెసర్ బాలగణపతి దేవరకొండ అన్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్) ఆర్థిక సౌజన్యంతో చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ విభాగంలోని డిపార్టుమెంట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ అదర్ ఇండియన్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్



ఆధ్వర్యంలో ఏ టూ వీక్ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఫ్యాకల్టీ ఇన్ సోషల్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్ ఆన్ ఎన్‌హ్యాన్సింగ్ మెథడోలాజికల్ ఎక్స్‌పర్టైజ్ అండ్ టెక్నాలజికల్ అడాప్షన్ అనే అంశంపై రెండు వారాలపాటు జరగనున్న కెపాసిటీ బిల్డింగ్ వర్క్‌షాప్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీలోని ఫిలాసఫీ ప్రొఫెసర్ బాలగణపతి దేవరకొండ మాట్లాడుతూ గుణాత్మక- పరిమాణా త్మక పద్ధతులపై శిక్షణతోపాటు కేస్ స్టడీ, ఫీల్డ్ రిసెర్చ్ విధానాలపై మెథడాలజికల్ ట్రైనింగ్ అవసరమన్నారు. కొత్త సాఫ్ట్‌వేర్‌లపై ప్రాక్టికల్ ట్రైనింగ్, డేటా విజువలైజేషన్ టెక్నిక్స్‌ను అధ్యాపకులందరూ నేర్చుకోవాలన్నారు. రీసెర్చ్ ఆర్టికల్స్ నిర్మాణం, ప్లాగరిజం నివారణ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురణకు ప్రామాణిక ప్రమాణాలపై తగిన సూచనలు అందించారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా హాజరైన గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఎన్ఐసి మాజీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీఎస్ఆర్ ప్రభు మాట్లాడుతూ విద్యారంగ మార్పుల గురించి, డిజిటల్ సాధనాల వినియోగం, సమాజంపై పరిశోధనల ప్రభావం వంటి అంశాలపై ప్రసంగించారు. నేటి విద్యావాతావరణంలో సామాజిక శాస్త్రాలు, మానవిక శాస్త్రాల్లో పరిశోధన,బోధన అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అధ్యాపకుల పద్ధతి శాస్త్ర నైపుణ్యాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపచడం అత్యంత అవసరమన్నారు. ఈ కార్యక్రమం అధ్యాపకులు పరిశోధనా పనితీరు, బోధనా వ్యూహాలు, సాంకేతిక టూల్స్ వాడకంలో మేధస్సుతో కూడిన అభివృద్ధిని సాధించేలా ఉపయోగపడుతుంది. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వీసి పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

## కిడ్నీ ప్రభావిత మండలానికి కృష్ణా జలాలు అందేనా

ఎ కొండూరు, మే 19, ప్రభాతవార్త : భారత కమ్యూనిస్ట్ పార్టీ ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండల రెండో మహాసభ కామ్రెడ్ దాడి ఆదినారాయణ అధ్యక్షతన ఎ కొండూరు మోహన్



గార్డెన్స్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలో సిపిఐ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కామ్రెడ్ దోనేపూడి శంకర్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎ కొండూరు కిడ్నీ ప్రభావిత తండా గ్రామాలు ఇంకా మండల ప్రాంతంలో మే నెలాఖరుకి కృష్ణాజలాలు జలజీవన్ పథకం కింద అందిస్తామని ఇచ్చిన హామీ నేటివరకు కృష్ణాజలాల పైప్‌లైన్ పనులు పూర్తికాలేదని ఈ పైప్‌లైన్ పనులు నాసిరకంగా నత్తనడకన జరుగుతున్నాయని కామ్రెడ్ దోనేపూడి శంకర్ విమర్శించారు. సిపిఐ పార్టీ పోరాట ఫలితంగానే ఎ కొండూరు నుండి విజయవాడ కలెక్టరేట్ వరకు కిడ్నీ రోగులు, ఇంకా ఇతర వర్గల ప్రజల ఆధ్వర్యంలో 3 రోజుల పాటు పాదయాత్ర నిర్వహించి అప్పటి కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించగా సిఎం చంద్రబాబు నుండి హామీ పొందిన తర్వాత పోరాటం చేసిన ఎ కొండూరుకు కృష్ణాజలాల పైప్‌లైన్ పనులు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించే విధంగా సిపిఐ ఘనతేనని శంకర్ తెలిపారు. ఇకనైనా వెంటనే కృష్ణాజలాల పైప్‌లైన్ పనులు నాణ్యత ప్రమాణంగా జరిపి వెంటనే కృష్ణావాటర్ ఇంటింటి కుళాయిలకు సరఫరా చేసి ఆదుకోవలని శంకర్ డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు టి కృష్ణయ్య నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కె నాగుల్‌మీరా, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల డేవిడ్ తదితరులు పాల్గొన్నారు. పసుపులేటి రామారావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు.

## టొయోటా కిర్లోస్కర్ మెగా సమ్మర్ సెలబ్రేషన్స్

విజయవాడ, మే 19, ప్రభాతవార్త : తమ మెగా సమ్మర్ సెలబ్రేషన్‌ను ప్రారంభించినట్లు టొయోటా కిర్లోస్కర్ మోటార్స్ ప్రతినిథులు ప్రకటించారు. దక్షిణ భారతంలోని అధీకృత డీలర్‌షిప్‌ల్లో అందిస్తామన్నారు. కస్టమర్ ఫస్ట్ సిద్ధాంతానికి కట్టుబడి కొత్తకారు కొనడం, వున్న కార్లకు సర్వీసింగ్, సర్టిఫైడ్ యూజ్డ్ కార్‌ను గుర్తించి లేదా వాహన ఉపకరణాలను అప్‌గ్రేడ్ చేయడం, ఆకర్షణీయమైన డీల్‌ను పొందవచ్చున్నారు.

## సాయిబాబా మందిరం స్థలం రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయాలి

### -చేబ్రోలు గ్రామస్తులు అర్జీలు దాఖలు

పొన్నూరు, మే 19, ప్రభాతవార్త: మండల కేంద్రమైన చేబ్రోలులో వేంచేసియున్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరానికి సంబంధించిన డి.నెం.309/1లో సుమారు 1500చదరపు గజముల స్థలాన్ని విజయవాడ పరిసర ప్రాంతాల రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకొనేందుకు ఓ వ్యక్తి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసిందని, సదరు రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేయాలని కోరుతూ చేబ్రోలు తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్, పోలీస్టేషన్లలో అర్జీలు



దాఖలు చేశారు. సదరు స్థలం శ్రీ షిరిడి సాయిబాబా మందిరానికి కేతరాజు నరసింహారావు 1995లో ద.నెం.2270/1995గా గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసినట్లు అర్జీలో తెలిపారు. కనుక సదరు స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ నిలుపుదల చేయాలని కోరుతూ అర్జీలను అందజేశారు. అర్జీ అందజేసినవారిలో విద్యాసాగర్, కె.సాయిరామ్, కట్టుపల్లి కోటయ్య, విఆర్ గుప్తా తదితరులున్నారు.

# జూన్ 1నుండి సినిమాల ప్రదర్శనలు నిలిపేస్తే ఎలా?

తెనాలి, మే 19 ప్రభాతవార్త : జూన్ 1నుండి రెండు తెలుగు రాష్ట్రాలలో సినిమా ప్రదర్శనలను నిలిపివేయాలని ఎగ్జిబిటర్లు తాజాగా నిర్ణయం తీసుకోవడం పట్ల మా ఏపి వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మా ఏపి వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక మా ఏపి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడుతూ సినీ పరిశ్రమ పెద్దలు సినిమా ఎగ్జిబిటర్లతో చర్చలు జరపాల్సిందిగా ఆయన కోరారు. లేదంటే ప్రజలకు వినోదం దూరం అవుతుందన్నారు. అద్దెలపై కాకుండా పర్సెంటెజీలు చెల్లిస్తేనే ఇకపై



సినిమాలను ప్రదర్శిస్తామనే ఎగ్జిబిటర్ల డిమాండ్‌పై ఇరువర్గాలతో సంప్రదించి సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపవలసిందిగా ఆయన మనవి చేశారు. సినిమాను ప్రదర్శించినందుకు డిస్ట్రిబ్యూటర్లు ప్రస్తుతం ఎగ్జిబిటర్లకు గ్రామాల్లో రెజుకి రూ.3500లు, మునిసిపాలిటీల్లో రూ.12000 నుండి రూ.15000, జిల్లా కేంద్రంలో రూ.20000లకు అద్దెలను చెల్లిస్తున్న నేపథ్యంలో ప్రతి ప్రదర్శనకు పబ్లిసిటీ క్యూబ్ పర్సెంటేజీలకు పోను ఇక నిర్మాతలకు ఏం మిగులుతుందని ఆయన ప్రశ్నించారు. నిర్మాతల్లో అందరూ స్వయంగా తమ సినిమాలను విడుదల చేయకోలేరని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే చిన్న సినిమాలకు థియేటర్లు లభించక, ఓటీటీ ప్లాట్ ఫామ్ ఆంక్షలు తట్టుకోలేక నిర్మాతలు మానసిక ఆందోళనలో ఉన్నారని ఆయన తెలిపారు. దీనిపై తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ తీసుకుని మధ్య వర్తిత్వం చేసి న్యాయబద్ధంగా పరిష్కారం చేయడం సముచితమని దిలీప్‌రాజా అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికే సగం ప్రేక్షకులు టీవీలకు అతక్కుపోయినందు వలన థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. జూన్ 1నుండి సినిమా ప్రదర్శనలను బంద్ చేస్తే ప్రేక్షకులు పూర్తిగా థియేటర్లను మర్చిపోయే ప్రమాదం లేకపోలేదని ఆయన జోస్యం చెప్పారు. సమావేశంలో మా ఏపి సభ్యులు అమీర్‌చౌదరి, బసవరత్న పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన

కొల్లూరు, మే 19 ప్రభాతవార్త : మండలంలోని క్రాప గ్రామంలో రెండవ రోజు జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి పోటీ లాగుడు ఎడ్ల పందాలు సోమ వారం సీనియర్స్ విభాగంలో గెలుపొందిన విజేతలకు రూ.40వేలు నగదు బహుమతి,



మెమోంటోను నిర్వాహకులు, కమిటీ సభ్యులు రవితేజతో కలిసి కొల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సుంకర రామ్మోహన్‌బాబు, కాసరనేని మోహన్, గద్దె నాగేశ్వరరావు, సూర్యదేవర పసి, కొల్లూరు మండల క్రాప గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రైతులు పాల్గొన్నారు.

## పరిష్కార వేదికలో 89 ఫిర్యాదులు

విజయవాడ క్రైం,మే 19,ప్రభాతవార్త: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనర్ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఎబిటిఎస్ ఉదయరాణి,డిసిపిలు కృష్ణమూర్తి నాయుడు తదితరులు ప్రజా సమస్యలకు సంబంధించి 89 ఫిర్యాదులను అందుకున్నారు.



దివ్యాంగులు,వృద్ధుల వద్దకు వారే స్వయంగా వెళ్ళి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకొని వాటిని త్వరగా పరిష్కరించాలని ఫోన్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి ఆదేశాలు జారీ చేశారు. నేడు అందిన ఫిర్యాదుల్లో భూ వివాదాలకు,ఆస్థి వివాదాలకు,నగదు లావాదేవీలకు సంబంధించి-42,భార్యభర్తలు,కుటుంబ కలహాలకు సంబంధించి-09,మహిళా సంబంధిత నేరాలకు సంబంధించి-7,చోరీలకు సంబంధించి-2,కొట్లాటలకు సంబంధించి-7,సైబర్ నేరాలకు సంబంధించి-3,ఇతర చిన్న చిన్న వివాదాలు,సమస్యలు,సంఘటనలకు సంబంధించి-19 ఫిర్యాదులను అందుకున్నారు.

## హోం గార్డు కుటుంబానికి ఆర్థిక సహాయం

విజయవాడ క్రైం,మే 19,ప్రభాతవార్త: నగరంలో పనిచేస్తున్న హోం గార్డులు ఎవరైనా మరణించినా,పదవీ విరమణ చేసినా వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా చేయడానికి నగరంలో



పనిచేస్తున్న హోంగార్డులందరూ స్వచ్ఛందంగా వారికి వచిప్చే వేతనం నుండి నగదు చనిపోయిన హోంగార్డు కుటుంబాలకు లేదా పదవీ విరమణ చేసిన హోంగార్డులకు ఆర్థిక ఆసరా కల్పిస్తున్న నేపథ్యంలో హోంగార్డు పి.శ్రీమన్నారారాయణ విజయవాడ నగర హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వహిస్తూ బ్రైన్ స్ట్రోక్‌తో మరణించారు. మరణించిన హోంగార్డు శ్రీమన్నారాయణ కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ.5 లక్షల నగదు చెక్కును సోమవారం సిపి కార్యాలయంలో ఎస్ వి రాజశేఖరబాబు చేతుల మీదుగా శ్రీమన్నారాయణ భార్య పి.నరసమ్మకు తన చేతుల మీదుగా అందచేశారు. అడ్మిన్ డిసిపి కెజివి సరిత,హోంగార్డు ఆర్ఐ కె.సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి యూత్ నేత 'రాడ్డు''రేజా'ల అరెస్ట్

### - తిరువూరు నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక నేపధ్యం

ఎ కొండూరు, మే 19, ప్రభాతవార్త :ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక సందర్భంగా తిరువూరులో వైసిపి టిడిపి మధ్య ఏర్పడిన ఉద్రిక్త వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఎ కొండూరు ఎంపిపి కాలసాని నాగలక్ష్మి భర్త మండల వైసిపి యూత్



అధ్యక్షుడు కాలసాని చెన్నారావు (రాడ్డు) మరో వైసిపి నేత చిమట రామకృష్ణ (రేజా) తిరువూరు వెళ్లకుండా ఎ కొండూరు పోలీసులు సోమవారం ఉదయం కంభంపాడులో అరెస్ట్ చేసి 2 కి.మీ దూరంలో ఉన్న ఎ కొండూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం వరకు పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టి అనంతరం సెల్ఫ్ బెయిల్‌పై విడుదల చేశారు. వీరి అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ అనేక మంచి మండలంలోని ఎంపిటిసి మెంబర్లు సర్పంచ్‌లు కోఆపరేటివ్ సొసైటీల మాజీ చైర్‌పర్సన్‌లు వైసిపి శ్రేణులు, నాయకులు, వీరిని స్టేషన్‌లో పరామర్శించి ధైర్యం చెప్పారు.

## సాగర్ మైలవరం బ్రాంచ్ కెనాల్ షట్టర్లు వంతెన రైలింగ్స్ మరమత్తులు చేయాలి

ఎ కొండూరు, మే 19, ప్రభాతవార్త : నాగార్జున సాగర్ మైలవరం బ్రాంచ్ కాల్వపై ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం కృష్ణారావుపాలెం 13వ కి.మీ రెగ్యులేటర్ షట్టర్లు అలాగే చీమలపాడులో



వెల్వడం మేజర్ కాల్వపై వంతెన సైడ్ రెయిలింగ్స్ కూలిపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మైలవరం బ్రాంచ్ కెనాల్ 13కి.మీ వద్ద తప్పుపట్టి పాడైన రెగ్యులేటర్ షట్టర్ల స్థానంలో కొత్త షట్టర్ల స్థానంలో కొత్త షట్టర్లు చేయాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## విజయవాడ ఆటోనగర్లో ఉచిత కార్మిక పాఠశాల

విజయవాడ, మే 19, ప్రభాతవార్త : కార్మికులకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి విజయవాడ ఆటోనగర్లో టెక్నీషియన్స్ అసోసియేషన్ వద్ద కార్మిక పాఠశాలను సోమవారం డా గోపాలం శివన్నారాయణ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా



ఎపిఎంఎస్ఎంఇ గౌరవాధ్యక్షులు బాయన వెంకట్రావ్, ఏటిఎ ప్రెసిడెంట్ రాజనాల బాబ్జి, ది విఐఇఎంఎ కార్యదర్శి టివి నాగేశ్వరరావు పాల్గొని ప్రసంగిస్తూ కార్మికులు ఉచిత శిక్షణ ను అందుకోవాలన్నారు. పది, ఇంటర్, డిగ్రీ ప్రైవేటుగా చదివే అవకాశంతోపాటు కంప్యూటర్ శిక్షణ, ప్రాథమిక శిక్షణ, పర్సనాలిటి డెవలెప్‌మెంట్ శిక్షణ ఉచితంగా అందిస్తామన్నారు. రావెళ్ల లక్ష్మణరావు, ముఖ్య నిర్వహకులు ఆర్ రఘు, తో పాటు ప్రొ బి శ్రీనివాసరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఒక్క టీం గెలుపుతో.. మారిన ప్లేఆఫ్స్

## కీలకమవుతోన్న ఒక్కో మ్యాచ్







**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపిఎల్)-2025, సీజన్ 18 రానురాను మరింత ఉత్కంఠ భరితంగా మారుతోంది. ప్లేఆఫ్స్ అర్హత కోసం ఒక్కో మ్యాచ్ కీలకంగా మారుతుంది. వివిధ జట్ల విజయం ఇతర టీమ్‌రూట్‌ను ప్రభావితం చేయడంతో ఈ సీజన్ చివరి దశలకు చేరే విషయమై ఆసక్తికరమవుతోంది. ఐపిఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ అద్భుత విజయాన్ని సాధించి ప్లేఆఫ్స్‌కు అర్హతపొందింది. ఢిల్లీ క్యాపిటల్స్‌పై జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ బలమైన ఆటతీరు ప్రదర్శించి, భారీ టార్గెట్ అయిన 200 పరుగులను ఛేదించి విజయాన్ని అందుకుంది. ఈ విజయానికి ప్రధాన కారణంగా శుభ్‌మాన్ గిల్, సాయి సుదర్శన్ జోడి నిలిచారు. వీరిద్దరూ నిరంతరం జట్టుకు స్థిరతను అందిస్తూ ఢిల్లీ బౌలింగ్ దాడిని ధ్వంసం చేశారు. ఈ విజయంతో గుజరాత్ తన ఖాతాలో 18 పాయింట్లను చేరేసుకుని టోర్నమెంట్ ప్లేఆఫ్స్‌లోకి అడుగుపెట్టింది. ఇప్పటి వరకు 12 మ్యాచ్‌ల్లో 9 విజయాలను నమోదు చేసిన గుజరాత్, టేబుల్ లోపై భాగానికి చేరింది. ఈ విజయం గుజరాత్ టైటాన్స్‌కేకాకుండా రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు, పంజాబ్ కింగ్స్ జట్లకు కూడా ఎంతో ప్రయోజనాన్ని అందించింది. గుజరాత్ విజయంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు, పంజాబ్ కింగ్స్ జట్లు కూడా తమ నెట్ రన్‌రేట్ ఆధారంగా 17 పాయింట్లతో ప్లేఆఫ్స్ రేసులో కొనసాగుతున్నాయి. ఇప్పుడు ఈ మూడు జట్లు టాప్ 2 స్థానాల కోసం పోటీ పడనున్నాయి. వాటికి మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి, దీంతో లీగ్ మరింత ఉత్కంఠ భరితంగా మారింది. ఇక ఢిల్లీక్యాపిటల్స్ విషయానికొస్తే, ప్రస్తుతం వారు 13 పాయింట్లతో నిలిచారు. తమ మిగిలిన రెండు మ్యాచ్‌లు గెలిచినా సరే, వారి పేలవమైన నెట్ రన్‌రేట్ కారణంగా ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంలో క్లిష్టత ఉంది. ఇది వారిని ఆందోళనకు గురిచేసే అంశంగా మారింది. మరో వైపు, ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ ఆశలను కొనసాగించాలంటే మిగిలిన రెండు మ్యాచ్‌లను తప్పనిసరిగా గెలవాలి. ప్రస్తుతం ఖాతాలో 14 పాయింట్లు ఉన్నాయి. మరో రెండు విజయాలతో ఈ టీమ్ కూడా 18 పాయింట్లకు చేరుకొని, ప్లేఆఫ్స్‌కు అర్హతపొందే అవకాశాన్ని సాధించగలదు. అయితే, ఒక మ్యాచ్‌ఓడిపోతే వారు తీవ్రమైన ఒత్తిడికి లోనవడం ఖాయం. ఈ నెల 21న జరగనున్న ముంబైఇండియన్స్-ఢిల్లీక్యాపిటల్స్ మ్యాచ్ ఐపిఎల్ 2025 ప్లేఆఫ్స్‌కు అర్హత పొందే నాలుగో జట్టును నిర్ణయించగల కీలకమైన పోరాటంగా మారనుంది. ఈమ్యాచ్ ఫలితం లీగ్ టేబుల్‌నుపూర్తిగా మార్చివేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ ఐపిఎల్ 18 సీజన్ మరింత ఉత్కంఠభరితంగామారి, ఒక్కో మ్యాచ్ ప్లేఆఫ్స్ అర్హతకోసం కీలకంగా మారింది.

## ఎటిపి ఛాలెంజర్స్‌లో.. రన్నరప్‌గా భాంబ్రి, గాలోవే జోడీ



**న్యూఢిల్లీ:** యుకీ బాంబ్రీ-రాబర్ట్ గాల్లోవే జోడీ తమ బోర్డియక్స్ ఎటిపి ఛాలెంజర్ ప్రచారాన్ని రన్నరప్‌గా ముగించింది. ఫైనల్లో ఈ జంట పోర్చుగల్‌కు చెందిన ఫ్రాన్సిస్కో కాబ్రాల్ మరియు ఆస్ట్రియాకు చెందిన లూకాస్ మిడ్లర్‌లతో గట్టి పోటీని ఇచ్చింది. రెండో సీడ్ ఇండో అమెరికన్ జంట 6-7, 6-7 తేడాతో పోర్చుగల్‌కు చెందిన నాల్గవ సీడ్ ఫ్రాన్సిస్కో కాబ్రాల్ మరియు ఆస్ట్రియాకు చెందిన లూకాస్ మిడ్లర్ జంట చేతిలో ఓడిపోయింది.

బోర్డియక్స్‌లో జరిగిన ఎటిపి ఛాలెంజర్ ఈవెంట్ టైటిల్ పోరులో భారతదేశానికి చెందిన యుకీ భాంబ్రీ మరియు అతని అమెరికన్ భాగస్వామి రాబర్ట్ గాల్లోవే హోరాహోరీగా పోరాడి, రన్నరప్‌గా నిలిచారు. అంతకు ముందు ఈ నెల 17న జరిగిన గంటా ఎనిమిద నిముషాల్లో బాంబ్రీ-రాబర్ట్ జంట ఫ్రాన్స్‌కు చెందిన క్వెంటిన్ హాలిస్-అల్బానో ఒలివెట్టి జంటను 7-5, 6-3 తేడాతో ఓడించింది. ఫ్రెంచ్ ద్వయాన్ని ఓడించిన తర్వాత డబుల్స్ సెమీఫైనల్‌లో బ్రెజిల్‌కు చెందిన రాఫెల్ మాటోస్-మార్సెలో మెలోలను ఓడించారు. ఇక భారతదేశానికి చెందిన ఎన్ శ్రీరామ్ బాలాజీ మరియు సుమిత్ నాగల్ కూడా ఎటిపి 175 క్లే కోర్ట్ టోర్నమెంట్‌లో భాగమయ్యారు, కానీ ఇద్దరూ తమ తమ ఈవెంట్లలో ముందుగానే నిష్క్రమించారు.

## టర్కిష్ టైటిల్ గలాటసారే కైవసం



**న్యూఢిల్లీ:** నైజీరియా స్ట్రైకర్ విక్టర్ ఒసిమ్హెన్ గలాటసారే రెండు ఆటలు మిగిలి ఉండగానే ప్రతిష్టాత్మక 25వ టర్కిష్ టైటిల్‌ను సాధించాడు. కైసెరిస్పోర్‌లో సోమవారం మోరిన్హోకు చెందిన ఫెనర్‌బాషేతో జరిగిన పోరులో 3-0 తేడాతో గలాటసారే గెలుపొందాడు. ఇంకా రెండు ఆటలు మిగిలి ఉండగానే ఈ 25వ టర్కిష్ టైటిల్‌ను చేజిక్కించుకున్నాడు. ఈ విజయం గలాటసారేకు చిరకాల ప్రత్యర్థి ఫెనర్‌బాషేపై ఎనిమిది పాయింట్ల ఆధిక్యాన్ని అందించింది. ఆ జట్టు దశాబ్ద కాలంగా ఒక్కసారి కూడా లీగ్ గెలవలేదు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే నైజీరియా స్ట్రైకర్ విక్టర్ ఒసిమ్హెన్ 26వ నిమిషంలో మొదటి గోల్ సాధించగా, మూడు నిమిషాల తర్వాత మొదటి అర్ధభాగంలో టర్కిష్ వింగర్ బారిస్ ఆల్పర్ యిల్మాజ్ ఆ గోల్ చేశాడు. రెండవ అర్ధభాగంలో గోల్ కీపర్ ఫెర్నాండో ముస్లెరా పెనాల్టీతో మూడో గోల్ జోడించాడు, ఇస్తాంబుల్‌లో గలాటసారే విజయాన్ని ఖాయం చేశాడు.

ఈ సీజన్‌లో బెసిక్టాస్‌తో జరిగిన ఒకే ఒక లీగ్ గేమ్‌లో గలాటసారే ఓడిపోయింది. వారు 87 గోల్స్ చేసి 31 గోల్స్ ఇచ్చారు. కాగా ఈ సీజన్‌లో రెండు ఇస్తాంబుల్ క్లబ్‌లు ఇతర టర్కిష్ సూపర్ లీగ్ జట్ల కంటే ముందు వరుసలో ఉన్నాయి. దీంతో గలాటసారే 89 పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకోగా, ఆదివారం ఐయుప్‌స్పోర్‌తో జరిగిన మ్యాచ్‌లో 2-1 తేడాతో ఓడించిన ఫెనర్‌బాషే తాజాగా గలాటే చేతిలో ఓటమి చెందడంతో ప్రస్తుతం అతని ఖాతాలో 81 పాయింట్లు ఉన్నాయి. ఇక శామ్‌సన్‌స్పోర్ 60 పాయింట్లతో మూడవ స్థానంలో ఉన్నాడు.



## మహిళల ఆసియా కప్‌కు గుడ్‌బై

### పాక్ వైఖరితో భారత్ కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ:** పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాల మధ్య ఇటీవల ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బిసిసిఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఎసిసి)కు పాకిస్తాన్ అంతర్గత మంత్రి మరియు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధిపతి అయిన మొహ్సిన్ నఖ్వీ అధ్యక్షత వహిస్తున్నారు. దీంతో అన్ని ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఈవెంట్‌ల నుండి వైదొలగుతోంది. వచ్చే నెలలో శ్రీలంకలో జరగనున్న మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ నుండి భారతదేశం అధికారికంగా వైదొలగడంతో, ఈ నిర్ణయాన్ని ఇప్పటికే ఆసియా క్రికెట్ కౌన్సిల్‌కు తెలియజేయడం జరిగింది. అలాగే దీంతో పాటు, సెప్టెంబర్‌లో భారత్ వేదికగా జరగాల్సిన ద్వైవార్షిక పురుషుల ఆసియా కప్‌పై ఇంకా తుది నిర్ణయం తీసుకోనప్పటికీ, టోర్నమెంట్ భవిష్యత్తు ఇప్పుడు అంధకారంగా కనిపిస్తోంది. ఈ టోర్నమెంట్ నుండి కూడా భారత్ వైదొలగాలని భావిస్తోంది. క్రికెట్‌కు సంబంధించి పాకిస్తాన్‌ను ఒంటరి చేయడమే లక్ష్యంగా భారత్ ఈ చర్యలకు ఉపక్రమించింది. ఇక పురుషుల ఆసియా కప్‌లో భారతదేశం, పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ మరియు శ్రీలంక జట్లు పాల్గొంటున్నాయి. 2023 ఫైనల్‌లో శ్రీలంకను ఓడించి భారతదేశం డిఫెండింగ్ ఛాంపియన్‌గా నిలిచింది. ఆ ఎడిషన్ కూడా భారతదేశం పాకిస్తాన్ ఉద్రిక్తతలతో దెబ్బతింది. మొదట్లో పూర్తిగా పాకిస్తాన్ ఆతిథ్యం ఇవ్వాలని నిర్ణయించినప్పటికీ, భారతదేశం సరిహద్దు దాటి ప్రయాణించడానికి నిరాకరించడంతో, దాని అన్నిమ్యాచ్‌లు శ్రీలంకకు మారడంతో ఈ టోర్నమెంట్‌ను హైబ్రిడ్ మోడల్‌లోకి మార్చారు. ఇప్పుడు భారత్ పురుషుల ఆసియా కప్‌ను బాయ్‌కట్ చేయనుండటంతో ఈ టోర్నీపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ ఆసియా కప్‌లో భారత్ పాల్గొనకపోతే టోర్నీ జరగడం దాదాపుగా అసాధ్యం. అంతర్జాతీయ ఈవెంట్లకు స్పాన్సర్లలో ఎక్కువ మంది భారత్‌కు చెందిన వారే ఉండటంతో ఈ టోర్నీపై నీలి నీడలు కమ్ముకున్నాయి.

## ఇటాలియన్ ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్ అల్కరాజ్

### వరల్డ్ నంబర్ వన్ సిన్నర్ 7-6తో సంచలన ఓటమి



**న్యూఢిల్లీ:** ఇటాలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో స్పెయిన్‌కు చెందిన కార్లోస్ అల్కరాజ్ ఛాంపియన్‌గా నిలిచాడు. రోమ్‌లోని ఫోరో ఇటాలికోలో సోమవారం జరిగిన ఇటాలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో అల్కరాజ్ తన ప్రత్యర్థి జానిక్ సిన్నర్‌ను 7-6 (7/5), 6-1 తేడాతో ఓడించి ట్రోఫీని గెలుచుకున్నాడు. దీంతో సిన్నర్ తర్వాత ప్రపంచ నంబర్ టూ స్థానాన్ని అల్కరాజ్ చేరుకున్నాడు. ఈ వారాంతంలో ప్రారంభమయ్యే ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు సీజన్‌లో ఇటాలియన్ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో విజయం సాధించే సమయానికి మూడవ టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఇటాలియన్ ఓపెన్‌లో ఛాంపియన్‌గా నిలవడంతో ఈ స్పానియార్డ్ సీజన్‌లో సిన్నర్ తన నాలుగో ఫైనల్‌లో విజయాన్ని సాధించాడు. కాగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో సిన్నర్ అగ్రస్థానంలో ఉన్నాడు, కానీ అతని 26 మ్యాచ్‌ల విజయ పరంపరను అల్కరాజ్ ముగించాడు, గత సంవత్సరం చైనా ఓపెన్ ఫైనల్‌లో అతనిని ఓడించిన చివరి వ్యక్తి కూడా అల్కరాజ్ కావడం విశేషం. అలాగే 2024 ప్రారంభం నుండి తన ఇటాలియన్ ప్రత్యర్థి పురుషుల టెన్నిస్ మరియు మూడు గ్రాండ్ స్లామ్ టైటిళ్లలో అగ్రస్థానానికి ఎదగడం ప్రారంభించినప్పటి నుండి టూర్ ఫైనల్‌లో సిన్నర్‌ను ఓడించిన ఏకైక వ్యక్తి అల్కరాజ్‌గా నిలిచాడు.

# వాణిజ్యం

## సుప్రీంకోర్టులో టెల్కోలకు చుక్కెదురు



**ముంబై, మే 19:** టెలికాం సంస్థలకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. సర్దుబాటు చేసిన స్థూల రాబడి బకాయిల నుంచి ఊరట కల్పించాలంటూ టెలికాం కంపెనీలు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. దీంతో వొడాఫోన్ ఐడియా షేర్లు కుప్పకూలాయి. సోమవారం ఇంట్రాడేలో వీఐ షేర్లు 10 శాతం క్షీణించాయి. మధ్యాహ్నం 1:50గంటల సమయంలో ఎన్ఎస్ఈలో షేర్లు 8.28 శాతం నష్టంతో కదలాడుతున్నాయి. ఏజీఆర్ బకాయిలపై వడ్డీ, పెనాల్టీలు, పెనాల్టీలపై వడ్డీ నుంచి తమకు మినహాయింపు కల్పించాలని టెలికాం సంస్థలు వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్ టెల్, టాటా టెలీ సర్వీసెస్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటిషన్ ను కొట్టి వేసింది. ఈ నిర్ణయం తో టెలికాంసంస్థలపై భారం పడనుందన్న భయంతో షేర్లు ఒత్తిడికి గురయ్యాయి.

## టాటా కుటుంబేతరుల్లో అత్యధిక వాటా దత్తాకే..

**ముంబై, మే 19:** దివంగత పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా వీలునామాకు సంబంధించి కీలక పరిణామం చోటు చేసుకుంది. రతన్ టాటాకు అత్యంత సన్నిహితుడు, తాజ్ గ్రూప్ హోటళ్ల మాజీ డైరెక్టర్ అయిన మోహినీ మోహన్ దత్తా, వీలునామాలోని షరతులకు అంగీకరించినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం వెల్లడించింది. టాటా మిగులు ఆస్తిలో మూడో వంతు భాగాన్ని దత్తాకు కేటాయించారు. దీని విలువ సుమారు రూ.588 కోట్లు ఉంటుందని అంచనా. మోహినీ దత్తా తన సమ్మతిని తెలియజేయడంతో, టాటా వీలునామా ఎగ్జిక్యూటర్లు బాంబే హైకోర్టు నుంచి ప్రొబేట్ (వీలునామా ధృవీకరణ) పొందే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడానికి మార్గం సుగమమైంది. సుమారు ఇరవై మందికిపైగా ఉన్న లబ్ధిదారులలో, 77ఏళ్ల దత్తా మాత్రమే తన వాటా విలువకు సంబంధించి ఆందోళన వ్యక్తంచేశారు. రతన్ టాటా మిగులు ఆస్తిలో (స్థిరాస్తులు, షేర్‌హోల్డింగ్‌లు మినహా) మిగిలిన మూడింట రెండు వంతుల భాగాన్ని ఆయన సోదరీమణులు షిరీన్ జెజీభాయ్ (72), డయానా జెజీభాయ్ (70)లకు కేటాయించారు. వీరిద్దరూ వీలునామాకు ఎగ్జిక్యూట ర్లుగా కూడా వ్యవహరి స్తున్నారు. తనకు దక్కాల్సిన వారసత్వ ఆస్తి విలువ విషయంలో ఎగ్జిక్యూటర్లతో దత్తా విభేదించినప్పటికీ, ఆయన వీలునామాను అధికారికంగా సవాలు చేయలేకపోయారు. వీలునామాలోని నోకాంటెస్ట్ క్లాజ్ (వివాద రహిత నిబంధన) ఇందుకు కారణం. ఈ నిబంధన ప్రకారం, ఎవరైనా లబ్ధిదారుడు వీలునామా షరతులను వ్యతిరేకిస్తే, వారు తమ వాటాను కోల్పోయే ప్రమాదం ఉంటుందనికథనం పేర్కొంది. ఎగ్జిక్యూటర్లు మార్చి 27న వీలునామా ప్రొబేట్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. అంగీకారం తెలపని చట్టబద్ధమైన వారసుల నుంచి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరుతూ పబ్లిక్ నోటీసు జారీచేయాలని బాంబే హైకోర్టు వారిని ఆదేశించింది. ఏప్రిల్ 9న, వీలునామా మరియు దాని లబ్ధిదారులకు సంబంధించిన విషయాలను పరిష్కరించడానికి ఉపయోగించే చట్టపరమైన యంత్రాంగమైన ఆరిజినేటింగ్ సమన్లను కూడా వారు దాఖలుచేశారు. టాటా కుటుంబం వెలుపల ఇంత పెద్ద మొత్తంలో వాటా పొందిన ఏకైక లబ్ధిదారుడు దత్తానే కావడం గమనార్హం. తనకు కేటాయించిన గణేష్ విగ్రహంతో సహా పలు విలువైన వస్తు వులను పరిశీలించాలని దత్తా కోరినప్పటికీ, కొలాబాలోని టాటా హలేకై నివాసంలోకి ఆయనకు ప్రవేశం నిరాకరించారు. ప్రస్తుతం టాటా వ్యక్తిగత వస్తువులన్నీ ఎగ్జిక్యూటర్ల ఆధీనంలో ఉన్నాయని నివేదిక తెలిపింది.





## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబై, మే 19:** దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణతో సూచీలు నష్టాలు చవిచూశాయి. ముఖ్యంగా ఐటీ షేర్లు ప్రధానంగా నష్టాలు మూటగట్టుకున్నాయి.ఐటీ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ఐటీ కంపెనీలకు అమెరికా నుంచే ప్రధానంగా ఆదాయం వస్తుండడమే ఇందుక్కారణం. ఈ క్రమంలో నిఫ్టీ 25 వేల దిగువకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 82,354.92 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా ఓ మోస్తరు శ్రేణిలో కదలాడింది. ఇంట్రాడేలో 81,964.57 82,424.10 పాయింట్ల మధ్య కదలాడిన సూచీ, చివరికి 271.17 పాయింట్ల నష్టంతో 82,059 వద్ద ముగిసింది. నిఫ్టీ 74.35 పాయింట్ల నష్టంతో 24,945.45 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.40గా ఉంది. ఎటర్నల్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా, రిలయన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్ ఫైనాన్స్, ఎన్టీపీసీ, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సూచీలు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64.72 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు 3239 డాలర్ల వద్ద ట్రేడయింది.

## యూకో బ్యాంకు మాజీ సిఎండి అరెస్ట్



**ముంబై, మే 19:** యూకో బ్యాంక్ మాజీ సీఎండీ సుబోధ్ కుమార్ గోయల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అరెస్టు చేసింది. కాన్‌కాస్ట్ స్టీల్‌అండ్ పవర్ లిమిటెడ్‌కు రుణాల మంజూరులో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ఆయన్ని అదుపులోకి తీసుకుంది. సుబోధ్ కుమార్ గోయల్ యూకో బ్యాంక్ సీఎండీగా ఉన్న సమయంలో సీఎస్‌పీఎల్‌కు పెద్దఎత్తున నిధుల్ని మంజూరుచేశారు. ఇలా మంజూరైన రూ.6,210.72కోట్లను ఆ సంస్థ దుర్వినియోగం చేసిందని సీబీఐ దర్యాప్తులో తేలింది. అయితే, రుణ మంజూరు విషయంలో గోయల్‌కు ముడుపు లు అందినట్లు సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ఆ నిధులు గోయల్, ఆయన కుటుంబానికి చెందిన షెల్ కంపెనీల్లోకి బదిలీ అయినట్లు సీబీఐ గుర్తించింది. ఈ నేపథ్యంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ రంగంలోకి దిగి అరెస్ట్ చేసింది. మే 17న గోయల్‌ను పీఎంఎల్‌ఏ ప్రత్యేక కోర్టు ముందు హాజరుపర్చగా.. మే 21 వరకు ఈడీ కస్టడీకి కోర్టు అనుమతిచ్చింది.

## యుకె కుబేరుల జాబితాలో హిందుజా గ్రూప్

**ముంబై, మే 19:** 110 ఏళ్ల క్రితం ప్రారంభమైన హిందుజా గ్రూప్ ప్రస్తుతం 38దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా రవాణా, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, డిజిటల్ టెక్నాలజీ, మీడియా, ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్, లూబ్రికెంట్స్, స్పెషాలిటీ కెమికల్స్, ఎనర్జీ, రియల్ ఎస్టేట్, ట్రేడింగ్ వైద్య రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టింది. ఈ ప్రతిష్ఠాత్మక జాబితా బ్రిటన్‌లో నివసిస్తున్న 350 అత్యంత ధనవంతులు వారి కుటుంబాల ఆస్తులను లెక్కిస్తుంది. భూమి, ఆస్తులు, ప్రభుత్వ రంగ కంపెనీల షేర్లు, ఇతరత్రా లెక్కించదగిన సంపద ఆధారంగా ఈ ర్యాంకింగ్‌ను నిర్ణయిస్తారు. హిందుజా కుటుంబం బ్రిటన్ కుబేరుల జాబితాలో తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. వారి వ్యాపార సామ్రాజ్యం పరిమాణంలోనే కాకుండా, పరిధిలోనూ విస్తరిస్తోంది అని పేర్కొంది.గత ఏడాది కాలంలో హిందుజా గ్రూప్ భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల రంగంపై మరింత దృష్టి సారించింది. దేశంలో స్థిరమైన రవాణాకు ప్రోత్సాహం లభిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఎలక్ట్రిక్ వాహనాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి గణనీయమైన నిధులను కేటాయించింది. ఇది ఆటోమొబైల్ రంగంలో వారి సంస్థ తీసుకుంటున్న గ్రీన్ మార్పును సూచిస్తోంది. మా ఆవిష్కరణల ఆధారిత వృద్ధి లక్ష్యానికి అనుగుణంగా, భవిష్యత్తు రవాణా స్థిరమైన సాంకేతికతల్లో పెట్టుబడులు పెడుతున్నాం అని లండన్‌లో జరిగిన ఒక పరిశ్రమ సదస్సులో గ్రూప్ ప్రతినిధి తెలిపారు. అంతేకాకుండా, అశోక్ లేలాండ్ ఛైర్మన్ ధీరజ్ హిందుజా మాట్లాడుతూ, 2026 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో హిందుజా లేలాండ్ ఫైనాన్స్‌ను స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇది వారి దీర్ఘకాలిక ఆర్థిక వ్యూహాన్ని తెలియజేస్తోంది. హిందుజా ఫౌండేషన్ విద్య, వైద్యం, నీటి సంరక్షణ స్థిరమైన గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ, వారి దాతృత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సంస్థ యూకే భారతదేశంలో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతోంది. అందరినీ కలుపుకొని అభివృద్ధి సాధించాలనే వారి సిద్ధాంతాన్ని ఈ దాతృత్వ కార్యక్రమాలు ప్రతిబింబిస్తున్నాయి. ఈ సూత్రాన్ని గ్రూప్ వ్యవస్థాపకులు పరమానంద్ దీప్‌చంద్ హిందుజా నెలకొల్పారని చెబుతారు.



## భూమార్గాల దిగుమతులపై భారత్ నిషేధం

**ఢాకా, మే 19:** బంగ్లాదేశ్ నుంచి భూమార్గాల ద్వారా రేడీమేడ్ వస్త్రాల దిగుమతిపై భారత్ ఇటీవల నిషేధం విధించింది. నవా షెవా, కోల్‌కతా సీపోర్ట్స్ ద్వారా మాత్రమే దిగుమతులను అనుమతిస్తున్నట్లు తెలిపింది. ఈ చర్య భారతదేశ టెక్స్‌టైల్ తయారీ రంగానికి ఊతమిస్తుందని, దేశీయ ఉత్పత్తిదారులకు రూ.1,000 కోట్లకు పైగా వ్యాపారాన్ని సృష్టించగలదని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. స్థానిక తయారీని బలోపేతం చేయడం, విదేశీ కంపెనీలు అనుసరిస్తున్న వాణిజ్య లొసుగులను తగ్గించడం ఈ పాలసీ లక్ష్యంగా పెట్టుకున్నారు. స్థానిక ఉత్పత్తిని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం స్వల్పకాలిక సరఫరా గొలుసు అంతరాయాలకు దారితీయవచ్చని కొందరు అంచనా వేస్తున్నారు. లాజిస్టిక్స్‌లో సర్దుబాట్ల కారణంగా కొన్ని బ్రాండెడ్ వస్త్రాల ధరలు స్వల్పంగా పెరగవచ్చని పరిశ్రమ విశ్లేషకులు భావిస్తున్నారు. చైనాలోనికొన్ని కంపెనీలు తమ వస్త్రాలను బంగ్లాదేశ్‌లోకి ఎగుమతి చేసి, అక్కడి నుంచి సుంకం లేకుండా భారతదేశానికి ఎగుమతులు చేస్తున్నాయి. ఈ చర్యలను కట్టడి చేసేందుకు కూడా భారత్ తాజా నిర్ణయం తోడ్పడుతుందని భావిస్తున్నారు. భారత్ నుంచి పతినత, నూలు దిగుమతులపై బంగ్లాదేశ్ ఇటీవల ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఈ నిషేధ నిర్ణయం తీసుకున్నారు. రెండు దేశాల్లో మారుతున్న వాణిజ్యసంబంధాలను ఈపరిణామాలు హైలైట్ చేస్తున్నాయి. తాజా విధానం భారతీయ వ్యాపారాలను బలోపేతం చేయడానికి తోడ్పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14